www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI


గురువారం | 4-12-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 268 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి ఉ.8:38, పౌర్ణమి తె.4:43 వరకు, నక్షత్రం: కృత్తిక మ.2:54 తదుపరి రోహిణి, వర్జ్యం: తె.4:48-6:12, దుర్ముహూర్తం: ఉ.10:15-10:59, మ.2:39-3:23, అమృతఘడియలు: మ.12:48-2:12, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 6:34, సూర్యాస్తమయం: 5:35 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru









### జనరిక్ 'సెమాగ్లుటైడ్' తయారీకి

# డాక్టర్ రెడ్డీస్‌కు గ్రీన్ సిగ్నల్

## నోవో నార్డిస్క్‌కు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురు




న్యూఢిల్లీ: డెన్మార్క్ కేంద్రంగా పనిచేసే బహుళజాతి ఫార్మా కంపెనీ నోవో నార్డిస్క్‌కు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. వెయిట్‌లాస్ ఔషధం 'సెమాగ్లుటైడ్'ను డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ తయారుచేయకుండా అడ్డుకోవాలన్న కంపెనీ కుయుక్తులు బెడిసి కొట్టాయి. తమకు పేటెంట్ ఉన్న ఈ ఔషధాన్ని వచ్చే ఏడాది మార్చి వరకు డాక్టర్ రెడ్డీ ల్యాబ్స్ జనరిక్ ఔషధంగా తయారుచేసేందుకు వీల్లేదన్న కంపెనీ వాదనని ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ ఈ ఔషధాన్ని జనరిక్ రూపంలో తయారుచేసి దేశ, విదేశాల్లో మార్కెట్ చేసుకోవచ్చని తెలిపింది. అయితే నోవో నార్డిస్క్ కంపెనీకి పేటెంట్ హక్కులు లేని దేశాలకు మాత్రమే ఈ అనుమతి వర్తిస్తుందని స్పష్టం చేసింది.

**మరింత తగ్గనున్న ధర**

అమెరికా ఔషధ దిగ్గజం ఇలీ లిల్లీ ప్రవేశంతో నోవో నార్డిస్క్ కంపెనీ 'వెగోవి' ధరను ఇప్పటికే 37% తగ్గించింది. దీనికి తోడు ఎమ్‌కో ఫార్మాతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుని అమ్మకాలు పెంచుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఢిల్లీ హైకోర్టు తీర్పుతో దేశీయ ఫార్మా దిగ్గజాలు త్వరలోనే అత్యంత చౌకగా సెమాగ్లుటైడ్ జనరిక్ ఔషధాలను మార్కెట్‌కు తేనున్నాయి. దీంతో నోవో నార్డిస్క్ కంపెనీ ఔషధం వెగోవికి మన దేశంతో పాటు, తనకు పేటెంట్ హక్కులు లేని దేశాల్లోనూ గండి పడనుంది.

**రూ.850 కోట్ల మార్కెట్ :** ఊబకాయాన్ని తగ్గించడంతో పాటు చక్కెర వ్యాధి నియంత్రణ కోసం 'సెమాగ్లుటైడ్' ఔషధాన్ని ఉపయోగిస్తారు. ఈ పేటెంట్ ఔషధాన్ని నోవో నార్డిస్క్ కంపెనీ వెగోవీ పేరుతోను, ఇలీ లిల్లీ కంపెనీ మొంజారో పేరుతోను మన దేశంలో భారీ ధరతో మార్కెట్ చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ రెండు ఔషధాల అమ్మకాలు రూ.850 కోట్ల వరకు ఉన్నాయి. దేశీయ ఫార్మా కంపెనీలు చౌకగా జనరిక్ రూపంలో వెగోవీ ఔషధాన్ని తయారు చేసేందుకు ప్రయత్నించినా, పేటెంట్ హక్కుల పేరుతో నోవో నార్డిస్క్ అడ్డుకుంటోంది. అయితే విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ హైకోర్టు, డాక్టర్ రెడ్డీకు ఈ అనుమతి ఇచ్చినట్టు భావిస్తున్నారు.



**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,30,580 ▲ | 1,19,700 ▲ | 2,01,000 ▲ |
| విజయవాడ | 1,33,500 ▲ | 1,23,000 ▲ | 1,98,000 ▲ |
| విశాఖపట్నం | 1,32,680 ▲ | 1,19,350 ▲ | 2,01,000 ▲ |
| రాజమండ్రి | 1,30,580 ▲ | 1,19,700 ▲ | 1,84,000 ▲ |
| ప్రొద్దుటూరు | 1,27,900 ▲ | 1,17,670 ▲ | 1,78,000 ▲ |
| ముంబై | 1,28,210 ▼ | 1,17,440 ▼ | 1,78,190 ▼ |

**ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 122 | విజయవాడ | 125 |
| వరంగల్ | 122 | గుంటూరు | 132 |
| కరీంనగర్ | 122 | ఒంగోలు | 132 |
| మహబూబ్‌నగర్ | 122 | చిత్తూరు | 115 |
| కర్నూలు | 122 | నెల్లూరు | 120 |
| విశాఖపట్నం | 120 | అనంతపురం | 120 |
| గోదావరి | 125 | | |

# రూపాయి గాయానికి ఆర్‌బీఐ మందేమిటో..?

## ద్రవ్యపరపతి సమీక్ష షురూ ● రేపు నిర్ణయాల ప్రకటన ● కరెన్సీని ఆదుకునేందుకూ చర్యలు




ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన సమీక్ష బుధవారం ప్రారంభమైంది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మూడు రోజుల సమావేశంలో దేశ విదేశాల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులతో పాటు వృద్ధిరేటు, వడ్డీరేట్ల తీరుతెన్నులపై చర్చించనుంది. శుక్రవారం మల్హోత్రా ఎంపీసీ సమావేశం నిర్ణయాలను నిర్ణయాలను ప్రకటిస్తారు. అయితే, రూపాయి రోజుకో సరికొత్త కనిష్ఠ స్థాయికి క్షీణిస్తున్న తరుణంలో ఎంపీసీ భేటీ మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. రూపాయి పతనానికి అడ్డుకట్ట వేసేందుకు ఆర్‌బీఐ ఈసారి సమీక్షలో ఏం చర్యలు తీసుకుంటుందా అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కరెన్సీని ఆదుకునేందుకు ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటుందా..లేదా..? అనే అంశంపై మార్కెట్ స్పష్టత కోరుకుంటున్నదని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీస్, కరెన్సీ విభాగం వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది అన్నారు. ఈ మధ్యకాలంలో రూపాయి వరుసగా క్షీణిస్తూ రావడానికి ఫారెక్స్ కార్యకలాపాల్లో ఆర్‌బీఐ పెద్దగా జోక్యం చేసుకోకపోవడం కూడా ఒక కారణమన్నారు. ఈసారి సమీక్షలో కరెన్సీ పతనంపై ప్రస్తావించినప్పటికీ, డాలర్-రూపాయి మారకం స్థాయిపై ఆర్‌బీఐ గవర్నర్ వ్యాఖ్యానించకపోవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. రూపాయి మారకం విలువకు లక్ష్యాన్నేమీ నిర్దేశించుకోలేదని మల్హోత్రా ఈ మధ్యనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా అన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూపాయి మారకం విలువ 5.08% క్షీణించింది. ఇండోనేషియా రూపయ్య 3.17%, ఫిలిప్పీన్స్ పెసో 1.54%, హాంకాంగ్ డాలర్ 0.18% తగ్గాయి. వర్ధమాన మార్కెట్లలో అత్యధికంగా పతనమైన కరెన్సీల్లో రూపాయి మూడో స్థానంలో ఉంది. ఈ ఏడాదిలో అర్జెంటీనా పెసో 29.18%, టర్కిష్ లిరా 16.69% నష్టపోయాయి.

### రెపో యథాతథమా..?

ఈ అక్టోబరులో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం రికార్డు కనిష్ఠ స్థాయి 0.25 శాతానికి జారుకున్న నేపథ్యంలో ఆర్‌బీఐ ఈసారి సమీక్షలో రెపోరేటును మరో 0.25% తగ్గించవచ్చన్న అంచనాలున్నాయి. అయితే ఈ సెప్టెంబరు త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు సైతం ఆరు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 8.2 శాతానికి పెరిగిన నేపథ్యంలో ఈసారి రెపోను యథాతథంగా కొనసాగించేందుకూ అవకాశాలు ఉన్నాయని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. వడ్డీరేట్లపై యథాతథ స్థితి, భవిష్యత్ రేట్లపై తటస్థ వైఖరి రెండూ పతనమవుతున్న రూపాయిని ఆదుకునేందుకు సైతం దోహదపడతాయని వారన్నారు. ఈ ఫిబ్రవరి నుంచి ఆర్‌బీఐ మూడు విడతల్లో రెపోరేటును ఒక శాతం తగ్గించింది.



స్వర్గీయ ఊర్మిళాదేవి రమేశ్ చంద్ర అగర్వాల్ స్మారకార్థం నింటోలా గోశాలకు రూ.21 లక్షల విరాళం అందిస్తున్న ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ డైరెక్టర్లు విశాల్ అగర్వాల్, నీలేశ్ అగర్వాల్

### ఈనెల 10 నుంచి నెఫ్రోప్లస్ ఐపీఓ

**రూ.353 కోట్ల తాజా ఈక్విటీ జారీ**

నెఫ్రోప్లస్ బ్రాండ్‌నేమ్‌తో డయాలిసిస్ సేవలందిస్తున్న హైదరాబాద్ సంస్థ నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈనెల 10న ప్రారంభమై 12న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.353.4 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.27 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది. మొత్తంగా ఐపీఓ ద్వారా కంపెనీ రూ.2,000 కోట్ల వరకు సమీకరించే అవకాశముంది. తాజా ఈక్విటీ జారీ ద్వారా సమకరించే నిధుల్లో రూ.129 కోట్లతో భారత్‌లో మరిన్ని డయాలిసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు నెఫ్రోప్లస్ తెలిపింది. మరో రూ.136 కోట్లతో రుణ భారం తగ్గించుకోవడంతోపాటు ఇతర వ్యాపార కార్యకలాపాలకు వినియోగించుకోనుంది.

- ఔషధ సంస్థ కరోనా రెమెడీస్ రూ.655 కోట్ల ఐపీఓ ఈనెల 8న మొదలై 10న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.1,008-1,062గా నిర్ణయించింది.

### అమెరికాకు పెరిగిన భారత స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ మన దేశం నుంచి అమెరికాకు స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు భారీగా పెరిగాయి. అక్టోబర్ నెలలో భారత్ నుంచి యూఎస్‌కు స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు మూడు రెట్లకు పైగా పెరిగి 147 కోట్ల డాలర్లకు (సుమారు రూ. 12,936 కోట్లు) చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో ఈ విలువ రూ.4,048 కోట్లుగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబర్ మధ్య కాలంలో రూ.94,864 కోట్ల విలువైన స్మార్ట్ ఫోన్లు అమెరికాకు ఎగుమతైనట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇది గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ. 31,680 కోట్లతో పోలిస్తే మూడింతలు అధికం.

### సిల్వర్ సరికొత్త రికార్డు

**ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో రూ.1.84 లక్షలకు కిలో ధర**

వెండి ధర బంగారం కంటే వేగంగా పరిగెడుతోంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో (ఎంసీఎక్స్) వెండి ఫ్యూచర్స్ 2026 మార్చి కాంట్రాక్టు రేటు రూ.3,126 లేదా 1.72% పెరిగి సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.1,84,727కు చేరింది. గోల్డ్ ఫ్యూచర్స్ 2026 ఫిబ్రవరి కాంట్రాక్టు ధర కూడా రూ.1,007 పెరుగుదలతో రూ.1,30,766 వద్దకు చేరుకుంది.

### లెక్సస్ కొత్త కారు




లెక్సస్ ఇండియా తన ఆర్ఎక్స్ 350 కార్లలో "ఎక్స్‌క్విజిట్" గ్రేడ్‌ను మార్కెట్లోకి తెచ్చింది. మూడు వేరియెంట్లలో ఈ కారు రూ.89,99,000 నుంచి రూ.1,09,46,000 మధ్యలో అందుబాటులో ఉంటుందని కంపెనీ వెల్లడించింది.

### కార్గో హ్యాండ్లింగ్‌లో అదానీ కృష్ణపట్నం పోర్టు రికార్డు

ముత్తుకూరు (ఆంధ్రజ్యోతి): అదానీ కృష్ణపట్నం పోర్టు యాంత్రిక బెర్త్‌లో ఒకే ఒక్క రోజులో 1,32,800 మెట్రిక్ టన్నుల అత్యధిక పరిమాణంలో ఎరువుల రవాణా ద్వారా కొత్త రికార్డును నెలకొల్పింది. గత ఏప్రిల్ 20న నమోదు చేసిన రికార్డు 1,31,966 మెట్రిక్ టన్నులను అధిగమించింది. పోర్టు గత నవంబరులో అత్యధికంగా 0.43 మిలియన్ మెట్రిక్ టన్నుల నెలవారీ ఎరువుల రవాణాను విజయవంతంగా నిర్వహించిందని, 2023 డిసెంబరు నాటి 0.36 ఎంఎంటీలను అధిగమించిందని సీఈవో జగదీష్ పటేల్ తెలిపారు.

### డాలర్=12 లక్షల రియాల్స్ కుప్పకూలిన ఇరాన్ కరెన్సీ

టెహ్రాన్: ఇరాన్ కరెన్సీ రియాల్ మారకం విలువ సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. అమెరికా డాలర్‌తో పోలిస్తే ఏకంగా 12 లక్షల రియాల్స్‌కు చేరుకుంది. ఇప్పటికే ఆర్థిక కష్టాల్లో కొనసాగుతున్న ఇరాన్‌పై అమెరికా విధించిన అణు ఆంక్షలు ఆ దేశ కరెన్సీని భారీగా కుంగదీశాయి. దాంతో ధరలు భారీగా పెరుగుతూ పోతుండటంతో ఇరాన్ దేశస్థుల జీవనం దుర్భరంగా మారుతోంది.

### మళ్లీ 26,000 దిగువకు నిఫ్టీ

**రూ.2.79 లక్షల కోట్ల సంపద నష్టం**

ముంబై: స్టాక్ మార్కెట్ వరుసగా నాలుగో రోజూ నష్టపోయింది. లాభాల స్వీకరణ కారణంగా బుధవారం ప్రారంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 374.63 పాయింట్లు క్షీణించి 84,763.64 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. అయితే, ఐటీ స్టాక్స్‌తో పాటు ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లతో ఆఖరి గంట ట్రేడింగ్‌లో సూచీ మళ్లీ పుంజుకున్నప్పటికీ.. చివరికి 31.46 పాయింట్ల నష్టంతో 85,106.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 46.20 పాయింట్లు తగ్గి మళ్లీ 26,000 దిగువన 25,986 వద్ద ముగిసింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.2.79 లక్షల కోట్లు క్షీణించి రూ.469.67 లక్షల కోట్లకు జారుకుంది. ఎఫ్‌పీఐలు నికరంగా రూ.3,206.92 కోట్ల విలువ గల షేర్లు విక్రయించారు.

- బుధవారం ప్రారంభమైన మూడు ఐపీఓలకు ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. ఈ-కామర్స్ కంపెనీ మీషో ఇష్యూకు తొలిరోజున 2.35 రెట్ల బిడ్లు వచ్చాయి. ఏక్వస్ ఇష్యూకు 3.42 రెట్లు, విద్య వైర్స్ ఇష్యూకు 2.89 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**

| 4వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 651 | విజయవాడ | 670 |
| వరంగల్ | 653 | గోదావరి | 645 |
| చిత్తూరు | 663 | విశాఖపట్నం | 640 |
| | | డజను గుడ్లు రూ. 90 | |

# స్పోర్ట్స్

### నాలుగో ర్యాంక్‌కు విరాట్

దుబాయ్: సఫారీలతో వన్డే సిరీస్‌లో సెంచరీలతో దుమ్మురేపుతున్న విరాట్ కోహ్లీ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ముందుకెళ్లాడు. బ్యాటర్ల జాబితాలో ఓ స్థానం మెరుగుపరచుకొన్న విరాట్.. 751 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో నిలిచాడు. రోహిత్ శర్మ నెంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఇక శుభ్‌మన్ గిల్ నాలుగునుంచి ఐదో స్థానానికి పడిపోయాడు. బౌలర్లలో కుల్దీప్ యాదవ్ ఓ స్థానం మెరుగై ఆరో ర్యాంక్‌లో ఉన్నాడు.

### ఫిడే రేటెడ్ ప్లేయర్‌గా మూడేళ్ల చిన్నారి రికార్డు



న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌కు చెందిన సర్వగ్య సింగ్ కుష్వాహ ప్రపంచంలోనే అత్యంత పిన్న వయసులో ఫిడే రేటెడ్ ప్లేయర్‌గా గుర్తింపు పొంది చరిత్ర సృష్టించాడు. మూడు సంవత్సరాల ఏడు నెలల, 20 రోజుల్లో ఫిడే రేటింగ్ సాధించిన పిన్న క్రీడాకారుడిగా సర్వగ్య రికార్డు నెలకొల్పాడు. అంతకుముందు బెంగాల్‌కు చెందిన అనీష్ సర్కార్ మూడేళ్ల 8 నెలల వయసులో ఈ రికార్డు నెలకొల్పాడు. వాస్తవానికి సర్వగ్య ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఎక్కువగా చూస్తుండడంతో వాటి నుంచి దృష్టి మరల్చేందుకు అతడి తల్లిదండ్రులు చెస్‌ను నేర్పించడం మొదలుపెట్టారు. అలా చెస్ ప్రయాణం ప్రారంభించిన ఈ చిన్నారి ఆరు నెలలు తిరిగేసరికి ప్రొఫెషనల్ క్రీడాకారులను ఓడించడం విశేషం. ప్రస్తుతం ఈ బుడ్డోడి ఖాతాలో 1572 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఫిడే రేటింగ్ సాధించాలంటే ఒక అంతర్జాతీయ ప్లేయర్ ఓడించాల్సి ఉంది. అయితే సర్వగ్య ఏకంగా ముగ్గురు క్రీడాకారులను ఓడించి సంచలనం సృష్టించాడు.

## హార్దిక్, గిల్ వచ్చేశారు

**మళ్లీ జట్టులోకి బుమ్రా ● సఫారీలతో టీ20 సిరీస్‌కు టీమిండియా**





రాయ్‌పూర్: సఫారీలతో టెస్టు సిరీస్ సమయంలో మెడ నొప్పికి గురైన శుభ్‌మన్ గిల్, ఆసియా కప్ ఫైనల్‌కు ముందు గాయపడి చాన్నాళ్లు ఆటకు దూరమైన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తిరిగి జట్టులోకి వచ్చారు. ఈనెల 9 నుంచి దక్షిణాఫ్రికాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు టీమిండియాను బుధవారం ప్రకటించారు. సూర్యకుమార్ సారథ్యంలోని 15 మంది సభ్యుల ఈ బృందానికి వైస్ కెప్టెన్‌గా గిల్‌ను ఎంపిక చేశారు. అయితే, గిల్ జట్టుకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటాడా లేదా అన్నది సెంట్రల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ) ఇచ్చే ఫిట్‌నెస్ నివేదికపై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ తెలిపింది. పనిభారం దృష్ట్యా వన్డే సిరీస్ నుంచి విశ్రాంతి తీసుకున్న బుమ్రాను మళ్లీ జట్టులోకి తీసుకున్నారు. బ్యాటర్ రింకూ సింగ్‌పై వేటు వేశారు. సఫారీలతో ఈనెల 9, 11, 14, 17, 19 తేదీల్లో కటక్, చండీగఢ్, ధర్మశాల, లఖ్‌నవూ, అహ్మదాబాద్ వేదికలుగా ఈ మ్యాచ్‌లు జరుగుతాయి.

**టీ20 జట్టు**

సూర్యకుమార్ (కెప్టెన్), గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేశ్ (వికెట్ కీపర్), సంజూ శాంసన్ (వికెట్ కీపర్), బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్, కుల్దీప్, హర్షిత్ రాణా, వాషింగ్టన్.

### క్రికెట్‌కు మోహిత్ శర్మ గుడ్‌బై



న్యూఢిల్లీ: టీమిండియా వెటరన్ పేసర్ మోహిత్ శర్మ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. హరియాణాకు చెందిన 35 ఏళ్ల మోహిత్.. 34 అంతర్జాతీయ మ్యాచ్‌లకు ప్రాతినిథ్యం వహించాడు. 26 వన్డేలాడి 31 వికెట్లు తీసిన అతను.. 8 టీ20ల్లో 6 వికెట్లను ఖాతాలో వేసుకున్నాడు. 2015 వన్డే వరల్డ్‌కప్‌లోనూ సభ్యుడిగా ఉన్న మోహిత్.. ఆ టోర్నీలో 8 మ్యాచ్‌ల్లో 13 వికెట్లు తీశాడు. చివరిగా 2015లో జాతీయ జట్టుకు ప్రాతినిథ్యం వహించిన మోహిత్.. ఆ తర్వాత ఐపీఎల్‌లో రెగ్యులర్‌గా ఆడుతూ వచ్చాడు. ఈ ఏడాది గుజరాత్ టైటాన్స్‌కు ఆడాడు.



### టీ20 వరల్డ్‌కప్ జెర్సీ ఆవిష్కరణ

రాయ్‌పూర్: వచ్చే ఏడాది జరిగే టీ20 వరల్డ్‌కప్ కోసం రూపొందించిన భారత జట్టు కొత్త జెర్సీని రోహిత్ శర్మ ఆవిష్కరించాడు. బుధవారం ఇక్కడ దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో వన్డేలో ఇన్నింగ్స్ విరామం మధ్యలో ఈ కార్యక్రమం జరిగింది. రోహిత్ శర్మ, తిలక్ వర్మకు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, అడిడాస్ ఇండియా జీఎం విజయ్ చౌహాన్ కొత్త జెర్సీలను అందించారు. మైదానంలో ఒక భారీ జెర్సీని కూడా ప్రదర్శించారు.

**రాణాకు మందలింపు:** క్రమశిక్షణ కోడ్‌ను ఉల్లంఘించిన పేసర్ హర్షిత్ రాణాను ఐసీసీ మందలించింది. అంతేకాకుండా అతడి ఖాతాలో ఓ డిమెరిట్ పాయింట్ చేర్చింది. తొలి వన్డేలో బ్రేవిస్ అవుటైనప్పుడు అతడిని రెచ్చగొట్టేలా రాణా వ్యవహరించాడు.

### సీఎస్‌ను కలిసిన వరల్డ్‌కప్ విజేతలు



అమరావతి (ఆంధ్రజ్యోతి): ఇటీవల అంధుల క్రికెట్ ప్రపంచకప్‌ను గెల్చుకున్న భారత జట్టు సభ్యులు బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను కలిశారు. కెప్టెన్ దీపిక, జట్టు సభ్యురాలు కరుణకుమారి, కోచ్ అజయ్ కుమార్ రెడ్డి, ఏపీ క్రికెట్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు శరత్‌బాబు, రవీంద్రబాబు తదితరులు సీఎస్‌తో భేటీ అయ్యారు.

# 358 చాల్లేదు

**కోహ్లీ, గైక్వాడ్ శతకాలు వృథా**

## రెండో వన్డేలో భారత్‌పై దక్షిణాఫ్రికా గెలుపు

### మార్‌క్రమ్ సెంచరీ ● 1-1తో సిరీస్ సమం



మార్‌క్రమ్ (110)

కోహ్లీ (102)



రుతురాజ్ గైక్వాడ్ (105)

రాయ్‌పూర్: విరాట్ కోహ్లీ (93 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 102), రుతురాజ్ గైక్వాడ్ (83 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌లతో 105) శతకాలతో భారత్ భారీ స్కోరు చేసినా.. బౌలర్లు, ఫీల్డింగ్ వైఫల్యంతో కొండంత స్కోరును కాపాడుకోలేకపోయింది. మార్‌క్రమ్ (98 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 110)తోపాటు మిగతా బ్యాటర్లు రాణించడంతో.. బుధవారం హోరాహోరీగా జరిగిన రెండో వన్డేలో దక్షిణాఫ్రికా 4 వికెట్లతో భారత్‌ను ఓడించింది. మూడు వన్డేల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. తొలుత భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 358/5 స్కోరు చేసింది. రాహుల్ (43 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 66 నాటౌట్) రాణించాడు. యాన్సెన్ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 6 వికెట్లకు 362 పరుగులు చేసి గెలిచింది. బ్రిట్స్‌కే (68), బ్రేవిస్ (54) గెలుపులో కీలక పాత్ర పోషించారు. అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ చెరో 2 వికెట్లు తీశారు. మార్‌క్రమ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఆఖరిదైన మూడో వన్డే శనివారం విశాఖపట్నంలో జరగనుంది.

**రాణించిన బ్యాటర్లు..:** భారీ ఛేదనలో ఓపెనర్ డికాక్ (8)ను అర్ష్‌దీప్ స్వల్ప స్కోరుకే వెనక్కిపంపినా.. మార్‌క్రమ్‌తోపాటు మిగతా బ్యాటర్లు కలిసికట్టుగా ఆడి సౌతాఫ్రికాకు అద్భుత విజయాన్ని అందించారు. 53 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద మార్‌క్రమ్ ఇచ్చిన క్యాచ్‌ను జైస్వాల్ చేజార్చడంతో.. భారత్ భారీమూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. కెప్టెన్ బవుమా (46)తో కలసి రెండో వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్న మార్‌క్రమ్.. బ్రిట్స్‌కేతో కలసి మూడో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలుపుబాటలో నిలిపాడు. అయితే, సెంచరీ పూర్తి చేసుకొన్న మార్‌క్రమ్‌ను.. 30వ ఓవర్‌లో రాణా స్లో బంతితో బోల్తా కొట్టించడంతో.. భారత్ ఊపిరి పీల్చుకొంది. అప్పటికి సౌతాఫ్రికా విజయానికి 20 ఓవర్లలో ఇంకా 162 రన్స్ కావాలి. ఈ దశలో బ్రిట్స్‌కే, బ్రేవిస్ స్ట్రయిక్ రొటేట్ చేస్తూ స్కోరు బోర్డును నడిపించారు. ఈ క్రమంలో బ్రిట్స్‌కే హాఫ్ సెంచరీ పూర్తి చేయగా.. 40వ ఓవర్‌లో రాణా బౌలింగ్‌లో బ్రేవిస్ రెండు వరుస సిక్స్‌లతో గేర్ మార్చాడు. దీంతో లక్ష్యం చివరి 60 బంతుల్లో 77 పరుగులకు దిగివచ్చింది. అయితే, సిక్స్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న బ్రేవిస్‌ను కుల్దీప్ క్యాచవుట్ చేశాడు. బ్రిట్స్‌కేను ప్రసిద్ధ్.. యాన్సెన్ (2)ను అర్ష్‌దీప్ వెనక్కిపంపడంతో కొంత ఉత్కంఠ రేగినా.. జోర్జి (17 రిటైర్డ్ హర్ట్), బాష్ (29 నాటౌట్), కేశవ్ (10 నాటౌట్) 4 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించారు.

**డెత్‌లో డీలా..:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ (22), రోహిత్ (14) దూకుడైన ఆరంభాన్నిచ్చారు. ఐదో ఓవర్‌లో బర్గర్ బౌలింగ్‌లో 3 ఫోర్లు బాదిన రోహిత్.. అదే ఓవర్‌లో అవుటవగా.. జైస్వాల్ మరోసారి యాన్సెన్ బౌన్సర్‌కు బోల్తాపడ్డాడు. అయితే, కోహ్లీ, గైక్వాడ్ మూడో వికెట్‌కు 195 పరుగులు జోడించడంతో భారత్ భారీ స్కోరు చేసింది. కోహ్లీ, గైక్వాడ్ చక్కని సమన్వయంతో వికెట్ల మధ్య పరిగెత్తడంతోపాటు వీలుచిక్కినప్పుడల్లా షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. దీంతో 15 ఓవర్లు ముగిసే సరికి టీమిండియా 96/2తో నిలిచింది. గత మ్యాచ్‌లో స్వల్ప స్కోరుకే వెనుదిరిగిన గైక్వాడ్ ఈసారి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్నాడు. ఈ క్రమంలో 24వ ఓవర్‌లో మార్‌క్రమ్ బౌలింగ్‌లో రుతురాజ్ సింగిల్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. ఆ తర్వాతి ఓవర్‌లో కోహ్లీ కూడా అతడిని అందుకొన్నాడు. ఆత్మవిశ్వాసం పెరగడంతో రుతురాజ్ ఒక్కసారిగా గేర్‌మార్చాడు. 28వ ఓవర్‌లో కేశవ్ బౌలింగ్‌లో 4,6,4తో 16 పరుగులు పిండుకొన్న గైక్వాడ్.. ఆ తర్వాతి ఓవర్‌లో మరో రెండు ఫోర్లు కొట్టాడు. ఈ క్రమంలో గైక్వాడ్ కెరీర్‌లో తొలి శతకాన్ని పూర్తి చేసుకొన్నాడు. అయితే, యాన్సెన్ బౌలింగ్‌లో రుతురాజ్ మరో భారీ షాట్ ఆడే క్రమంలో జోర్జికి చిక్కాడు. మరోవైపు వరుసగా రెండో సెంచరీ బాదిన కోహ్లీని.. ఎన్‌గిడి అవుట్ చేయడంతో భారత్ స్కోరు వేగం మందగించింది. వాషింగ్టన్ సుందర్ (1) రనౌట్ కాగా.. డెత్ ఓవర్లలో రాహుల్, జడేజా (24 నాటౌట్) ఆశించినంత దూకుడుగా ఆడలేకపోయారు. కానీ, చివరి ఓవర్‌లో చెలరేగిన రాహుల్ 18 పరుగులు రాబట్టడంతో.. టీమ్ స్కోరు 350 మార్క్ దాటింది.

**7** — వన్డేల్లో దక్షిణాఫ్రికాపై విరాట్ కొట్టిన సెంచరీలు.

**53** — వన్డేల్లో విరాట్ సెంచరీల సంఖ్య. ఓవరాల్‌గా మూడు ఫార్మాట్ల (టెస్టుల్లో 30, టీ20ల్లో 1)లో కలిపి 84 శతకాలు ఉన్నాయి.

**స్కోరుబోర్డు**

**భారత్:** జైస్వాల్ (సి) బాష్ (బి) యాన్సెన్ 22, రోహిత్ (సి) డికాక్ (బి) బర్గర్ 14, కోహ్లీ (సి) మార్‌క్రమ్ (బి) ఎన్‌గిడి 102, రుతురాజ్ (సి) జోర్జి (బి) యాన్సెన్ 105, రాహుల్ (నాటౌట్) 66, వాషింగ్టన్ (రనౌట్) 1, జడేజా (నాటౌట్) 24, **ఎక్స్‌ట్రాలు: 24; మొత్తం: 50 ఓవర్లలో 358/5; వికెట్ల పతనం:** 1-40, 2-62, 3-257, 4-284, 5-289; **బౌలింగ్:** బర్గర్ 6.1-0-43-1, ఎన్‌గిడి 10-1-51-1, యాన్సెన్ 10-0-63-2, కేశవ్ 10-0-70-0, బాష్ 8-0-79-0, మార్‌క్రమ్ 5.5-0-48-0.

**దక్షిణాఫ్రికా:** మార్‌క్రమ్ (సి) రుతురాజ్ (బి) హర్షిత్ 110, డికాక్ (సి) వాషింగ్టన్ (బి) అర్ష్‌దీప్ 8, బవుమా (సి) హర్షిత్ (బి) ప్రసిద్ధ్ 46, బ్రిట్స్‌కే (ఎల్బీ) ప్రసిద్ధ్ 68, బ్రేవిస్ (సి) జైస్వాల్ (బి) కుల్దీప్ 54, జోర్జి (రిటైర్డ్ హర్ట్) 17, యాన్సెన్ (సి) రుతురాజ్ (బి) అర్ష్‌దీప్ 2, బాష్ (నాటౌట్) 29, కేశవ్ (నాటౌట్) 10, **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 49.2 ఓవర్లలో 362/6; వికెట్ల పతనం:** 1-26, 2-127, 3-197, 4-289, 5-317, 6-322, 6-332 (రిటైర్డ్ హర్ట్); **బౌలింగ్:** అర్ష్‌దీప్ 10-0-54-2, హర్షిత్ 10-0-70-1, ప్రసిద్ధ్ 8.2-0-85-2, వాషింగ్టన్ 4-0-28-0, జడేజా 7-0-41-0, కుల్దీప్ యాదవ్ 10-0-78-1.

**2** — 350కిపైగా పరుగులు చేసినా టీమిండియా మ్యాచ్ కోల్పోవడం ఇది రెండోసారి. 2019లో ఆస్ట్రేలియాతో వన్డేలో భారత్ 358/9 స్కోరు చేసినా.. ఓడింది.

**20** — వన్డేల్లో భారత్ వరుసగా టాస్ ఓడడం ఇది 20వసారి.

**11** — వన్డే క్రికెట్‌లో వరుస సెంచరీలు చేయడం కోహ్లీకిది పదకొండోసారి. ఈ జాబితాలో డివిల్లీర్స్ (6), రోహిత్ (4), బాబర్ ఆజమ్ (4), వార్నర్ (4), సయీద్ అన్వర్ (4) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 4-12-2025
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్
13
### 12 మంది మావోయిస్టుల మృతి
ముగ్గురు జవాన్ల మృత్యువాత.. ఇద్దరికి గాయాలు
బైంగఢ్ అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్
నక్సల్ నేత పాపారావు ఉన్నట్లు సందేహాలు

## కుమ్మేసిన వాన
నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు
వాకాడులో 28, సర్వేపల్లిలో 27.2 సెం.మీ.
చెరువులకు గండ్లు.. 10
కొట్టుకుపోయిన రహదారులు
నేడు చిత్తూరు, అన్నమయ్య, ప్రకాశం జిల్లాల్లోనూ భారీ వానలు

## ఇక పంచాయతీల్లో పాలన పరుగు
మినీ కలెక్టరేట్లుగా డీడీవో కార్యాలయాలు
పాలన బలోపేతం.. సమన్వయంతో అభివృద్ధి
డీడీవోలకు కీలక బాధ్యతలు
'అభివృద్ధి' శాఖలన్నీ ఒకే గొడుగు కిందకు
నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న పవన్ 11

## అమ్మో... స్క్రబ్ టైఫస్!
బ్యాక్టీరియా వ్యాప్తి తీవ్రం
రాష్ట్రంలో 736 కేసులు
అనధికారికంగా మరిన్ని..
విజయనగరం, పల్నాడు జిల్లాల్లో ముగ్గురు మృతి
జ్వరం, నల్లమచ్చలు ఉంటే జాగ్రత్త.. ప్రాణాంతకం కాదంటున్న నిపుణులు 10



# రైతు ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండ్

### అరకు కాఫీ స్థాయిలో ప్రచారం పొందాలి.. రైతాంగం కోసం త్వరలోనే ప్రణాళిక

> శాస్త్రవేత్తలు గదుల్లో కూర్చుని పరిశోధనలు చేస్తున్నామంటే కుదరదు. రైతుల అనుభవాలను కూడా కలుపుకొని ప్రయోగాలు చేయాలి. నిజానికి, ప్రాక్టికల్ సైంటిస్ట్‌లు రైతులే. డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడం వల్ల ఆదాయం వస్తుంది. దీనికోసం వినూత్న పద్ధతుల్లో విభిన్న పంటలు పండించాలి. చిత్తూరులో మామిడి పండుకు కవరు పెడితే, రేటు ఎక్కువ వచ్చింది. మేం (ప్రభుత్వం) రూపాయి ఇస్తే మీరు ఓ రూపాయి పెట్టుకోవాలి. అప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. - సీఎం చంద్రబాబు

పంటను వినియోగదారుకే అమ్మేలా చర్యలు
భూ రికార్డులు తారుమారు చేసిన జగన్
నచ్చనివాళ్ల భూమి నిషేధిత జాబితాలో..
సొంతదారుల హక్కులు నాడు పోగొట్టారు
అవన్నీ సరిచేస్తున్నాం.. సంజీవని తెస్తున్నాం
'రైతన్నా- మీకోసం'లో చంద్రబాబు వెల్లడి
'తూర్పు'లోని నల్లజర్ల సభలో నులకమంచంపై కూర్చుని రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి

రాజమహేంద్రవరం, నల్లజర్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): "రైతు ఉత్పత్తులు గ్లోబల్ బ్రాండ్‌లా ఉండాలి. అరకు కాఫీకి ఇవాళ ఆ బ్రాండ్ లభించింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మనం కూడా మారాలి. ఎక్కడో జరుగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధం ప్రభావం మన రైతులపై కనిపించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు కోపం వస్తే మన రొయ్య ధర పడిపోయింది. అందువల్ల సమష్టిగా, వినూత్నంగా పనిచేయాలి" అని సీఎం చంద్రబాబు అన్నారు. త్వరలోనే రైతుల కోసం

మిగతా 12వ పేజీలో...


నల్లజర్లలో 'రైతన్నా.. నీ కోసం' కార్యక్రమంలో ఇరువైపులా రైతులను కూర్చోబెట్టుకుని ముఖాముఖిలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

### దివ్యాంగులు ప్రతిభావంతులు
వారికి ఉచిత బస్సు ప్రయాణం
'స్థానికం'లో ఎక్స్-అఫిషియో పదవులు: సీఎం

### రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచం: సీఎం

## నేడే భారత్‌కు పుతిన్
రాత్రి ఏడు గంటలకు ఢిల్లీకి.. ప్రధాని ఇచ్చే విందుకు హాజరు
రేపు మోదీతో హైదరాబాద్ హౌస్‌లో సమావేశమై చర్చలు
ఎన్ఎస్‌జీ కమాండోలు, స్నైపర్లు, డ్రోన్లు, ఏఐతో ఐదంచెల భద్రత



న్యూఢిల్లీ, డిసెంబరు 3: రెండు రోజుల పర్యటన నిమిత్తం రష్యా అధ్యక్షుడు పుతిన్ గురువారం.. దేశ రాజధాని ఢిల్లీలో అడుగుపెట్టనున్నారు. పుతిన్ చివరిసారిగా 2021లో భారత్‌కు వచ్చారు. ఆ తర్వాత మళ్లీ రావడం ఇదే. షెడ్యూలు ప్రకారం ఆయన గురువారం సాయంత్రం 7 గంటలకు ఢిల్లీకి చేరుకుంటారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చే ప్రైవేట్ డిన్నర్‌కు హాజరవుతారు. శుక్రవారం ఉదయం రాష్ట్రపతి భవన్

మిగతా 2వ పేజీలో...

### ఆ దౌత్యవేత్తల తీరు అభ్యంతరకరం
ఫ్రాన్స్, జర్మనీ, యూకే రాయబారుల వ్యాసాన్ని తప్పుబట్టిన విదేశాంగశాఖ
రష్యాను విమర్శిస్తూ ఓ భారతీయ పత్రికలో వ్యాసం
పుతిన్‌కు శాంతి నెలకొల్పే ఆలోచనే లేదని ఆరోపణ



### రూపాయె
రూపాయి మహా పతనం
డాలర్‌తో రూ.90.15కు చేరిన విలువ
రూపాయి చరిత్రలో ఇదే అత్యంత బలహీన స్థాయి
విదేశీ మదుపరుల అమ్మకాల ఒత్తిడి, అమెరికాతో ఒప్పందంలో జాప్యం వల్లే..
పేద, మధ్యతరగతి వర్గాలపై రూపాయి పతనం ప్రభావం
2

### ఉన్నత విద్యలో ఎస్సీ, ఎస్టీ, బీసీలే అధికం!
జనరల్ విభాగం విద్యార్థుల్ని మించిన సంఖ్య
దేశవ్యాప్తంగా ఉన్నత విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు 60.8 శాతం
జనరల్ విద్యార్థులు 39%!
'అగ్రవర్ణాల ఆధిపత్యం' ఆరోపణలు అవాస్తవం!
ఐఐఎం ఉదయ్‌పూర్ అధ్యయనంలో వెల్లడి


12
అమరావతిలో చంద్రబాబు, లోకేశ్‌తో భేటీ అయిన అదానీ

### చంద్రబాబుతో గౌతం అదానీ భేటీ
సమావేశంలో మంత్రి లోకేశ్, కరణ్ అదానీ

### రోజుకు 5 గంటలు పార్టీకే
పదవుల కోసం సిఫారసులతో పనిలేదు: బాబు
కష్టించి పనిచేసేవారికి వాటంతట అవే వస్తాయి
ప్రతి ఒక్కరి సమాచారం నా దగ్గరుంది
కార్యకర్తలకు ఆగ్రహం వస్తే పార్టీకి ఇబ్బంది
వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలి
గోపాలపురం నియోజకవర్గ భేటీలో నేతలకు టీడీపీ అధినేత ఆదేశం
12

### విశాఖకు మరో గ్లోబల్ డేటా సెంటర్!
ముందుకొచ్చిన ఐటీ సంస్థ కంట్రోల్-ఎస్
350 మెగావాట్ల సెంటర్ స్థాపనకు ప్రతిపాదన
రెవెన్యూ అధికారులతో కలసి భూముల పరిశీలన
విశాఖ వచ్చేందుకు మరో రెండు కంపెనీలు ఆసక్తి

# రూపాయి మహా పతనం

## అమెరికా డాలర్‌తో రూ.90.15కు చేరిన విలువ



» రూపాయి చరిత్రలో ఇదే అత్యంత బలహీన స్థాయి

న్యూఢిల్లీ, డిసెంబరు 3: రూపాయి విలువ మహా పతనం కొనసాగుతోంది. అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ బుధవారం ఏకంగా రూ.90 దాటింది. కొంతకాలంగా వేగంగా పడిపోతున్న రూపాయి విలువ.. చరిత్రలోనే అత్యంత కనిష్ట స్థాయికి చేరింది. మంగళవారం ఒక డాలర్‌కు రూ.89.9475 ఉండగా.. బుధవారం ట్రేడింగ్ ఒకానొక దశలో రూ.90.30కు పడిపోయింది. చివరకు రూ.90.15 వద్ద స్థిరపడింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఆలస్యం కావటం, రూపాయి విలువను కాపాడేందుకు ఆర్బీఐ ఎలాంటి చర్యలు చేపట్టకపోవటం, విదేశీ సంస్థాగత పెట్టుబడులను(ఎఫ్ఐఐ) మదుపరులు వెనక్కి తీసుకోవటం రూపాయి పతనానికి ప్రధాన కారణాలని నిపుణులు పేర్కొంటున్నారు. రూపాయి పతనం ప్రభావం దేశంలోని పేద, మధ్యతరగతి వర్గాలపై భారీగా ఉంటుందని చెబుతున్నారు. ఒకవైపు జీడీపీ రేటు స్థిరంగా పెరుగుతుందని గణాంకాలు వెలువడుతుండగా, రూపాయి విలువ ఆగకుండా పతనం అవుతుండటంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### వచ్చే ఏడాది బలపడుతుంది: నాగేశ్వరన్

రూపాయి విలువ పతనంపై భయపడాల్సిన అవసరం ఏమీ లేదని, వచ్చే ఏడాది బలపడుతుందని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు. అయితే, ఈ ఏడాది ఆసియా దేశాల కరెన్సీల్లో భారత రూపాయి పరిస్థితే అత్యంత దారుణంగా ఉందని కొటక్ సెక్యూరిటీస్‌కు చెందిన అనంద్య బెనర్జీ తెలిపారు.

### వీరికి లాభం

● విదేశాల్లో సర్వీసులు అందించే ఐటీ, ఇతర వ్యాపార సంస్థలు రూపాయి పతనంతో లాభపడనున్నాయి. విదేశాలకు ఔషధాలు ఎగుమతి చేసే భారతీయ ఫార్మా కంపెనీలు కూడా లాభపడనున్నాయి.

● వస్త్రాలను ఎగుమతి చేసే టెక్స్‌టైల్స్ కంపెనీలు కూడా లాభపడుతాయి. అయితే, అమెరికాకు వెళ్లే భారతీయ ఉత్పత్తులపై ఆ దేశం 50 శాతం టారిఫ్ విధించటంతో భారతీయ కంపెనీలకు లాభాలు పెద్దగా ఉండకపోవచ్చనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

● విదేశాల నుంచి ఆదాయం పొందేవారికి రూపాయి పతనం శుభవార్తే. ఏటా భారత్‌కు విదేశాల నుంచి 138 బిలియన్ డాలర్ల వరకు ఈ రూపంలో వస్తున్నాయి. అంతర్జాతీయంగా రూపాయి విలువ తగ్గడం వల్ల ఇక్కడ మారకంలో ఎక్కువ డబ్బులు వస్తాయి.

### పతనానికి కారణాలు మూడు..

డాలర్‌తో రూపాయి మారకం విలువ దారుణంగా పడిపోవటానికి మూడు కారణాలు ఉన్నాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

1. కొంతకాలంగా మనదేశంలోకి విదేశీ వ్యవస్థాగత పెట్టుబడుల రాక తగ్గిందని, అదే సమయంలో ఇప్పటికే ఉన్న ఎఫ్ఐఐలను విదేశీ మదుపరులు వెనక్కి తీసేసుకుంటుండటంతో మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతిన్నదని చెబుతున్నారు.

2. రూపాయి విలువను కాపాడేందుకు ఆర్బీఐ జోక్యం చేసుకోకపోవటం రెండో కారణంగా చెబుతున్నారు. రూపాయి విలువ పడిపోతున్నప్పుడు ఆర్బీఐ తన వద్ద ఉన్న డాలర్ల నిధుల్లో కొంతమొత్తాన్ని అమ్మేసి రూపాయి విలువను స్థిరీకరిస్తూ ఉంటుంది.

3. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ఇంకా చర్చలు కొలిక్కి రాలేదు. భారత్‌పై ట్రంప్ భారీగా టారిఫ్‌లు విధించారు. ఇవి కూడా రూపాయి పతనానికి కారణాలని చెబుతున్నారు.

### రూపాయి పతనం ప్రభావాల్లో కొన్ని..

రూపాయి విలువ పడిపోతే మొదట ప్రభావితం అయ్యేవి దిగుమతులు. మనకు అవసరమైన చమురులో 90 శాతాన్ని, వంటనూనెల్లో 60 శాతాన్ని విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇప్పుడు ఇవి మరింత ప్రియం కానున్నాయి. పెట్రోల్, డీజిల్, వంటనూనెలు, ఎల్పీజీ ధరలు పెరిగే అవకాశం ఉంది. విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న భారతీయ విద్యార్థుల ఖర్చులు తడిసి మోపెడవుతాయి. డాలర్ల రూపంలో విద్యారుణం తీసుకున్న విద్యార్థులు ఇప్పుడు తిరిగి చెల్లించటం మరింత భారం అవుతుంది.

## బీజేపీకి టాటా ట్రస్టు నుంచి రూ.757 కోట్లు

» 2024 లోక్‌సభ ఎన్నికల్లో భారీగా అందిన విరాళాలు

» రూ.10 కోట్ల చొప్పున బీఆర్ఎస్, వైసీపీలకు

న్యూఢిల్లీ, డిసెంబరు 3: గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో బీజేపీకి విరాళాల వరద పోటెత్తింది. టాటా గ్రూప్ నేతృత్వంలోని ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్ట్(పీఈటీ) నుంచి 2024 పార్లమెంటు ఎన్నికల సమయంలో బీజేపీకి రూ.757 కోట్లు అందాయి. ఆ ఎన్నికల సమయంలో మొత్తం 10 రాజకీయ పార్టీలకు పీఈటీ రూ.914 కోట్లను విరాళాలుగా అందించగా.. దీనిలో 83% నిధులు ఒక్క బీజేపీకే అందడం విశేషం. పీఈటీ నుంచి కాంగ్రెస్ పార్టీ రూ.77.3 కోట్లు అందుకుంది. బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు పశ్చిమబెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ(టీఎంసీ), ఏపీకి చెందిన వైసీపీ, మహారాష్ట్రకు చెందిన శివసేన, ఒడిశాకు చెందిన బీజేడీ, తెలంగాణకు చెందిన బీఆర్ఎస్, బీహార్‌కు చెందిన ఎల్జేపీ, జేడీయూ, తమిళనాడుకు చెందిన డీఎంకే పార్టీలకు రూ.10 కోట్ల చొప్పున పీఈటీ విరాళాలుగా అందించింది. ఇదిలా ఉండగా, 2024-25 సంవత్సరంలో వివిధ ట్రస్టులు, సంస్థల నుంచి కాంగ్రెస్‌కు మొత్తం రూ.517.37 కోట్లు విరాళాలుగా అందాయి. ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి రూ.216.33 కోట్లు, ఏబీ జనరల్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి రూ.15 కోట్లు, న్యూ డెమొక్రటిక్ ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా రూ.5 కోట్లు, జన్ కల్యాణ్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి రూ.9.5 లక్షల చొప్పున కాంగ్రెస్‌కు విరాళాలుగా అందాయి.

## ఆ 32వేల మంది ఉపాధ్యాయుల నియామకాలు చెల్లుతాయ్

» పశ్చిమ బెంగాల్‌లో 2014లో నిర్వహించిన టెట్‌పై కలకత్తా హైకోర్టు డివిజన్ బెంచ్ కీలక తీర్పు

కోల్‌కతా, డిసెంబరు 3: పశ్చిమబెంగాల్‌లో తీవ్ర వివాదాస్పదమైన 'ఉపాధ్యాయ నియామకాల కుంభకోణం' వ్యవహారంపై కలకత్తా హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. 32వేల మంది ప్రైమరీ టీచర్ల నియామకాన్ని రద్దు చేస్తూ సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ కొట్టేసింది. ఆ టీచర్ల నియామకాలు చెల్లుబాటు అవుతాయని తీర్పునిచ్చింది. 2014లో టెట్ ద్వారా ఉపాధ్యాయులుగా నియమితులైనవారందరూ అక్రమంగా ఉద్యోగాల్లో చేరినట్లు దర్యాప్తులో తేలలేదని ఈ సందర్భంగా గుర్తుచేసింది. "264మంది మాత్రమే డబ్బులిచ్చి ఉద్యోగంలో చేరారని సీబీఐ దర్యాప్తులో తేలింది. మరో 96మంది పాత్ర అనుమానాస్పదంగా ఉంది. ఈ నేపథ్యంలో మొత్తం 32వేల మంది నియామక ప్రక్రియనే రద్దు చేయడం సరికాదు. తొమ్మిదేళ్లుగా వారంతా సర్వీసులో ఉన్నారు. ఇప్పుడు ఆ నియామకాలను రద్దు చేస్తే, వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుంది" అని కోర్టు వ్యాఖ్యానించింది. వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ తీర్పు మమత ప్రభుత్వానికి కొంత ఉపశమనం కలిగించనుంది. డివిజన్ బెంచ్ తీర్పును బెంగాల్ విద్యాశాఖ మంత్రి బ్రత్య బసు స్వాగతించారు. పశ్చిమ బెంగాల్‌లో 2014లో టెట్ జరిగింది. అయితే, పరీక్ష నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

## తనకన్నా ఎవ్వరూ అందంగా ఉండొద్దని..

» కుమారుడు సహా నలుగురు చిన్నారులను హత్యచేసిన మహిళ.. హరియాణాలో ఘోరం



పూనమ్

పానిపట్, డిసెంబరు 3: మేళతాళాల మధ్య సందడిగా ఉన్న ఆ పెళ్లి వేడుక క్షణాల్లో విషాదంగా మారింది. ఓ ఆరేళ్ల బాలిక నీటితొట్టెలో విగతజీవిగా కనిపించింది. ఆ చిన్నారి ప్రమాదవశాత్తు చనిపోలేదని, ఆమెను స్వయానా ఆమె మేనత్తే హత్యచేసిందని తెలిసి అంతా నిర్ఘాంత పోయారు. హరియాణాలోని పానిపత్‌లో సోమవారం ఈ దారుణ ఘటన జరిగింది. మరింత దిగ్ర్భాంతికి గురిచేసే అంశమేమిటంటే.. ఆ చిన్నారినే కాదు గతంలో తన కుమారుడు సహా ముగ్గురు చిన్నారులను ఆమె ఇలానే హత్యచేసిందని పోలీసులు తేల్చారు. తన కన్నా అందంగా ఎవ్వరూ ఉండొద్దనే ఉద్దేశంతోనే ఆమె ఇంతటి ఘాతుకానికి పాల్పడిందని విచారణలో తేలింది. నిందితురాలిని పూనమ్‌గా గుర్తించారు. పెళ్లి వేడుకలో ఆమె హత్యచేసిన చిన్నారి పేరు విధి. ఈ ఏడాది ఆగస్టులో పూనమ్, సివాహ్ గ్రామంలో ఓ బాలికను చంపేసింది. 2023లో పూనమ్, మొదటి హత్య చేసింది. తనకన్నా ముద్దుగా కనిపిస్తోందనే ఉద్దేశంతో తన వదిన కుమార్తె ప్రాణాలు తీసింది. ఈ ఘటనకు సంబంధించి తననెవ్వరూ అనుమానించకుండా ఉండేందుకు తన పేగు తెంచుకొని పుట్టిన కుమారుడిని పూనమ్ చంపేసింది. గతంలో జరిగిన ఈ మూడు మరణాలు ప్రమాదవశాత్తు జరిగినవేనని ఇప్పటిదాకా అంతా అనుకున్నారు. తాజాగా బాలిక విధి హత్య మిస్టరీ తేలాకే.. గతంలో ముగ్గురిని పూనమ్ చంపినట్లు తేలింది. నలుగురు చిన్నారులనూ ఆమె ఒకే విధంగా నీటి తొట్టెలో ముంచి చంపేసింది. నిందితురాలిని పోలీసులు అరెస్టు చేశారు.

## 13 ఏళ్ల బాలుడికి తుపాకీ ఇచ్చి చంపించారు

» అఫ్ఘానిస్థాన్‌లో 80వేల మంది చూస్తుండగా మరణ శిక్ష

న్యూఢిల్లీ, డిసెంబరు 3: అఫ్ఘానిస్థాన్‌లో 80వేల మంది జనం చూస్తుండగా ఓ వ్యక్తిని తాలిబన్లు బహిరంగంగా కాల్చి చంపించారు. అంతకుమించి దిగ్ర్భాంతికరమైన విషయం ఏమిటంటే ఆ వ్యక్తిని కాల్చి చంపింది పాలబుగ్గల వయసున్న ఓ 13 ఏళ్ల బాలుడు! శిక్షకు గురైంది ఖోస్ట్ ప్రావిన్సులోని కుజి అబుఖానీ ప్రాంతానికి చెందిన మంగల్ అలియాస్ తలాఖాన్ అనే వ్యక్తి. 10నెలల క్రితం అబ్దుల్ రహమాన్ సహా అతడి కుటుంబంలోని 13 మందిని మంగల్ కాల్చి చంపాడు. మృతుల్లో తొమ్మిది మంది చిన్నారులు, ముగ్గురు మహిళలున్నారు. ఈ కేసులో మంగల్‌ను అఫ్ఘానిస్థాన్ సుప్రీంకోర్టు దోషిగా నిర్ధారించి మరణ శిక్ష విధించింది. బాధిత కుటుంబంలో 13 ఏళ్ల బాలుడొక్కడే ప్రాణాలతో మిగిలాడు. ఖోస్ట్ ప్రావిన్సులోని ఓ స్టేడియంలో మంగళవారం 80వేల మంది ప్రజలు చూస్తుండగా దోషి మంగల్‌ను పెడరెక్కలు విరిచి కట్టి నిల్చోబెట్టారు. ఆ సమీపంలోనే బాధిత కుటుంబానికి చెందిన బాలుడిని నిల్చోబెట్టారు. ఆ చిన్నారిని ఉద్దేశించి.. "దోషిని క్షమించి ప్రాణాలతో వదిలేస్తావా?" అని తాలిబన్ ప్రతినిధులు ప్రశ్నించారు. దీనికి ఆ బాలుడు తిరస్కరించగా.. అతడి చేతికి తుపాకీ ఇచ్చారు. ఆ వెంటనే బాలుడు, మంగల్‌వైపు తుపాకీని గురిపెట్టి మూడు రౌండ్ల కాల్పులు జరిపాడు. మంగల్ అక్కడికక్కడే మృతిచెందాడు.

## బంగ్లాకు పంపేసిన ఆ గర్భిణిని భారత్‌కు తీసుకురండి

న్యూఢిల్లీ, డిసెంబరు 3: భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు ఇటీవల బహిష్కరింపబడిన గర్భిణి, ఆమె ఎనిమిదేళ్ల కుమారుడిని తిరిగి భారతదేశానికి తీసుకొచ్చేందుకు సుప్రీం కోర్టు బుధవారం అనుమతినిచ్చింది. ఆ గర్భిణి విషయంలో మానవత కోణంలో వ్యవహరించాలని సూచించింది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం కూడా అంగీకరించింది. సదరు గర్భిణి, మైనర్ బాలుడి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. బంగ్లాదేశీయులను భారత్ నుంచి తిరిగి పంపేసే క్రమంలో భారత పౌరసత్వానికి సంబంధించిన సరైన పత్రాలు లేని కారణంగా ఢిల్లీకి చెందిన సునాలీ ఖాతూన్ అనే గర్భిణి, ఆమె ఎనిమిదేళ్ల కుమారుడిని 2025 జూన్ 27 బంగ్లాకు పంపేశారు.

## ఖర్గే భుజాలకు రాహుల్ మసాజ్




న్యూఢిల్లీ, డిసెంబరు 3: కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే భుజాలకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మసాజ్ చేశారు. ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి సందర్భంగా బుధవారం పార్లమెంటులో జరిగిన నివాళి కార్యక్రమంలో ఈ ఆసక్తికర దృశ్యం చోటుచేసుకుంది. ఈ దృశ్యం నెట్‌లో వైరల్ అయింది. ఇక ఇదేరోజు పార్లమెంట్ కాంప్లెక్స్‌లో ప్రియాంకా గాంధీ ఓ దివ్యాంగురాలి పక్కన కూర్చుని ఫొటో దిగారు. ప్రియాంక తనతో ఫొటో దిగడంతో ఆ యువతి మొహంలో కొండంత ఆనందం కనిపించింది. నెట్‌లో ఈ వీడియోను చూసి ప్రియాంకపై నెటిజన్లు ప్రశంసలు కురిపించారు.

## 1,232 'ఇండిగో' విమానాలు రద్దు

» కొద్ది రోజులుగా సంస్థలో తీవ్ర సమస్యలు.. ఇండిగో క్షమాపణలు

న్యూఢిల్లీ, ముంబై/ శంషాబాద్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద పౌరవిమానయాన సంస్థ ఇండిగో సేవల్లో అంతరాయం నెలకొని దేశవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతర్గత సమస్యలతో సతమతం అవుతున్న ఇండిగో.. గత కొన్ని రోజుల్లోనే ఏకంగా 1,232 సర్వీసులను రద్దు చేసినట్లు డీజీసీఏ బుధవారం ప్రకటించింది. సంస్థ నిర్వహిస్తున్న మొత్తం సర్వీసుల్లో బుధవారం 35% విమానాలే నడిపినట్లు తెలిపింది. సిబ్బంది కొరతతో 755 సర్వీసులు, ఏటీసీ సమస్యలతో 92 సర్వీసులు నిలిచిపోయినట్లు వెల్లడించింది. సర్వీసుల నిర్వహణలో వైఫల్యంపై డీజీసీఏ ప్రధాన కార్యాలయానికి స్వయంగా వచ్చి వివరణ ఇవ్వాలని ఇండిగో యాజమాన్యాన్ని ఆదేశించింది. హైదరాబాద్, బెంగళూరు, ముంబైలతోపాటు పలు విమానాశ్రయాల్లో మంగళ, బుధవారాల్లో ఇండిగో సర్వీసులు రద్దు కావటంతో ప్రయాణికులు ఆ సంస్థ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన ఫొటోలు, వీడియోలు వైరలయ్యాయి. ఈ నేపథ్యంలో, ప్రయాణికులకు క్షమాపణ చెబుతూ ఇండిగో ఒక ప్రకటన విడుదల చేసింది. 'సాంకేతిక, నిర్వహణాపరమైన సమస్యలు, విమానాశ్రయాల్లో నెలకొన్న రద్దీ కారణంగా గత రెండు రోజులుగా మా సర్వీసుల్లో అంతరాయం తలెత్తింది. దీనిని నివారించటానికి చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన చోట్ల ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. రీఫండ్ ఇస్తున్నాం' అని తెలిపింది. బుధవారం శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన, ఇక్కడికి రావాల్సిన ఇండిగోకు చెందిన 40 సర్వీసులు రద్దయ్యాయి. ఎయిర్‌పోర్టులో గందరగోళం ఏర్పడింది. కేరళలోని శబరిమల ఆలయానికి వెళ్లడానికి ఎయిర్‌పోర్టుకు వచ్చిన అయ్యప్ప స్వాములు విమానం రద్దు కావడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం షెడ్యూల్‌కు సంబంధించి మరో 18 విమాన సర్వీసులను ఇండిగో రద్దుచేసినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాల్లోని చెక్‌ఇన్ వ్యవస్థల్లో బుధవారం ఉదయం అంతరాయం తలెత్తింది. పలు విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి. ఈ అంతరాయానికి కారణాలేమిటన్నది అధికారికంగా వెల్లడి కాకపోయినా.. మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సమస్యల వల్లేనంటూ వారణాసి విమానాశ్రయంలో ప్రయాణికులకు ఒక మెసేజీని ప్రదర్శించారు. అయితే, మైక్రోసాఫ్ట్ దీన్ని ఖండించింది.

## లోకం తీరు




## ఉన్నత విద్యలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులే అధికం!

» జనరల్ విభాగాన్ని మించి సంఖ్య

» ఐఐఎం ఉదయ్‌పూర్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 3: దేశవ్యాప్తంగా ఉన్నత విద్యలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన రిజర్వేషన్ కోటా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. ఎంతలా అంటే.. జనరల్ విభాగం విద్యార్థుల సంఖ్యనూ మించిపోయారు! 2010-11లో దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులు 43.1% ఉండగా.. 2022-23 నాటికి అది 60.8 శాతానికి పెరగడం గమనార్హం! ఒక్క 2023లోనే జనరల్ విభాగం విద్యార్థుల కంటే ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ విద్యార్థుల నమోదు 95 లక్షలు ఎక్కువగా ఉండడం విశేషం. అదేసమయంలో 2011లో 57 శాతంగా ఉన్న జనరల్ విద్యార్థుల సంఖ్య 2023 నాటికి (ఆర్థికంగా వెనకబడిన కోటా విద్యార్థులను కలిపినా కూడా..) 39 శాతానికి పడిపోయింది. ఈ విషయాలు ఐఐఎం ఉదయ్‌పూర్‌కు చెందిన పరిశోధకుల అధ్యయనంలో వెల్లడయ్యాయి. కేంద్ర విద్యా శాఖ 15 ఏళ్ల తర్వాత 'ఉన్నత విద్యపై అఖిల భారత సర్వే (ఏఐఎస్‌హెచ్‌ఈ)' వార్షిక నివేదికలను ప్రచురించడం ప్రారంభించగా.. వాటిని ఐఐఎం ఉదయ్‌పూర్‌కు చెందిన పరిశోధకుల బృందం విశ్లేషించినట్లు విద్యా పరిశోధనా సంస్థ 'క్యాస్ట్‌ఫైల్స్' ఓ ప్రకటనలో తెలిపింది. 'భారతీయ ఉన్నత విద్యా రంగంలో విద్యార్థుల సామాజిక సమతుల్యతపై విస్తృతంగా ప్రచారంలో ఉన్న అనేక అపోహలకు ఈ నివేదిక తెరదించుతుంది' అని ప్రొఫెసర్ కృష్ణమూర్తి అన్నారు. దేశంలో విస్తృతంగా ప్రచారంలో ఉన్నదానికి భిన్నంగా ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులు ఆధిపత్యం చెలాయిస్తున్నారని.. వారి సంఖ్య జనరల్ కేటగిరీ విద్యార్థులను మించిపోయిందని తెలిపారు. అన్ని రకాల విద్యాసంస్థల్లో ఇదే సరళి ఉందని వెల్లడించారు.

## 'సర్'పై రచ్చ వద్దు.. అసెంబ్లీ పైనే దృష్టి

» బెంగాల్ బీజేపీ ఎంపీలకు మోదీ దిశానిర్దేశం

న్యూఢిల్లీ, డిసెంబరు 3: ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (సర్) చాలా సాధారణ అంశమని.. అనవసర రచ్చ చేసి వివాదాస్పదంగా మార్చవద్దని పశ్చిమబెంగాల్ బీజేపీ ఎంపీలకు ప్రధాని మోదీ స్పష్టం చేశారు. వచ్చే ఏడాది మొదట్లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో బుధవారం ఆయన పార్లమెంటు ప్రాంగణంలో ఆ రాష్ట్ర బీజేపీ ఎంపీలు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శామిక్ భట్టాచార్య, కేంద్ర మంత్రులు శంతను ఠాకూర్, సుకాంత మజుందార్‌లతో సమావేశమయ్యారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. అంతా నియోజకవర్గాల్లో ఉండి పార్టీ వ్యూహాలను పక్కాగా అమలు చేయడంపై దృష్టిపెట్టాలని చెప్పారు.

## మోదీపై ఏఐ 'చాయ్‌వాలా' వీడియో

న్యూఢిల్లీ, డిసెంబరు 3: ప్రధాని మోదీపై కాంగ్రెస్ సీనియర్ నేత రాగిణి నాయక్ సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టు కలకలం రేపుతోంది. ఓ గ్లోబల్ కార్యక్రమంలో సూటు వేసుకుని టీ కెటిల్, గ్లాసులు పట్టుకుని చాయ్ చాయ్ అని అరుస్తూ మోదీ వెళ్తున్నట్లు ఏఐతో రూపొందించిన వీడియోను ఆమె మంగళవారం రాత్రి పోస్టుచేశారు. తన చిన్నతనంలో గుజరాత్‌లోని వాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో తన తండ్రి టీ అమ్మేవాడని.. తాను సాయపడేవాడినని మోదీ గతంలో వెల్లడించారు. రాగిణి పోస్టుపై బీజేపీ మండిపడింది. ఓబీసీ ప్రధాని కావడాన్ని సోనియా, రాహుల్ జీర్ణించుకోలేకపోతున్నారని, ఇది 140 కోట్ల మంది భారతీయులకు అవమానమని విమర్శించింది.

## అక్రమ చొరబాటుదారులపై యోగి కొరడా

లఖ్‌నవూ, డిసెంబరు 3 : అక్రమ చొరబాటుదారులపై ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బంగ్లాదేశీ, రోహింగ్యా చొరబాటుదారులను గుర్తించి ప్రత్యేక నిర్బంధ కేంద్రాల్లో ఉంచాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతి డివిజన్‌లోనూ ఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్లు ఒక సీనియర్ ఉత్తర్‌ప్రదేశ్ అధికారి బుధవారం చెప్పారు. ఇప్పటికే తమ పరిధిలో ఉన్న అక్రమ చొరబాటుదారుల జాబితాలను తయారుచేయాల్సిందిగా రాష్ట్ర వ్యాప్తంగా 17 మున్సిపాలిటీలకు సీఎం యోగి ఆదేశించారని చెప్పారు.

## 'సంచార్ సాథీ'పై పీఛేముడ్!

### ఫోన్లలో తప్పనిసరిగా ప్రీఇన్‌స్టాల్ చేయాలన్న ఆదేశాలు వెనక్కి తీసుకున్న కేంద్రం



ఢిల్లీలో వాయు నాణ్యత దారుణంగా పడిపోయిన నేపథ్యంలో ప్రభుత్వానికి నిరసన తెలుపుతూ కాంగ్రెస్ ఎంపీ దీపేందర్‌సింగ్ హుడా, మరికొందరు ప్రతిపక్ష ఎంపీలు గ్యాస్ మాస్కులు ధరించి పార్లమెంటులోకి వచ్చారు. ఎంపీ ఇమ్రాన్ మసూద్ ఆక్సిజన్ ట్యాంకు తీసుకుని వచ్చారు. ఇక సోనియా, రాహుల్, ప్రియాంక సహా పలువురు ఎంపీలు మాస్కులు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

న్యూఢిల్లీ, డిసెంబరు 3: స్మార్ట్‌ఫోన్లలో 'సంచార్ సాథీ' యాప్‌ను తప్పనిసరిగా ముందస్తు ఇన్‌స్టలేషన్ (ప్రీఇన్‌స్టాల్) చేయాలన్న ఆదేశాలపై కేంద్రం వెనక్కి తగ్గింది. దీనికి సంబంధించి మొబైల్ ఫోన్ తయారీ సంస్థలకు జారీ చేసిన ఆదేశాలను ఉప సంహరించుకుంటున్నట్టు టెలికం శాఖ (డీఓటీ) బుధవారం ప్రకటించింది. ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటున్న వారి సంఖ్య వేగంగా పెరుగుతోందని, అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. బుధవారం సాయంత్రం టెలికం శాఖ దీనిపై ప్రకటన విడుదల చేసింది. "పెద్దగా అవగాహన లేని ప్రజలకు కూడా ఈ యాప్‌ను చేరువ చేయాలన్న ఉద్దేశంతోనే తప్పనిసరిగా ప్రీఇన్‌స్టాల్ చేయాలన్న ఆదేశాలు జారీ చేశాం. మంగళవారం ఒక్కరోజే 6 లక్షల మంది సంచార్ సాథీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఇది పదింతలు ఎక్కువ. డౌన్‌లోడ్లు వేగంగా పెరుగుతున్నాయి. ఇప్పటివరకు కోటిన్నర మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ప్రజల్లో మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో.. తప్పనిసరిగా ప్రీఇన్‌స్టాల్ చేయాలన్న ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది" అని తెలిపింది. ఇదిలా ఉండగా, పాన్ మసాలా ప్యాకెట్లన్నింటిపై తప్పనిసరిగా రిటైల్ విక్రయ ధర(ఆర్ఎస్‌పీ) ఉండాల్సిందేనని కేంద్ర వినియోగ వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది. ప్యాకేజీ పరిమాణం లేదా బరువుతో సంబంధం లేకుండా ఈ నిబంధనను అమలు చేయాలని పేర్కొంది. ఇది ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నట్టు తెలిపింది. ఇంతకు ముందు 10 గ్రాములు లేదా అంతకన్నా తక్కువ బరువున్న చిన్న ప్యాక్‌లకు కొన్ని ప్రకటనల విషయంలో మినహాయింపులు ఉండేవి. కానీ ఇప్పుడు ఈ చిన్న ప్యాక్‌లు కూడా తమ లేబుల్స్‌పై కచ్చితంగా ముద్రించాలి.

### భారత్‌లో 72 వేల విదేశీ విద్యార్థులు

భారత్‌లోని ఉన్నత విద్యా సంస్థల్లో సుమారు 200 దేశాల నుంచి 72,218 మంది విదేశీ విద్యార్థులు వివిధ కోర్సులను అభ్యసిస్తున్నారని కేంద్రం బుధవారం నాడు రాజ్యసభకు తెలియజేసింది. భారతీయ విద్యా సంస్థలను ప్రపంచ స్థాయి పరిశోధన కేంద్రాలుగా తీర్చిదిద్దడానికి ఉద్దేశించిన 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్' (ఐవోఈ) పథకం కింద 8 ప్రభుత్వ సంస్థలకు రూ.6,198.99 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొంది.

## భౌభౌ.. అన్న రేణుక

బీజేపీ సభా హక్కుల తీర్మానానికి స్పందన



న్యూఢిల్లీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌కు తన పెంపుడు శునకాన్ని తీసుకురావడమే కాక.. కరిచేవాళ్లు లోపల ఉన్నారంటూ వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి బుధవారం మీడియా ముందు భౌ భౌ అని అన్నారు. బీజేపీ ఎంపీలు మీపై సభా హక్కుల తీర్మానం ప్రవేశపెట్టనున్నారని విలేకరులు అడగ్గా.. ఆమె మైకుల ముందుకొచ్చి భౌ భౌ అని అనడం మరింత వివాదాస్పదమైంది. తాను ఏ నిబంధననూ ఉల్లంఘించలేదని, హిందూమతంలో శునకానికి గౌరవప్రదమైన స్థానం ఉందని చెప్పారు. అధికార పార్టీకి హిందూ సంప్రదాయాల తెలియవన్నారు.

### లేబర్ కోడ్‌లపై విపక్షాల నిరసన

కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను కుదించి, అమల్లోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను నిరసిస్తూ ఇండి కూటమి నేతలు బుధవారం పార్లమెంటు ప్రాంగణంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంకతోపాటు డీఎంకే, తృణమూల్, వామపక్షాల ఎంపీలు ఈ నిరసనలో పాల్గొన్నారు. కొత్త లేబర్ కోడ్‌లు కార్పొరేట్ సంస్థలకే ప్రయోజనకరంగా ఉన్నాయని విమర్శించారు.

## నేడే భారత్‌కు పుతిన్

(మొదటి పేజీ తరువాయి)



ప్రాంగణంలో త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం.. పుతిన్ రాజ్‌ఘాట్‌కు చేరుకుని మహాత్మగాంధీకి నివాళులర్పిస్తారు. అనంతరం హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీ-పుతిన్ నడుమ సమావేశం జరుగుతుంది. భేటీ ముగిశాక ఇద్దరు నేతలూ కలిసి సంయుక్త ప్రకటన విడుదల చేస్తారు. తర్వాత ప్రధాని మోదీ ఇచ్చే వర్కింగ్ లంచ్‌కు పుతిన్ హాజరవుతారు. అనంతరం ఢిల్లీలోని భారత్ మండపంలో.. ఫిక్కీ (ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) నిర్వహించే ఒక కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిర్వహించే విందు కార్యక్రమానికి పుతిన్ హాజరవుతారు. దీంతో పుతిన్ భారత పర్యటన పూర్తవుతుంది. కాగా.. పుతిన్‌తో పాటు ఈ పర్యటనకు వస్తున్న రష్యా రక్షణ మంత్రి అంద్రే బెలౌసోవ్ మన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో గురువారం భేటీ కానున్నారు. మరో ఐదు యూనిట్ల ఎస్-400 క్షిపణి వ్యవస్థల కొనుగోలు, ఎస్‌యు-30 ఫైటర్ జెట్ల నవీకరణ, ఇతరత్రా కీలకమైన మిలటరీ హార్డ్‌వేర్ సరఫరా అంశాలు వీరి భేటీలో ప్రధానంగా చర్చకు రానున్నాయి. అలాగే.. పౌర అణు ఇంధన సహకారానికి సంబంధించి కూడా ఇరు దేశాల మధ్య అవగాహన ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ఈ ఒప్పందం కుదుర్చుకోవడానికి రష్యా క్యాబినెట్ బుధవారం పచ్చజెండా ఊపింది. రష్యాకు చెందిన రోసాటోమ్ న్యూక్లియర్ కార్పొరేషన్.. తమిళనాడులోని కూడంకుళంలో న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌ను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా ప్రభుత్వం తరఫున ఈ అవగాహన ఒప్పందంపై సంతకం చేయడానికి ఆ సంస్థకు రష్యా క్యాబినెట్ అధికారం ఇచ్చింది. పుతిన్ ఇక్కడికి రావడానికి ముందే.. రష్యా 'ప్రెసిడెన్షియల్ సెక్యూరిటీ సర్వీస్'కు చెందిన దాదాపు 50 మంది అత్యున్నతస్థాయి పోరాట నైపుణ్యాలు కలిగిన కమాండోలు భారత్‌కు చేరుకున్నారు. ఢిల్లీ పోలీసులు, ఇండియన్ నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్‌తో కలిసి వీరు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక.. ఈ పర్యటన కోసం పుతిన్ రష్యాలో వాడే 'ప్రెసిడెన్షియల్ లగ్జరీ లిమోజిన్' కారు ఆరస్ సెనాట్‌ను మాస్కో నుంచి విమానంలో తీసుకొస్తున్నారు.

## పుతిన్‌ను విమర్శిస్తూ భారత పత్రికలో వ్యాసం

» ఫ్రాన్స్, జర్మనీ, యూకే రాయబారుల తీరును తప్పుబట్టిన కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 3: రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటనకు వస్తున్న సమయంలో ఆయనను, రష్యాను తీవ్రంగా విమర్శిస్తూ ఉమ్మడిగా కథనం రాసిన మూడు దేశాల దౌత్యవేత్తల తీరును భారత్ తప్పుబట్టింది. తమకు సంబంధం లేని మూడో దేశం వ్యవహారంలో జోక్యం చేసుకోవడం సరికాదని పేర్కొంది. పుతిన్ గురువారం భారత పర్యటనకు వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారత్‌లోని యూకే హైకమిషనర్ లిండీ కామెరాన్, ఫ్రాన్స్ రాయబారి థియెరీ మాథౌ, జర్మనీ హైకమిషనర్ ఫిలిప్ అకర్‌మన్ సోమవారం టైమ్స్ ఆఫ్ ఇండియాలో ఒక ఉమ్మడి వ్యాసం రాశారు. ఉక్రెయిన్‌పై రష్యా పక్కా ప్రణాళిక ప్రకారమే యుద్ధం చేస్తోందని.. శాంతి నెలకొల్పే ఆలోచన పుతిన్‌కు ఏమాత్రం లేదని అందులో విమర్శించారు. పుతిన్ శాంతి చర్చల్లో జాప్యం చేసినకొద్దీ తాము ఉక్రెయిన్‌కు రక్షణ, ఇతర సహాయ సహకారాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. దీనిని భారత విదేశాంగ శాఖ అధికారులు తీవ్రంగా తప్పుబట్టారు. పుతిన్ పర్యటనకు ముందు భారత పత్రికల్లో ఇలాంటి వ్యాసం రాయడం ఇక్కడి వారిని ప్రభావితం చేసే ప్రయత్నమేనని పేర్కొన్నారు. ఇది అసాధారణమని, ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని.. దౌత్యపరమైన వ్యవహారాలకు పూర్తి విరుద్ధమని స్పష్టం చేశారు. ఇక మూడు దేశాల దౌత్యవేత్తల ఉమ్మడి వ్యాసం.. భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని, రష్యా వ్యతిరేకతను ప్రచారం చేయడమేనని విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి కన్వల్ సిబల్ పేర్కొన్నారు.



# దోబీ చేప.. 22 కిలోలు!

అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం సీలేరులో గల గుంటవాడ జలాశయంలో బుధవారం 22 కిలోల చేప లభ్యమైంది. ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో గల కోందుగూడ గిరిజనులు రోజూ గుంటవాడ జలాశయంలో చేపల వేటకు వెళుతుంటారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం వేటకు వెళ్లిన గిరిజనుల వలకు 22 కిలోల చేప చిక్కింది. ఈ చేపను సీలేరులో దోబీ చేపగా పిలుస్తారు. ఈ చేపను స్థానిక రెస్టారెంట్ యజమాని రూ.4 వేలకు కొనుగోలు చేశారు. - ఆంధ్రజ్యోతి, సీలేరు

# తిరుమలలో నేడు కార్తీక దీపోత్సవం

తిరుమల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం కార్తీక దీపోత్సవం జరగనుంది. తమిళ కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తయిన తర్వాత ఈ దీపోత్సవాన్ని నిర్వహిస్తారు. 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు దీపాలను వెలిగించి ఛత్ర చామర, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి ఇస్తారు. ఈ సందర్భంగా ప్రతినెలా నిర్వహించే పౌర్ణమి గరుడసేవ, సహస్ర దీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది.

## ఈ నెల 23న అప్సా ఎన్నికలు

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం(అప్సా) ఎన్నికలు ఈ నెల 23న జరగనున్నాయి. సంఘం ఎగ్జికూటివ్ కమిటీ సమావేశం బుధవారం అమరావతి సచివాలయంలోని అప్సా హాల్‌లో జరిగింది. ఈ నెల 29వ తేదీతో ప్రస్తుత అప్సా కార్యవర్గం పదవీకాలం ముగియనుంది. దీంతో ఈ నెల 23న అప్సాకు ఎన్నికలు నిర్వహించాలని ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 11న అప్సా సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నారు. 12న అధికారికంగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 15, 16 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 17న నామినేషన్ల ఉపసంహరణ, 23న ఎన్నికలు నిర్వహించాలని అప్సా ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయించింది.

## చిన్నారులకు పాముకాటు

- తమ్ముడి మృతి.. అన్న పరిస్థితి విషమం



శివనారాయణ

పెద్దవడుగూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం కండ్లగూడూరు గ్రామంలో ఇద్దరు చిన్నారులను మంగళవారం రాత్రి కట్లపాము కాటేసింది. వీరిలో శివనారాయణ మరణించగా.. శివరామరాజు పరిస్థితి విషమంగా ఉంది. పెద్దవడుగూరు ఎస్ఐ ఆంజనేయులు, బాలుర బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కండ్లగూడూరు గ్రామానికి చెందిన వీరనారాయణ స్వామి, లక్ష్మి దంపతులకు శివరామరాజు, శివనారాయణ అనే కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ఐదు, చిన్న కుమారుడు రెండో తరగతి చదువుతున్నారు. మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కట్లపాము చిన్నారులను కాటేసింది. తెల్లవారుజామున 4 గంటల సమయంలో మూత్రవిసర్జన కోసం శివనారాయణ బయటకు వెళ్లి పడిపోయాడు. తల్లిదండ్రులు దగ్గరికెళ్లి చూడగా.. నోటి నుంచి నురగ వస్తోంది. ఇంట్లో నిద్రిస్తున్న శివరామరాజుకు కూడా నోటి నుంచి నురగ వస్తుండడంతో ఇరువురిని పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ శివనారాయణ (7) మృతిచెందాడు. శివరామరాజు పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు కట్లపాము కాటేసినట్టు నిర్ధారించారు. ఇద్దరు కుమారుల్లో ఒకరు చనిపోగా.. మరొకరు మృత్యువుతో పోరాడుతుండడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



# 8 నెలలు.. 20వేల కోట్లు

## స్వల్పంగా పెరిగిన మద్యం అమ్మకాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26)లో మద్యం అమ్మకాలు రూ.20 వేల కోట్ల మార్కును దాటాయి. ఎనిమిది నెలల్లో ఈ మేరకు అమ్మకాలు నమోదయ్యాయి. మద్యం అమ్మకాలపై నకిలీ లిక్కర్ సహా ఎక్సైజ్ శాఖ చేపట్టిన చర్యలు కొంత ప్రతికూలత చూపాయి. నకిలీ మద్యం నేపథ్యంలో బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపడంతో అమ్మకాలు తగ్గిపోయాయి. లేదంటే అమ్మకాలు ఇంకా పెరిగే అవకాశం ఉండేదని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి.

- అక్టోబరులో భారీగా తగ్గిన సేల్స్
- నవంబరు విక్రయాల్లో కొంత పురోగతి
- నెలకు సగటున 2500 కోట్ల విక్రయాలు
- ప్రభుత్వానికి 15వేల కోట్లకు పైగా ఆదాయం
- మద్యం అమ్మకాలపై 'నకిలీ' ప్రతికూలత

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మద్యం అమ్మకాల్లో ఏటా 8 నుంచి 10శాతం వరకు వృద్ధి రేటు నమోదవుతుంది. కానీ, ఈ ఆర్థిక సంవత్సరంలో అది 5శాతానికే పరిమితమైంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తొలి 8 నెలల్లో రూ.19,268 కోట్ల విలువైన మద్యం అమ్ముడవగా, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.20,216 కోట్ల మద్యం విక్రయించారు. గతేడాదితో పోలిస్తే అమ్మకాల విలువ 5శాతం పెరిగింది. అదే పరిమాణం పరంగా చూస్తే లిక్కర్ 6శాతం, బీరు 24శాతం అమ్మకాలు పుంజుకున్నాయి. కానీ, మార్కెట్‌లోకి రూ.99 లిక్కర్ బ్రాండ్లు రావడం, కూటమి ప్రభుత్వం మద్యం ధరలను తగ్గించడంతో అమ్మకాలు పెరిగిన స్థాయిలో వాటిపై ఆదాయం పెరగలేదు. ఫలితంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం తగ్గిపోయింది.

### నెలకు రూ.2500 కోట్లు

ఎనిమిది నెలల్లో నెలకు సగటున రూ.2,527 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. రెండు నెలల కిందటి వరకు అమ్మకాల్లో జోరు కనిపించింది. నకిలీ మద్యం తెరపైకి వచ్చాక బెల్టు షాపులు పూర్తిగా తొలగించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఎక్సైజ్ అధికారులు బెల్టులపై ఉక్కుపాదం మోపారు. వ్యవస్థీకృతంగా కాకుండా చాటుమాటుగా నడిచే బెల్టులపైనా నిఘా పెట్టారు. ఫలితంగా ఒక్క అక్టోబరులోనే రూ.430 కోట్ల మేరకు అమ్మకాలు తగ్గాయి. మరోవైపు నాటుసారా, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో ప్రత్యామ్నాయం లేక మళ్లీ మద్యం అమ్మకాలు నవంబరులో పెరిగాయి. అయినా 2024తో పోలిస్తే ఈ ఏడాది నవంబరులో అమ్మకాలు రూ.46 కోట్లు తగ్గాయి. మొత్తంగా ఎనిమిది నెలల్లో గతేడాదితో పోలిస్తే రూ.948 కోట్ల మేర అమ్మకాలు పెరిగాయి. నకిలీ మద్యం ప్రభావం లేకపోతే అది రూ.1500 కోట్ల మార్కు దాటేదని అధికారులు భావిస్తున్నారు.

### 30 వేల కోట్లు దాటుతుందా?

2024-25లో సుమారు రూ.30 వేల కోట్ల మద్యం అమ్మకాలు నమోదయ్యాయి. ఈ ఏడాది మరో నాలుగు నెలలు ఉండగా రూ.20 వేల కోట్లు దాటింది. దీంతో సగటు అమ్మకాలను పరిశీలిస్తే మిగిలిన నెలల్లో కలిపి ఈ ఆర్థిక సంవత్సరంలో అమ్మకాలు రూ.30 వేల కోట్లు దాటుతాయనే అంచనా ఉంది. కానీ, మరిన్ని ప్రతికూలతలు ఏర్పడితే మాత్రం గతేడాది కంటే అమ్మకాలు తగ్గే పరిస్థితి ఏర్పడుతుందని భావిస్తున్నారు. కాగా.. అమ్మకాల్లో విలువ పరంగా పెద్దగా వృద్ధి కనిపించకపోయినా, పరిమాణం రూపంలో బీరులో వృద్ధి కనిపిస్తోంది. వైసీపీ ప్రభుత్వం భారీగా పెంచిన ధరలను కూటమి ప్రభుత్వం తగ్గించింది. అలాగే క్వార్టర్ రూ.99కే పలు రకాల బ్రాండ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం మొత్తం మద్యం అమ్మకాల్లో 20శాతం వాటా ఆ బ్రాండ్లకే ఉంది. దీంతో అమ్మకాలు పెరిగిన స్థాయిలో ఆదాయం పెరగడం లేదు.

### అమ్మకాలపై దీక్షల ప్రభావం

అక్టోబరులో కేవలం నాలుగు జిల్లాల్లోనే అమ్మకాలు పెరిగాయి. ఇక, నవంబరులో ఆ సంఖ్య 11కు చేరింది. మిగిలిన 15 జిల్లాల్లో మాత్రం అమ్మకాలు తగ్గాయి. అయ్యప్ప, భవానీ దీక్షల ప్రభావం కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణాలో 11.56 శాతం, ఎన్టీఆర్‌లో 10.32 శాతం, తూర్పుగోదావరిలో 8.75 శాతం, తిరుపతిలో 6.55 శాతం, కడపలో 6.23 శాతం, గుంటూరులో 5.97 శాతం, బాపట్లలో 5.9 శాతం, కాకినాడలో 4.91 శాతం, శ్రీకాకుళంలో 4.43 శాతం మేర అమ్మకాలు తగ్గాయి. కర్నూలు, అల్లూరి సీతారామరాజు, సత్యసాయి జిల్లాల్లో అమ్మకాలు మాత్రం గణనీయంగా పెరిగాయి.

### ఆదాయంపై అనుమానమే

2024-25లో రూ.28,842 కోట్ల ఆదాయం ఎక్సైజ్ శాఖ ద్వారా సమకూరింది. గతేడాది ప్రైవేటు షాపుల పాలసీ రావడంతో దరఖాస్తుల ద్వారానే రూ.1900 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది ఆ ఆదాయం లోటు కనిపిస్తోంది. కొత్త బార్ పాలసీ వచ్చినా చెప్పుకోదగ్గ ఆదాయం దరఖాస్తుల రూపంలో రాలేదు. పైగా దాదాపు 300 బార్లకు దరఖాస్తులు రాలేదు. ఈ నేపథ్యంలో కేవలం మద్యం అమ్మకాల ద్వారా మాత్రమే గతేడాది మాదిరిగా ఆదాయం రాబట్టడం సాధ్యమేనా? అనే అనుమానాలు నెలకొన్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకూ అమ్మకాల ద్వారా రూ.15 వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. ఇవి కాకుండా లైసెన్స్ ఫీజులు, పర్మిట్ రూమ్‌ల ద్వారా అదనపు ఆదాయం వస్తుంది. అయినా, గతేడాది స్థాయిలో ఆదాయం రాకపోవచ్చని అధికారులు చెబుతున్నారు.

# రాజధానిలో పచ్చదనానికి ప్రాధాన్యం

- మాస్టర్ ప్లాన్ ప్రకారం 30% బ్లూ అండ్ గ్రీన్
- రాజధాని గ్రామాల్లో మౌలిక వసతుల కోసం 900 కోట్లు
- జనవరి చివరినుంచి సుందరీకరణ పనులు: మంత్రి నారాయణ



తుళ్లూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'రాజధాని అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం, స్మార్ట్ ఇండస్ట్రీస్ కోసం మరికొంత భూమి అవసరం అవుతుంది. ఇందుకు కసరత్తు జరుగుతోంది' అని మంత్రి నారాయణ తెలిపారు. రాయపూడిలోని మున్సిపల్ శాఖ ప్రధాన కార్యాలయంలో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. 'రెండో దశ భూసమీకరణలో 16,666 ఎకరాలకు ఇప్పటికే ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ భూమి రైల్వే ట్రాక్, రైల్వే స్టేషన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, స్పోర్ట్స్ సిటీ కోసం సమీకరిస్తున్నాం. ల్యాండ్ పూలింగ్‌పై రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కరించేలా సీఆర్డీఏ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తాం. అమ్యూజ్ మెంట్ పార్కులు, ఎకో రిసార్ట్స్, మ్యూజికల్ ఫౌంటెయిన్స్‌తో రాజధానిలో ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తున్నాం. మాస్టర్ ప్లాన్ ప్రకారం రాజధానిలో 30% బ్లూ అండ్ గ్రీన్ ఉండేలా ప్రణాళికలు రూపొందించాం. అనంతవరం వద్ద 31 ఎకరాల్లో లంగ్ స్పేస్ పార్కులు, కురగల్లు వద్ద 200 ఎకరాల్లో బయో డైవర్సిటీ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. ఎల్పీఎస్ జోన్ల లో 1,602 ఎకరాల మేర ఎకరం నుంచి పదెకరాల లోపు విస్తీర్ణంలో పార్కులు నిర్మిస్తున్నాం. కృష్ణాయపాలెం రిజర్వాయర్ వద్ద 71 ఎకరాలు, నీరుకొండ రిజర్వాయర్ వద్ద 158 ఎకరాల్లో పచ్చదనం అభివృద్ధి చేస్తున్నాం. ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని రాజధాని రైతులకు సమాచారం ఇస్తున్నాం. రాజధాని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.900 కోట్లతో పనులు చేపడుతున్నాం' అని మంత్రి నారాయణ తెలిపారు. సమావేశంలో ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి, ఛీఫ్ ఇంజనీర్ బి.నరసింహమూర్తి, హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్ వి.ఎస్.ధర్మజ, డిప్యూటీ డైరెక్టర్ బి.శ్రీనివాసులు, అర్బన్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్ట్ హెచ్‌వోడీ డాక్టర్ పి.సురేశ్‌బాబు, ఐపీడీ హెచ్‌వోడీ డాక్టర్ కేవీ గణేశ్ బాబు, టూరిజం సీనియర్ కన్సల్టెంటు బీ మనోహరరావు, పీ విశ్వప్రసాద్ పాల్గొన్నారు.



కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కోనపాపపేట తీరం వద్ద కోతకు గురై దెబ్బతిన్న తాటాకుపాక, (ఇన్‌సెట్లో) కొత్తపల్లి మండలం కోనపాపపేటలో కెరటాల ఉధృతికి ధ్వంసమైన ఇంటి శ్లాబు

# ఉప్పాడ తీరంలో అలల ఉధృతి

- కోనపాపపేటలో ధ్వంసమైన ఇళ్లు

కొత్తపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలో ఉప్పాడ సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంటోంది. దీంతో తీర ప్రాంతం కోతకు గురవుతోంది. మంగళ, బుధవారాల్లో సముద్రంలో ఏర్పడిన పోటు, పాట్లకు ఉవ్వెత్తున ఎగసిపడిన కెరటాల ధాటికి కోనపాపపేట తీరంలో మత్స్యకారుల తాటాకుపాక దెబ్బతినగా మరో పక్కా ఇంటి శ్లాబు నేలకొరిగింది. కోనపాపపేట గ్రామానికి సముద్రం రెండు, మూడు ఫర్లాంగుల దూరంలో ఉండేది. కానీ, ఇటీవల కాలంలో తరచూ తుఫాన్‌లు, అల్పపీడనాలు సంభవించడంతో క్రమేపీ ఆర్అండ్‌బీ రోడ్డుకు అతి దగ్గరగా చేరుకోవడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



విజయవాడలో నిరసన వ్యక్తం చేస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

## ఒక్క బాధితుడు మరణించినా ప్రభుత్వానిదే బాధ్యత

- అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన దీక్షలో ముప్పాళ్ల నాగేశ్వరరావు

విజయవాడ (ధర్నాచౌక్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఒక్క అగ్రిగోల్డ్ బాధితుడు మరణించినా ప్రభుత్వమే బాధ్యత వహించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు హెచ్చరించారు. విజయవాడలోని ధర్నాచౌక్‌లో బుధవారం జరిగిన అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన దీక్షలో తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహరాష్ట్ర, ఒడిశా నుంచి ఏజెంట్లు, ఖాతాదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ కంపెనీలో పెద్ద మొత్తంలో డిపాజిట్ చేసిన సుమారు 10 లక్షల మందికిపైగా బాధితులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం ఆగదని స్పష్టంచేశారు. త్వరలో సంస్థ యాజమాన్యాల ఇళ్లను ముట్టడించాలని పిలుపునిచ్చారు.



రూ.10 లక్షల నగదు బ్యాగును పెంచలయ్య భార్య, పిల్లలకు అందచేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి

# పెంచలయ్య కుటుంబానికి రూ.10 లక్షల సాయం

- అందజేసిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

నెల్లూరురూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గంజాయి ముఠా చేతిలో ప్రాణాలు కోల్పోయిన సీపీఎం నాయకుడు పెంచలయ్య కుటుంబ పోషణకు తన వంతుగా రూ.10 లక్షలు అందచేస్తున్నట్టు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రకటించారు. సీపీఎం నాయకులతో కలిసి బుధవారం ఆయన కల్లూరిపల్లి వద్దనున్న ఆర్డీటీ కాలనీలోని పెంచలయ్య నివాసానికి వెళ్లి ఆయన భార్య దుర్గా, పిల్లలు కుమార్‌దేవ్, నిఖిల్‌కి నగదు అందచేశారు. అనంతరం ఆ కుటుంబంతో ఏకాంతంగా మాట్లాడిన ఎమ్మెల్యే.. పెంచలయ్య ఇద్దరు బిడ్డలు ఎంతవరకు చదువుకోవాలనుకుంటే అంతవరకు తన కుమార్తెలైన హైందవి, వైష్ణవి ఆ బాధ్యతలు తీసుకుంటారని భరోసా ఇచ్చారు. అలాగే పెంచలయ్య చేసిన గంజాయి వ్యతిరేక ఉద్యమ స్ఫూర్తిని చాటే విధంగా ఆర్డీటీ కాలనీలో ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కాలనీ అభివృద్ధికి వారం రోజుల వ్యవధిలో రూ.50 లక్షలు నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తామన్నారు. గంజాయి ముఠాల అంతానికి కలిసొచ్చే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో తాను ఉద్యమిస్తానని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెల్లడించారు.

## డాక్టర్ నరేష్‌బాబుకు ఐఓఏ గోల్డెన్ జూబ్లీ రీసెర్చ్ అవార్డ్

- రేడియోమిక్స్ సాంకేతికతతో కచ్చితమైన వ్యాధి నిర్ధారణ
- మూడోసారి ఈ పురస్కారం అందుకోనున్న గుంటూరు వైద్యుడు



డాక్టర్ నరేష్‌బాబు

గుంటూరు మెడికల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని మల్లిక స్పైన్ సెంటర్ అధినేత, చీఫ్ స్పైన్ సర్జన్ డాక్టర్ జె.నరేష్‌బాబు.. భారత ఆర్థోపెడిక్ వైద్యుల సంఘం(ఐఓఏ) ప్రకటించిన ప్రతిష్టాత్మక గోల్డెన్ జూబ్లీ రీసెర్చ్ అవార్డు 2025కు ఎంపికయ్యారు. దేశంలోని ఎముకల వైద్య నిపుణులకు అందించే ఈ అత్యుత్తమ పురస్కారాన్ని ఈ నెల 15 నుంచి 20 వరకు అస్సాంలోని గువహాటిలో జరిగే ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ (ఐఓఏ) 70వ వార్షిక సదస్సులో ఆయనకు ప్రదానం చేయనున్నారు. డైనమిక్ రేడియోమిక్స్ ఎనాలిస్ ఆఫ్ లిగమెంట్ ఫ్లావమ్ ఇన్ సర్వైకల్ మైలోపతి' అనే అంశంపై పరిశోధన నిర్వహించిన డాక్టర్ నరేష్‌బాబు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికను వినియోగించి రేడియోమిక్స్ ప్రక్రియ ద్వారా మెడలోని డిస్క్‌లను, లిగమెంట్లను, డైనమిక్ ఎంఆర్ఐతో జత చేసి విశ్లేషించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఎంఆర్ఐలను కలిపి ఉపయోగించే అత్యాధునిక వినియోగించడం ఈ సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచ ఆర్థోపెడిక్ వైద్య రంగంలో ఇదే తొలిసారి కావడం విశేషం. డాక్టర్ నరేష్‌బాబు 2008లో ఎముకల ఫ్లోరోసిస్‌పై చేసిన పరిశోధనకు మొదటిసారి, 2019లో వయో వృద్ధుల్లో నడుము అరుగుదల, వెన్నుపూస వంకర్ల గురించి చేసిన అధ్యయనానికి రెండోసారి ఈ అవార్డును అందుకున్నారు. ప్రస్తుతం మూడోసారి ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డుకు ఎంపికయ్యారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఈ అవార్డు అందుకున్న తొలి ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ నరేష్‌బాబే కావడం విశేషం.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# ప్రజా విజయం

సంచార్ సాథీ అప్లికేషన్ విషయంలో కేంద్రప్రభుత్వం వెనక్కుతగ్గి మంచిపనిచేసింది. కొత్తగా వచ్చే సెల్‌ఫోన్లలో సంచార్‌సాథీ యాప్‌ను ముందుగా ఇన్‌స్టాల్ చేయడం తప్పనిసరి అంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను టెలికాం శాఖ ఉపసంహరించుకుంది. సైబర్ నేరాలనుంచి రక్షించేపేరిట కొత్త ఫోన్లలో దీనిని తప్పనిసరి చేయడంమీద విపక్షాలు మండిపడ్డాయి, ప్రజలు ఆందోళన చెందారు. ఇది పౌరుల వ్యక్తిగత జీవితాల్లోకి ప్రభుత్వం తొంగిచూసే చర్య అని నిపుణులు అనుమానించారు. ఈ యాప్ మీ ఫోన్‌లో ఉంటే మీకు ఎంతో తోడు, తోడ్పాటు అని ప్రభుత్వం చెబుతూంటే, దానిని పడగ నీడగా, మన జేబులోనే ఉంటూ మనల్ని వెంటాడే నిఘా నేత్రంగా పౌరసమాజం భావించింది. ఈ వ్యవహారాన్ని తెగేవరకూ లాగకుండా ప్రభుత్వం ఉన్నతంగా వ్యవహరించడం ప్రశంసనీయమైనది.


నిజానికి, తన ఆదేశాల తరువాత ఈ యాప్‌ను స్వచ్ఛందంగా డౌన్‌లోడ్ చేసుకున్నవారి సంఖ్య అమాంతం పెరిగిపోయిందని ప్రభుత్వం అంటోంది. ఒక్కరోజులో ఆరులక్షల మంది యాప్‌లో రిజిస్టర్ చేసుకున్నారని, దీనిగురించి తెలియనివాళ్లకు అవగాహన కల్పించే సదుద్దేశంతోనే యాప్‌ను తప్పనిసరి చేశామని టెలికాం విభాగం అంటోంది. విపక్షాలు, నిపుణులు తప్పుబడుతున్నా, ప్రజలు తమను అనుమానించడం లేదని, నమ్ముతున్నారని చెప్పుకోవడం ఈ ప్రకటన ఉద్దేశం కావచ్చు. నిజానికి ఈ విషయంలో ఇంతటి వివాదం అవసరం లేదు. 2023 మే నెలలో ఈ యాప్‌ను ఆరంభించిన ప్రభుత్వం దాని ప్రచారాన్ని ఉధృతం చేసి, క్రమంగా వినియోగాన్ని కూడా పెంచగలిగింది. ఫోన్‌లో సంచార్‌సాథీ ఉంటే సవాలక్ష ప్రయోజనాలంటూ పౌరులకు ఇటీవలికాలంలో రోజూ టెక్ట్స్ మెసేజ్‌లు అందుతూనే ఉన్నాయి. ఒక సిమ్‌మీద ఎన్ని కనెక్షన్లు ఉన్నాయో తెలుసుకోవడం నుంచి, దొంగతనానికి గురైన మొబైల్స్‌ను కనుక్కోవడం వరకూ ఈ యాప్ ఉపకరిస్తుందన్న హామీని విశ్వసించి అత్యధికులు ఇప్పటికే ఇన్‌స్టాల్ చేసుకున్నారు కూడా. ప్రజలు ఎంతగానో నమ్ముతున్నారని చెప్పుకుంటున్న ప్రభుత్వం యాప్‌ను ఇలా తప్పనిసరి చేయడం కాక, దానిని విస్తృత వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తే సరిపోయేది. అప్లికేషన్‌ను నిరంతరం అభివృద్ధిపరచడం, సమర్థతనూ దాని సాంకేతిక భద్రతనూ పెంచి ప్రచారం చేయడం, దుర్వినియోగం కాబోదని హామీ ఇవ్వడం ద్వారా ప్రభుత్వం తన లక్ష్యాన్ని సునాయాసంగా సాధించగలిగేది. ఈ యాప్ ఉన్నపక్షంలో సైబర్ మోసాలను అడ్డుకోవడం, వాడుతున్న ఫోన్ మంచిచెడులు తెలుసుకోవడం, మోసపూరిత కాల్స్‌ను నిలువరించడం, ఫోన్ బ్లాక్ చేయడం సులభమని చెబుతున్నందున ప్రజలూ కాదనరు. లక్షలకొద్దీ నకిలీ కనెక్షన్లను రద్దుచేయడం, లక్షలాది ఫోన్ల ఉనికి కనిపెట్టడం ఈ యాప్ ద్వారా సాధ్యమైందంటున్న ప్రభుత్వం ప్రజలే దానిని స్వాగతించి, వాడుకొనేట్టుగా చేస్తే, చూస్తే సరిపోయేది. కానీ, ఎప్పుడైతే ప్రభుత్వం దానిని తప్పనిసరి చేసిందో, దానిమీద ప్రశ్నలు, సందేహాలు రేగి, అనుమానాలను రేకెత్తించే పలు అంశాలు ముందుకు రావడం అత్యంత సహజం. ఎంపిక చేసుకొనే స్వేచ్ఛ ప్రజలకు లేకుండా నేరుగా కంపెనీలనే ప్రీ ఇన్‌స్టాల్ చేయమని ఆదేశించిన కారణంగా ప్రభుత్వానికి దురుద్దేశాలున్నాయన్న వాదనకు బలం చేకూరింది. సైబర్ నేరాలను నివారించడం, మోసాలను గుర్తించడం పేరుతో ఫోన్‌లో ఉన్నదంతా చదివేందుకు, తమపై ఓ కన్నేసి ఉంచేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోందని ప్రజలకు అనిపించింది. పౌరులపై నిరంతర నిఘా, గోప్యతహక్కులు, డేటా భద్రత, దుర్వినియోగం ఇత్యాది ఆరోపణలు వెల్లువెత్తడంతో పాటు, పాలకులు పెగాసస్‌ను ప్రయోగించి తమకు గిట్టనివారికి వ్యతిరేకంగా సాక్ష్యాలు సృష్టించి, ఏళ్ళతరబడి వారిని వేధించిన గతమూ గుర్తుకు వచ్చింది. ఈ యాప్‌ను తొలగించుకొనే అధికారాలూ అవకాశాలమీద పాలకులే పలుమార్లు మాటమార్చారు. అసలు ఆదేశాలకూ, అనంతరం మంత్రి మాటలకూ పొంతనలేదు. ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ వంటి సంస్థలు ఈ మొత్తం వ్యవహారంలో చురుకుగా వ్యవహరించి, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించడానికి కూడా సిద్ధపడ్డాయి. ప్రజలను సంసిద్ధులను చేయకుండా, సమాయత్తపరచకుండా ఇటువంటి దూకుడు నిర్ణయాలు పనికిరావు. యాప్ ప్రీ ఇన్‌స్టలేషన్‌కు యాపిల్ అంగీకరించలేదని, మిగతా కంపెనీలు కూడా అభ్యంతరపెట్టవచ్చునని వార్తలు వచ్చాయి. పాలకులు ఏ కారణాల వల్ల వెనక్కుతగ్గినా, ఇది ప్రజావిజయమే.

> మేకా సత్యనారాయణ శాస్త్రి గుర్తింపును ఆశించని పాత్రికేయుడు. హైకోర్టు, సుప్రీంకోర్టు వరకూ అనేక ప్రజాపక్ష వ్యాజ్యాల్లో గెలిచి కూడా న్యాయవాదినని చెప్పుకోని వ్యక్తి. అన్యాయాన్ని నిగ్గదీసే ఆయన స్వభావానికి తగ్గట్టు ప్రజలు ఆయన్ను ప్రేమగా 'బాంబు' అని పిలుచుకున్నారు.

## ప్రజాపక్షాన ప్రశ్నించే 'బాంబు'!

విలక్షణ భావోద్యమకారుడు మేకా సత్యనారాయణ శాస్త్రి. పేరెన్నికగన్న పత్రికల్లో పనిచేసి కూడా ఎన్నడూ గుర్తింపును ఆశించని అరుదైన పాత్రికేయుడు. జిల్లా కోర్టులు మొదలుకొని సుప్రీంకోర్టు వరకూ అనేక ప్రజాపక్ష వ్యాజ్యాల్లో గెలిచి కూడా వృత్తి న్యాయవాదినని చెప్పుకోని వ్యక్తి. అన్యాయాన్ని ప్రశ్నించి నిగ్గదీసే ఆయన స్వభావానికి తగ్గట్టు ప్రజలు ఆయన్ను ప్రేమగా 'బాంబు' అనే పేరుతో పిలుచుకున్నారు. 1955 డిసెంబర్ 4న పార్వతీపురంలో మేకా కృష్ణమూర్తి, కృష్ణవేణి దంపతులకు రెండో సంతానంగా బాంబు జన్మించాడు. విద్యార్థి దశలోనే సామాజిక స్పృహ పెంపొందించుకున్నారు. గాంధేయ వాదం, సోషలిజం పునాదులుగా తన ప్రస్థానాన్ని నిర్దేశించుకున్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఎన్నో ఉద్యోగాలు చేశారు. నాస్తిక, హేతువాద సంఘాలు మొదలుకొని దళిత బహుజన, మానవ హక్కుల సంఘాల వరకూ ఎన్నో సంస్థలతో కలిసి పని చేశారు. పిఠాపురంలో కులమతాలకు అతీతంగా 'పీస్ హోమ్' పేరిట సర్వధర్మ సమభావ మానవతా నిలయాన్ని స్థాపించారు.

బాంబు సంచలన జర్నలిస్టు. మహిమలు, అతీత శక్తులు ఉన్నాయని డాంబికాలు పలికిన అనేకమంది బాబాల బండారాన్ని బయటపెట్టారు. మతం వ్యక్తిగతం అని నమ్మిన బాంబు 'ఆధ్యాత్మికత' అదేదైనా అందరి క్షేమాన్ని కోరాలని అనేవారు. ముక్కు సూటితనం, నిక్కచ్చితత్వం, నిరాడంబరత కారణంగా అనేక పత్రికల్లో పనిచేసి కూడా



జీవితాంతం ఫ్రీలాన్స్ జర్నలిస్టుగానే ఉన్నారు. ప్రశ్నించే స్వభావాన్ని వదలకుండా, మొక్కవోని స్వేచ్ఛాలోచనాపరుడిగానే బతికిన బాంబు ఓ గొప్ప అవిశ్రాంత సత్యాన్వేషి.

ఇదంతా ఒకెత్తయితే సామాజిక కార్యాచరణలో భాగంగా ఆయన చేసిన విస్తృత ప్రజా ఉద్యమాలు ఒకెత్తు. మద్య వ్యతిరేక ఉద్యమాన్ని గోదావరి జిల్లాల్లో ముందుండి నడిపించారు. మూఢ నమ్మకాలు, చేతబడులు, మహిమలకు వ్యతిరేకంగా ప్రచారోద్యమం చేపట్టారు. పెద్ద మల్లాపురం అటవీ ప్రాంతంలో 'స్పందన' గిరిజనాభివృద్ధి సంస్థతో చాలాకాలం పనిచేశారు. పిఠాపురంలోని కిర్లంపూడి షుగర్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే బూడిద సమస్యకు వ్యతిరేకంగా ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి విజయం సాధించారు. కె.జి బేసిన్ గ్యాస్ నిక్షేపాలను ప్రజాపరం చేయాలని నిరాహారదీక్ష చేశారు. తిరుపతి, అన్నవరం, ద్రాక్షారామం తదితర దేవస్థానాల్లో జరిగే అవకతవకలు వెలికితీయడం నుండి బహుళజాతి సంస్థల శీతల పానీయాలు, తినుబండారాల్లో జరిగే కల్తీ వరకూ... న్యాయస్థానాలలో వందలాది ప్రజాహిత వ్యాజ్యాలు (పిల్స్) వేసి పోరాడారు. మద్యం సీసాల మీద ఎమ్మార్పీ ధర వేయకపోవడం వల్ల వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారని హైకోర్టులో బాంబు దాఖలు చేసిన కేసు వల్లనే నాటి నుంచి మద్యం సీసాల మీద నిర్ణీత ధరలు వేస్తున్నారు.

సర్వ మానవ సమానత్వమే సిసలైన సనాతన ధర్మం అని నమ్మిన ఆయన, ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శిగా చేశారు. ఎన్నడూ కులతత్వాన్ని పాటించలేదు సరికదా ఎన్నో జంటలకు కులాంతర, మతాంతర వివాహాలు చేశారు. అంతేకాదు, తన కుమారుడికి స్వాతంత్ర్య దినోత్సవం నాడు కులాంతర ఆదర్శ వివాహం దగ్గరుండి జరిపించారు. మహోన్నత కార్మిక నేత ఎ.వి.కె చైతన్య, మొట్టమొదటి సోషలిస్టు నేత కందాళ సుబ్రహ్మణ్య తిలక్, హక్కుల నేత ఆచంట లక్ష్మణరావు వంటి మహామహులతో బాంబుకు సత్సంబంధాలు, బాంధవ్యాలు ఉండేవి. పత్రికాధిపతులతో సాన్నిహిత్యం ఉండేది. అయినా, వ్యక్తిగత ప్రయోజనం కోసం వాటిని ఉపయోగించుకోలేదు. ఆయన మీద మాత్రమే కాక, కుటుంబ సభ్యులు, పిల్లల మీద కూడా అక్రమార్కులు కేసులు పెట్టినా, దాడులు చేసినా వేటికీ ఆయన వెరవలేదు, వెన్నుచూపలేదు. 2022 ఫిబ్రవరి 28న బాంబు గుండెపోటుతో పిఠాపురంలో కాలం చేశారు. మరణానంతరం తన కళ్లను, ఇతర అవయవాలను దానమిచ్చారు. చనిపోయే నాటికి ఆయనకు సొంతిల్లు కూడా లేదు. జర్నలిస్టుగా, యాక్టివిస్టుగా, న్యాయవాదిగా, సామాజిక ఆలోచనాపరునిగా, రచయితగా, ఉద్యమకారుడిగా, పర్యావరణవేత్తగా, రాజకీయ విశ్లేషకునిగా, ఆధ్యాత్మికవాదిగా అనేక రంగాల్లో విశేషమైన కృషి చేసిన మేకా సత్యనారాయణ శాస్త్రి, ప్రజల మనసుల్లో ప్రజాపక్షంగా ప్రశ్నించే 'బాంబు'గా నిలిచిపోయారు.

● గౌరవ్
సామాజిక కార్యకర్త

# ఆఖరి అంకంలో సాయుధ పోరాటం!

హిడ్మా ఎన్‌కౌంటర్, పెద్ద ఎత్తున మావోయిస్టుల అరెస్టులు, లొంగుబాట్లతో పీపుల్స్‌వార్/మావోయిస్టు పంథా ముగింపు దశకి వచ్చింది. చరిత్ర పునరావృతమైనట్లయింది. 1968లో విజయవాడలో తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి, కొల్లా వెంకయ్య తదితరుల నాయకత్వంలో వెలసిన ఏపీసీసీఆర్ ద్వారా సాయుధ పోరాట పంథాకు జరిగిన అంకురార్పణ శ్రీకాకుళం, వరంగల్, జగిత్యాల, ఇంద్రవెల్లి మీదుగా దేశమంతా పాకింది. ఈ క్రమంలో సీపీ గ్రూప్, పీపుల్స్‌వార్, లిన్ పియావో/ రెడ్‌ఫ్లాగ్ (రఫూఫ్), పైలా గ్రూప్, జీవీ గ్రూప్, ఫణిబాగ్చి వర్గం, కేఆర్ గ్రూప్, జనశక్తి, చలమన్న గ్రూప్, ఆర్‌వోసీ– అలా చీలికలు పీలికలవుతూ ఝార్ఖండ్ అడవుల్లోని ఎంసీసీతో కలిసిపోయింది. ఒక సమయంలో నేపాల్‌లోని ప్రచండ వర్గం నుంచి శ్రీలంకలోని ఎల్‌టీటీఈ వరకు సంబంధాలు పెట్టుకుని రెడ్ కారిడార్ ఏర్పరిచింది.

ఏదో ఒక నాటికి దుర్భేద్య స్థావరాలు అవసరమవుతాయనే కొండపల్లి సీతారామయ్య దూరాలోచన మేరకు వింధ్యారణ్యాల్లోని ఆదివాసీ ప్రాంతాల్లో వైద్యులు, టీచర్ల రూపంలో 1980ల నుంచే బేస్ ఏర్పరచుకున్నారు. ఆ స్థావరాలే ఇప్పటిదాకా ఉద్యమ నాయకత్వాన్ని కాపాడుకుంటూ వచ్చాయి. ఒకానొక సమయంలో అసలీ దావానలాన్ని ఆపగలమా అనే సందేహం పాలకవర్గాల్లో కలిగింది. కానీ ఊహించని స్థాయిలో విరుచుకుపడిన టెక్నాలజీ కారణంగా, ఆత్మరక్షణ వ్యూహాలతో ఉద్యమ విస్తరణ వెనుకబడడంతో సాయుధ పోరాటం చివరికొక అనాథలా ముగియడం సామాజిక విషాదం.

భారతదేశంలో సాయుధ పోరాటాలు, మావోయిస్టు పార్టీ పాత్రలపై ఏదో ఒక రోజు సమగ్ర చరిత్ర లిఖితమవుతుంది. ఈ ఉద్యమం మిగిల్చిన నెత్తుటి మరకలు, త్యాగాలు, అరాచకాలు, అన్నివైపులా జరిగిన ప్రాణనష్టం, క్రమేపీ కుంచించుకుపోయిన మేధావి వర్గం పోషించిన పాత్ర, జరిగిన వాగ్వాదాలు, పంథాల మధ్య ఘర్షణలు ఎలాగూ అక్షరాలకెక్కుతాయి. అరవయ్యేళ్ల సాయుధ పోరాట ఆలోచనా ప్రవంతిలో, కీలక సమయాల్లో జరిగిన నిర్ణయాల గురించి విపులంగా పరిశోధిస్తే, తప్పొప్పులను తూకం వేసుకోవడమే కాక, రాబోయే తరాల ఆలోచనలకు ఒక దిక్సూచి దొరుకుతుంది.

చైనాను మావో నడిపిన రోజుల్లో ముందడుగు (గ్రేట్ లీప్ ఫార్వర్డ్), సాంస్కృతిక విప్లవం పేరిట జరిగిన అరాచక ఆలోచనలు, సాయుధ పోరాటాలని అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలకు ఎగుమతి చెయ్యాలన్న నిర్ణయంలో భాగంగా భారతదేశంలో సాయుధ పోరాటానికి పునాది వేసి, రాళ్ల పేర్చింది అప్పటి 'గ్యాంగ్ ఆఫ్ ఫోర్.' అలా విదేశీ ఉత్ప్రేరకాల మూలాలున్నప్పటికీ, చారు మజుందార్, వెంపటాపు సత్యం, కొండపల్లి సీతారామయ్య లాంటి అతి సాధారణ వ్యక్తులు అన్ని లక్షల మందిని సాయుధ విప్లవం వైపు, అజ్ఞాత జీవితం వైపు, త్యాగాలు, మరణాల వైపు నడిపించగలిగారంటే, అప్పటి ప్రధాన రాజకీయ స్రవంతి, పాలనా యంత్రాంగం, ప్రజల సమస్యలు, ఆలోచనల పట్ల ఎంత గుడ్డితనంతో వ్యవహరించాయో అర్థమవుతుంది.

మావో బతికుండగానే నక్సల్బరీ వసంత గర్జన కలకత్తా వీధుల్లో శవమై తేలింది. శ్రీకాకుళ రైతాంగ పోరాటం అనుకోకుండా జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌తో నిశ్శబ్దమైపోయింది. చంద్ర పుల్లారెడ్డి మరణానంతరం కూడా పరిమిత హింసతో ఆ గ్రూపు కొనసాగింది. కానీ పోలీసులతో తలపడడానికి, కవ్వింపు చర్యలకు దూరంగా ఉంది. కానీ వీటన్నిటికీ నేపథ్యంలో కొండపల్లి మొదలెట్టిన పీపుల్స్‌వార్ గ్రూప్ మొదటి నుంచీ దూకుడుతనాన్నే ప్రదర్శించింది. మరి గతంలో వచ్చి పోయిన పాలపొంగుల్ని, వాస్తవ విప్లవ పరిస్థితుల్ని సరిగ్గానే అంచనా వేసిందా? 1976లో మావో మరణానంతరం గ్యాంగ్ ఆఫ్ ఫోర్‌ని తరిమికొట్టి, డెంగ్ నాయకత్వంలో చైనా పూర్తిగా సంస్కరణవాదం వైపు మళ్లడాన్ని ఏ మాత్రం సరిగ్గా అర్థం చేసుకుంది? ఎమర్జెన్సీలో జరిగిన అణచివేతకు ప్రతీకారంగా యువ విప్లవకారులు అరాచక హత్యల వైపు మళ్లినప్పుడు మేధావి వర్గం ఏ మేరకు గైడ్ చేసింది? భారత రాజకీయాల్లో భార్గవ కమిషన్ల వాతావరణం శాశ్వతమనుకున్నారా?

అతివాద, మితవాద వర్గాల ఘర్షణల్లో ప్రతిసారీ అతివాదులదే పైచేయి అయింది. అతివాదాన్ని సమర్థించే మేధావి వర్గ పరిమాణం కృశించిపోతుండగా, మితవాద మేధావులు క్రమేపీ విత్‌డ్రా అయిపోయారు. 1990 సోవియట్ యూనియన్ పతనం నుంచి నేర్చుకున్నదేమిటి? చరిత్ర గమనాన్ని గుర్తించారా? కొండపల్లిని బహిష్కరించడం, తర్వాత వరుసగా కర్నూలులో కన్నబీరన్, గుంటూరులో బాలగోపాల్ నిష్క్రమణ... సాయుధ పోరాటాన్ని ఏ దుస్సాహసాల వైపు నడిపించాయి?

> స్వాతంత్ర్య పోరాటంలో మిలిటెంటు రాజకీయాల వల్ల జరిగిన ప్రాణ నష్టాలతో పోలిస్తే, తెలంగాణ సాయుధ పోరాటంలో జరిగిన నష్టాలు ఎక్కువ. దానితో పోలిస్తే మావోయిస్టు సాయుధ ఉద్యమంలో జరిగిన ధన, ప్రాణ నష్టాలు కొన్ని వందల రెట్లు ఎక్కువ. ఈ మూడింట్లో ఏవీ నిరుపయోగంగా జరగలేదు. కానీ అంతకన్నా తక్కువ త్యాగాలు, నష్టాలతో, ప్రత్యామ్నాయ పోరాట మార్గాలలో ఎక్కువ మేలు జరిగే అవకాశాలు ఉన్నాయా అని ఇప్పటికైనా మనల్ని మనం ప్రశ్నించుకోవాలి.

ఒక పక్క ఎన్నికలు బహిష్కరించమని పిలుపులిస్తూ, పోలింగ్ స్టేషన్ల మీద దాడులు చేస్తూ, బ్యాలెట్ బాక్సులు ధ్వంసం చేస్తూ, ఇంకో పక్క 1983, 85 ఎన్నికలలో ఎన్టీఆర్‌ను, 1989లో చెన్నారెడ్డిని, 1994లో మళ్లీ ఎన్టీఆర్‌ను సమర్థించి, 1999, 2004లో తెలుగుదేశానికి బద్ధ వ్యతిరేకంగా పనిచేసి ఏం సాధించారు? వీళ్లతో ఎప్పటికయినా ప్రమాదమే అని అన్ని ప్రధాన పార్టీలకూ సంకేతాలివ్వడం తప్ప! తీరా 2009 నాటికి ఎన్నికలలో ఏ ప్రభావమూ చూపలేని పరిస్థితికి దిగజారిపోయారు.

1995లో ఉత్తర తెలంగాణను విముక్త గెరిల్లా




ప్రాంతంగా ప్రకటించుకుని, ప్రత్యేక తెలంగాణకు పిలుపునిచ్చారు. దాన్ని వీవీ, బాలగోపాల్, కోదండరామ్, హరగోపాల్, గద్దర్‌లు విస్తృతంగా ప్రజల్లోకి, విద్యార్థుల్లోకి తీసుకెళ్లారు. కానీ తీరా తెలంగాణ ఏర్పడే నాటికి ఆ ప్రాంతాల్లో సాయుధ పోరాట దళాలే కనుమరుగైపోయి, పొరుగు రాష్ట్రాల్లో తలదాచుకోవాల్సిన పరిస్థితి. మరి ప్రత్యేక తెలంగాణ పోరాటం ఏ దోపిడీ వర్గాల ప్రయోజనం కోసం చేసినట్టు?

ఇలా చరిత్ర చౌరస్తాలో ఎన్నోసార్లు నిలబడ్డా, సాయుధ పంథాను, వాస్తవ పరిస్థితులను, ప్రపంచ గమనాన్ని, టెక్నాలజీ ప్రభావాన్నీ ఎప్పుడూ సీరియస్‌గా సమీక్షించకుండా, విప్లవ బద్ధకాన్ని ప్రదర్శించడం వల్లే, ఈ వారించదగిన ప్రాణనష్టం, పరువు నష్టం జరిగాయేమో అని ఆలోచించాల్సిన సమయమిది. పూర్తిగా అశక్తులై... అవకాశమివ్వండి, చర్చలకొస్తాం అని అభ్యర్థించే స్థాయికి రావడం వెనుక వ్యూహాత్మక తప్పిదాలు, మేధావి వర్గాల ఉపసంహరణ, కొట్టుకుపోయే ధోరణులు ఎంతవరకు కారణమో విశ్లేషించుకోవాలి.

పునరాలోచించుకోమన్న వారందరినీ అన్యవర్గ ధోరణి ప్రభావితులనో, విప్లవ ప్రతీఘాత శక్తులనో, రివిజనిస్టులనో పక్కకు నెట్టేయడం వల్ల నష్టం జరిగింది ఎవరికి? రీగన్, థాచర్‌ల ప్రభావం, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నాల నేపథ్యంలో బ్రిటిష్ లేబర్ పార్టీయే తనను తాను పునర్నిర్వచించుకుని, న్యూ లేబర్‌గా అవతరించగా లేనిది, కీలక సమయాల్లో ఎంఎల్ పార్టీలు అటువంటి రాజకీయ బాధ్యత ఎందుకు తీసుకోలేదు?

నష్టపోయారు, ఓడిపోయారు కాబట్టి అపహాస్యం చెయ్యడం అనాగరికం. ఇరువైపులా పోయిన ప్రాణాలన్నీ మనవే. చరిత్రలోని ఈ అధ్యాయం నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలను విస్మరిస్తే, భవిష్యత్తులో మరిన్ని కష్టాలు, నష్టాలు తప్పవు. స్వాతంత్ర్య పోరాటంలో మిలిటెంటు రాజకీయాల వల్ల జరిగిన ప్రాణ నష్టాలతో పోలిస్తే, తెలంగాణ సాయుధ పోరాటంలో జరిగిన నష్టాలు ఎక్కువ. దానితో పోలిస్తే మావోయిస్టు సాయుధ ఉద్యమంలో జరిగిన ధన, ప్రాణ నష్టాలు కొన్ని వందల రెట్లు ఎక్కువ.

> ఒకానొక సమయంలో అసలీ దావానలాన్ని ఆపగలమా అనే సందేహం పాలకవర్గాల్లో కలిగింది. కానీ ఊహించని స్థాయిలో విరుచుకుపడిన టెక్నాలజీ కారణంగా, ఆత్మరక్షణ వ్యూహాలతో ఉద్యమ విస్తరణ వెనుకబడడంతో సాయుధ పోరాటం చివరికొక అనాథలా ముగియడం సామాజిక విషాదం. నష్టపోయారు, ఓడిపోయారు కాబట్టి అపహాస్యం చెయ్యడం అనాగరికం. ఇరువైపులా పోయిన ప్రాణాలన్నీ మనవే. చరిత్రలోని ఈ అధ్యాయం నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలను విస్మరిస్తే, భవిష్యత్తులో మరిన్ని కష్టాలు, నష్టాలు తప్పవు.

ఈ మూడింట్లో ఏవీ నిరుపయోగంగా జరగలేదు. అన్నిటి వల్లా సమాజానికి ఎంతో కొంత మేలే జరిగింది. కానీ అంతకన్నా తక్కువ త్యాగాలు, నష్టాలతో, ప్రత్యామ్నాయ పోరాట మార్గాలలో ఎక్కువ మేలు జరిగే అవకాశాలు ఉన్నాయా అని ఇప్పటికైనా మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. ఇన్ని పోరాటాలు చేసి, ఇన్ని త్యాగాలు చేసి, చివరకు రాజకీయాలను, ఆర్థిక వ్యవస్థను ఎటువంటి శక్తులకు అప్పజెప్పాం?

తుపాకులు, మందుపాతర్లు, ప్రజాకోర్టులు మాదక ద్రవ్యాల్లాంటివి. అలాగే బూటకపు ఎన్‌కౌంటర్లు కూడా. ఒకసారి అలవాటుపడితే వెనక్కి రావడం కష్టం. ప్రజల మెదళ్లలో నెగళ్లు రాజేసి, వాళ్లనే ఆలోచనాపరుల్ని చేయనంతకాలం రాజకీయాలను అవుట్‌సోర్సింగ్‌కి ఇచ్చేయడానికే అలవాటుపడతారు. సమస్యలు వారివి అయినపుడు పరిష్కారాల కోసం ప్రత్యామ్నాయాలు వెతుక్కునే పని కూడా వారిదే. దానికోసం విస్తృత స్థాయిలో త్యాగాలు చెయ్యనక్కరలేదు. వకాల్తా పుచ్చుకుని ప్రాణ త్యాగాలు చేసినంత మాత్రాన ప్రేక్షకుల ఆలోచనాస్థాయి మారదు. బల ప్రయోగంతో బానిసల్ని చెయ్యగలరు గానీ, బలవంతాన ఎవర్నీ స్వతంత్రుల్ని చెయ్యలేం. ఈ సుదీర్ఘ పోరాట ప్రయోగంతో 'చితి'కిపోయిన ప్రాణాలకు, కుటుంబాలకు లాల్ సలాం.

■ ఎ.బి. వెంకటేశ్వరరావు

# మెకాలే శృంఖలాల్లో భారతీయ మేధ

స్వతంత్ర భారతదేశ మేధా ప్రస్థానంలో ఒక ప్రధాన అపసవ్యతను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరిగ్గా ఎత్తి చూపారు. దశాబ్దాల స్వపరిపాలన ఆ కళంకాన్ని రూపుమాపలేకపోయిందని ఆయన గర్హించారు. ఇటీవల రామనాథ్ గోయెంకా స్మారకోపన్యాసం వెలువరిస్తూ ఆయన ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. భారతీయులు వలసపాలనలో రూపొందిన మనస్తత్వాలను త్యజించి, తమ స్వీయ నాగరికతా వారసత్వం ఆలంబనతో పరిపూర్ణ స్వావలంబన దేశాన్ని నిర్మించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఆ ఉపన్యాసంలో థామస్ బాబింగ్టన్ మెకాలే గురించి మోదీ చేసిన వ్యాఖ్యలను నేను అంగీకరిస్తున్నాను. మనలను మనం 'గులామీకి మానసికతా' (మానసిక బానిసత్వం) నుంచి విముక్తం చేసుకోవాలని, రాబోయే దశాబ్ద కాలం చాలా నిర్ణయాత్మక కాలమని ఆయన పిలుపునివ్వడాన్ని నేను బలపరుస్తున్నాను. నేనూ ఒక సూచన చేయదలిచాను: వచ్చే పది సంవత్సరాల కాలంలో మనం భారతీయ జనతా పార్టీని అధికార పీఠాల నుంచి కూలదోసి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భావజాల ప్రభావాన్ని తొలగించాలి.




■ యోగేంద్ర యాదవ్

ఎకసెక్కంగానో, ఎత్తిపొడుపుగానో నేను ఆ సూచన చేయలేదు. మేధా నిబద్ధతతో, కొత్త ఆలోచనలను పురిగొల్పే లక్ష్యంతోనే నేనా సూచన చేశాను. అవును, మెకాలే మానసపుత్రులపై సమరాన్ని తిలక్‌ధారి మెకాలేలను దీటుగా ఎదుర్కోవడం ద్వారా ప్రారంభించాలి. ఆ తరువాత సూట్‌లు ధరించి టైలు కట్టుకునే నవీన కులీన మెకాలేల భరతం పట్టాలి. సాంస్కృతిక జాతీయవాదం అనే ప్రచ్ఛన్న రూపంలో ఉన్న మానసిక బానిసత్వం బ్రౌన్ సాహిబ్‌ల (పాశ్చాత్య జీవనశైలి, భాష, ఆలోచనా పద్ధతులను అనుసరించే స్వదేశీ పెద్ద మనుషులు) అసభ్యకరమైన, కనిపించే బానిసత్వం (పాశ్చాత్య పద్ధతులు, ఆదర్శాలను గుడ్డిగా అనుకరించడం) కంటే మరింత ప్రమాదకరమైనది.

మెకాలే 1835లో రాసిన 'మినిట్ ఆన్ ఇండియన్ ఎడ్యుకేషన్' లక్ష్యాల గురించి ముందు తెలుసుకుందాం. ఇంగ్లీషు బోధనా మాధ్యమంగా ఉండాలని సంప్రదాయ భారతీయ విషయాల కంటే పాశ్చాత్య శాస్త్రాలు, సారస్వతాన్ని ప్రోత్సహించాలని మెకాలే తన నివేదికలో సూచించాడు. 'ఒక మంచి యూరోపియన్ గ్రంథాలయంలో ఒక బీరువాలో ఉన్న పుస్తకాల విలువ–భారత్, అరేబియాలు సృష్టించిన మొత్తం సాహిత్యం కంటే ఉన్నతమైనది. సంస్కృత భాషలోని సమస్త పుస్తకాల నుంచి సమీకరించిన చారిత్రక పరిజ్ఞానం, ఇంగ్లాండ్‌లో ఒక ప్రాథమిక పాఠశాల పాఠ్యగ్రంథంలో సంక్షేపించిన జ్ఞానం కంటే తక్కువ విలువైనది. ఇది ప్రాకృతిక, నైతిక తత్వశాస్త్రాలలోని ప్రతి విభాగానికీ వర్తిస్తుంది' అని మెకాలే పేర్కొన్నాడు. ఈ కారణంగా భారతీయ విద్యారంగానికి ఆయన చేసిన విధాననిర్దేశమిది: 'మనకు, మనం పాలించే ప్రజలకు మధ్య వారధులుగా ఉండే ఒక ప్రత్యేక వర్గాన్ని సృష్టించడం మన విద్యా విధాన లక్ష్యం కావాలి. ఆ ప్రత్యేక వర్గంలో ఉండేవారు రక్తం, రంగులో భారతీయులు అయినప్పటికీ అభిరుచులు, నమ్మకాలు, నైతిక విలువలు, అభిప్రాయాలు, తెలివితేటల్లో ఇంగ్లీష్‌వారుగా ఉండాలి'.

> వర్తమాన పాలకుల జాతీయవాద వాక్పటిమ వలసపాలనలో మనం స్వీయ అస్తిత్వాన్ని కోల్పోయామనే వాస్తవాన్ని మరచిపోయేలా చేస్తోంది. జాతి కోల్పోయిన ఆత్మగౌరవాన్ని తిరిగి సాధించేందుకు మనం 'సంఘ్' భావజాల ప్రభావం నుంచి బయటపడి మహాత్మాగాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్ మేధా మార్గాలలో ముందుకు సాగాలి.



పాశ్చాత్య సామ్రాజ్యవాదుల రాజకీయ ఆధిపత్యానికి, ఆర్థిక దోపిడీకే కాకుండా జ్ఞానపరమైన హింస (పాలితుల అవగాహనా సామర్థ్యాలు, జ్ఞానసముపార్జనా పద్ధతులు, దృక్పథాలను తిరస్కరించడం, అణచివేయడం)కు కూడా భారత్ గురయిందన్న వాస్తవాన్ని మెకాలే 'మినిట్' మనకు జ్ఞాపకం చేస్తోంది. అయితే, ఆధునిక యుగానికి ముందు పరిఢవిల్లిన భారతీయ విద్యా విధాన ప్రశస్తత గురించి మోదీ వ్యాఖ్యలను (బహుశా ఆయన ధరమ్‌పాల్ పుస్తకం 'ది బ్యూటిఫుల్ ట్రీ' నుంచి స్ఫూర్తి పొంది ఉంటారు) నిశితంగా పరీక్షించవలసిన అవసరం ఉన్నది. మెకాలే ప్రణాళిక విజయవంతమవడంపై ఆయన విచారం వాస్తవానుగుణ్యమైనది, ఆయన అభిప్రాయాలలో సత్యవాదిత్వం ఉన్నది. బ్రిటిష్ పాలకులు పెంపొందించిన విద్యా వ్యవస్థ భారతీయుల ఆత్మవిశ్వాసాన్ని చావుదెబ్బ తీసింది. బ్రౌన్ సాహిబ్ (రక్తం, రంగులో మాత్రమే భారతీయులు)ల పాలనలోనే ఉండిపోయాము. స్వతంత్ర భారతదేశ విద్యావ్యవస్థ మెకాలే వారసత్వాన్ని చాలా వరకు కొనసాగించిందన్న మోదీ ఆరోపణ నిజమే. మన సమాజంలో 'విదేశీ మేధావుల నుంచి స్వీకరించిన భావాల, దిగుమతి చేసుకున్న వస్తువుల, సేవల' ప్రభావం మితిమీరిన స్థాయిలో ఉండడాన్ని మోదీ తీవ్రంగా ఆక్షేపించారు.

మోదీ వాదనలను కొట్టివేసేందుకు విమర్శకులు కపట, కృత్రిమ వాదనలపై ఆధారపడ్డారు. వారిలో కొంతమంది స్వాతంత్ర్యానంతర భారతీయ విద్యా వ్యవస్థ వలసపాలనాకాల విద్యావ్యవస్థకు కొనసాగింపు కాదని వాదించారు. అధికారిక ఉద్దేశాలు, అభిమతాలలో ఆ కొనసాగింపు లక్షణాలు లేని మాట నిజమే కాని ఆచరణల్లో ఆ పాత వ్యవస్థనే కొనసాగించారన్నది నిజం. ఆంగ్ల భాషకు ప్రాధాన్యమివ్వడమే అందుకొక తార్కాణం. ఆధునిక విద్య, ఆంగ్ల భాష సుగుణాలను ప్రస్తుతించేవారు ఒక వింత వాదన చేస్తున్నారు. మన పూర్వకాలపు జ్ఞాన వ్యవస్థలను, దేశీయ భాషలను పక్కన పెడితేనే నవీన విద్య, ఇంగ్లీష్ నుంచి మనం సంపూర్ణ ప్రయోజనాలు పొందగలుగుతామనేది ఆ వాదన సారాంశం. ఈ విమర్శకులు నిజానికి మెకాలేతో ఏకీభవిస్తున్నారు. మెకాలే విద్యా విధానంలో శిక్షణ పొందినవారిలో ఆత్మన్యూనతా భావం బాగా ఉందన్న ప్రధానమంత్రి అభిప్రాయానికి ఆ విమర్శకులే నిదర్శనం.

వలసపాలన తన విధేయులనే కాకుండా విమర్శకులను కూడా ఎలా తనకు అనుకూలంగా కట్టడి చేస్తుందో ఆశిష్ నంది (వర్తమాన సజీవ భారతీయ ఆలోచనాపరులలో అగ్రగణ్యుడు, వలసవాద మానసిక ప్రభావాల గురించి నిశితంగా విశదీకరించిన విజ్ఞుడు) జీవితకాల మేధా కృషి తేటతెల్లం చేసింది. వలసవాదంలో రెండు విభిన్న దశలను ఆయన గుర్తించారు. మొదటిది: భూభాగాలను ఆక్రమించుకోవడం, రెండోది: హేతుబద్ధమైన 'నాగరిక' భావజాలాల ద్వారా పాలితుల సంస్కృతిని, ఆలోచనా పద్ధతులను ప్రభావితం చేయడం. తద్వారా పాశ్చాత్య ఆధిపత్య భావనలను పాలితులు అంతర్గతీకరించుకునేలా చేస్తుంది. పాశ్చాత్య సంస్కృతి, విలువలు, సంస్థలు తమ వాటికంటే మెరుగైనవి, అభివృద్ధి చెందినవని నమ్మేలా చేసే ప్రక్రియ అది. ఈ ప్రక్రియను ఆశిష్ నంది తన పుస్తకం 'ది ఇంటిమేట్ ఎనిమీ: లాస్ అండ్ రికవరీ ఆఫ్ సెల్ఫ్ అండర్ కొలోనియలిజం'లో సమగ్రంగా వివరించారు. శతాబ్దాల వలసపాలనతో పాశ్చాత్య ప్రపంచం మనకు 'సన్నిహిత శత్రువు' (ఇంటిమేట్ ఎనిమీ) అయిందని నంది అభివర్ణించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రవచించే జాతీయవాదం వలసవాదంతో ప్రేరేపితమైన అనుకరణ ప్రతిస్పందనలకు ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. మోదీ వెలువరించిన గోయెంకా ఉపన్యాసం కూడా అటువంటి ప్రతిస్పందనలకు ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. 'గవర్నెన్స్ మోడల్', 'టూరిజం' 'మేడ్ ఇన్ ఇండియా' మొదలైన భావనల గురించి ఆయన ప్రస్తావించారు. ఈ ఆంగ్ల పదాలు ఆయన హిందీ ఉపన్యాసంలో ప్రస్తావితమయ్యాయి. అవన్నీ 'దిగుమతి అయిన భావాలు' అన్న వాస్తవాన్ని అర్థం చేసుకోకుండానే వాటిని ఆయన ప్రస్తావించారు మరి. నూతన విద్యా విధానం గురించి కూడా ఆయన ప్రస్తావించారు. నిజానికి అది అమెరికన్ విద్యా విధానానికి భారతీయ జ్ఞాన వ్యవస్థల అంశాలను కలగలుపుతూ రూపొందించిన విధానమే.

ఆరెస్సెస్ సైద్ధాంతిక పత్రాలు, బీజేపీ భావజాల పెద్దల రచనలు చదివితే ఆ సంస్థలు తమ సంస్థాపక భావాలను భారతీయ నాగరికతా విలువలకు విరుద్ధంగా పాశ్చాత్య దేశాల నుంచి ఎలా సంగ్రహించిందీ అర్థమవుతుంది. ప్రధాన భావన అయిన జాతీయవాదం విఫలమైన పాశ్చాత్య జాతి–రాజ్యం నమూనాకు అనుకరణే. ఎందుకంటే, ఆ విఫల పాశ్చాత్యనమూనా సాంస్కృతిక స్వరూప స్వభావాల ఏకరూపతను, అధికార కేంద్రీకరణను డిమాండ్ చేస్తుంది. ఇది మన నాగరికతా అనుభవానికి విరుద్ధమైనది. హిందుత్వ భావజాలంలోని దూకుడుతనం, మితిమీరిన ప్రభుత్వ జోక్యం (హైపర్–స్టేటిజం), కలహశీల మెజారిటేరియన్ వాదం అంతర్గతీకరించుక్ను ఆత్మన్యూనతా భావాన్ని దాచిపెడుతున్నాయి.

వలసవాద మేధను సూచించేదేమిటి? వలస పాలకుల ఆధిపత్య ప్రాపంచిక దృక్పథాన్ని అంతర్గతీకరించుకుని మనసా వాచా కర్మణా వారికి ప్రతిరూపంగా వెలుగొందాలన్న లక్ష్యమే వలసవాద మేధకు గీటురాయి. ఈ దృష్ట్యా మన వలసవాద మనోవైఖరులు కొనసాగేందుకు ప్రస్తుత పరిపాలనా విధానం ఒక ఆలంబనగా ఉన్నది. కాషాయ వస్త్రధారులైన మెకాలే వారసుల పాలన ఆంగ్ల మానసపుత్రుల పరిపాలన కంటే అధ్వానమైనది. వర్తమాన పాలకుల జాతీయవాద వాక్పటిమ వలసపాలనలో మనం స్వీయ అస్తిత్వాన్ని కోల్పోయామనే వాస్తవాన్ని మరచిపోయేలా చేస్తోంది. జాతి కోల్పోయిన ఆత్మగౌరవాన్ని తిరిగి సాధించేందుకు మనం 'సంఘ్' భావజాల ప్రభావం నుంచి బయటపడి మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్ మేధా మార్గాలలో ముందుకు సాగాలి.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com





కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

# అడవి బిడ్డల ప్రతిభకు వేదిక

కేఎల్‌యూలో ఘనంగా ఉద్భవ్-2025





- కేంద్ర మంత్రి జువల్ ఓరమ్‌కు వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని అందజేస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి
- ప్రారంభించిన కేంద్ర మంత్రి జువల్ ఓరమ్
- గొప్ప మార్పునకు నాంది: మంత్రి సంధ్యారాణి
- ఆకట్టుకున్న గిరిజన విద్యార్థుల నృత్యాలు

8



# నో..సైలెన్స్

- బైక్ సైలెన్సర్లను ఇష్టానుసారం మారుస్తున్న ఆకతాయిలు
- గుండెలు హడలేలా విపరీత, వింత శబ్దాలు
- పాదచారులు, స్థానికులకు తీవ్ర అసౌకర్యం

8

## రూ.35.71 కోట్ల సర్‌చార్జీ విడుదలకు కృషి

- జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కు రెవిన్యూ మంత్రి హామీ

## మహిళల హత్య కేసులో.. ఇద్దరికి పదేళ్లు, ఒకరికి మూడేళ్ల జైలు

## పునీత శౌరి బోధనలు ఆచరణీయం

6

## రెండో విడత భూసమీకరణకు

# శ్రీకారం

- రేపటి నుంచే గ్రామాల్లో ఎల్‌పీ యూనిట్లు
- గుంటూరు, పల్నాడు కలెక్టర్లతో మంత్రి నారాయణ భేటీ
- సమావేశానికి హాజరైన తాడికొండ, పెదకూరపాడు ఎమ్మెల్యేలు

గుంటూరు, తుళ్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అమ రావతి రాజధానిలో రెండో విడత భూసమీకరణ ప్రక్రియకు ప్రభు త్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే భూసమీకరణ ఉత్తర్వులు వెలు వడగా బుధవారం గుంటూరు కలెక్టరేట్‌లో మంత్రి నారాయణ విధివిధానాలపై గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. తాడికొండ, పెదకూరపాడు ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, భాష్యం ప్రవీణ్ కూడా ఈ సమావేశంలో పాల్గొ న్నారు. గత శనివారమే ల్యాండ్ పూలింగ్ యూనిట్లకు డిప్యూటీ కలెక్టర్ల నియామకం జరిగిన ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో వెంటనే కార్యాలయాలు ఏర్పాటు చేసి శుక్రవారం నుంచే భూ సమీకరణ ప్రక్రియ ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.

### బ్లూ, గ్రీన్ రాజధానిగా అమరావతి

**ఏడీసీ అధికారుల సమీక్షలో మంత్రి నారాయణ**

'అమ్యూజ్‌మెంట్ పార్కులు, ఎకో రిసార్టులు, మ్యూజికల్ ఫౌంటె యిన్స్, స్నో వరల్డ్‌లతో బ్లూ, గ్రీన్ కాన్సెప్ట్‌తో ప్రతిఒక్కరిని ఆకట్టుకునేలా రాజధాని అమరావతిలో ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. అమరావతిలో పచ్చదనం అభివృద్ధిపై బుధవారం ఆయన రాయపూడిలోని ము న్సిపల్ శాఖ ప్రధాన కార్యాల యంలో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏడీసీ) అధికారులతో (మిగతా 8వ పేజీలో)

# స్క్రబ్ టైఫస్.. కలకలం



## పల్నాడు జిల్లాలో ఇద్దరు మృతి

- జీజీహెచ్‌లో చికిత్సతో కోలుకున్న మరొకరు
- పొలం పనుల్లో జాగ్రత్తగా ఉండాలన్న వైద్యాధికారులు
- బ్యాక్టీరియా గుర్తింపునకు గుంటూరు జీజీహెచ్‌లో ప్రయోగశాల
- దద్దులు, జ్వరం, తలనొప్పి, వణుకు, కండరాల నొప్పులే వ్యాధి లక్షణాలు

నరసరావుపేట, ముప్పాళ్ల, రాజుపాలెం, గుంటూరు మెడికల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వివిధ జిల్లాలో వెలుగుచూసిన స్క్రబ్ టైఫస్ కేసులు పల్నాడులోనూ కలకలం సృష్టిస్తున్నాయి. ఇప్పటికే ఇద్దరు మృతి చెందగా, మరొకరు చికిత్సతో కోలుకున్నారు. స్క్రబ్ టైఫస్‌తో గ్రామీ ణులు వణికిపోతున్నారు. ప్రస్తుతం పల్నాడుతో పాటు బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ముమ్మరంగా పొలం పనులు జరు గుతున్నాయి. పలు ప్రాంతాల్లో స్క్రబ్ టైఫ స్ జ్వరాలు వెలుగు చూస్తు న్నాయని, వీటిపై ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని ప్రజలకు వైద్య ఆరోగ్యశాఖ సూచిస్తోంది. ప్రధానం గా పొలం పనుల్లో ఉన్న సమయం లో కుట్టే పురుగుతో స్క్రబ్ టైఫస్ వ్యాధి వ్యాపిస్తున్నట్లు అర్థమవుతోంది. కాగా స్క్రబ్ టైఫస్ లక్షణాలతో ము ప్పాళ్ల మండలం రుద్రవరం గ్రామాని కి చెందిన మోరబోయిన జ్యోతి (20), రాజుపాలేనికి చెందిన యాకసిరి నాగమ్మ(62) టైఫస్ లక్షణాలతో మృతి చెందగా, రాజుపాలెం మండలం కొత్తూరుకు చెందిన సాలమ్మ అనే మహిళ గుంటూరు జీజీహెచ్‌లో చి కిత్స పొంది కోలుకున్నారు. ఆయా ఘట నలు బుధవారం వెలుగుచూశాయి. దీంతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. కాగా వై ద్య శాఖ ఆయా గ్రామాల్లో (మిగతా 8వ పేజీలో)



రాజుపాలెం: కొత్తూరు గ్రామంలో సాలెమ్మతో మాట్లాడుతున్న వైద్యులు రవితేజ నాయక్, పాల్ రవి, సిబ్బంది

### వ్యాధి లక్షణాలు ఇలా..

స్క్రబ్ టైఫస్.. జంతువుల నుంచి మనుషులకు సోకే జూనోటిక్ వ్యాధి. ఓరియన్షియా సుసుగముషి అనే పేడ పురుగు బ్యాక్టీరియా వల్ల స్క్రబ్ టైఫస్ జ్వరం సోకుతుంది. జ్వరబాధితుల్లో శరీరంపై ఒకే ఒక నల్లని మచ్చ ఏర్పడుతుంది. దీని వల్ల వ్యాధిని సులువుగా గుర్తించవచ్చు. ఈ పురుగు కుడితే రోగుల్లో శరీరంపై దద్దులు, జ్వరం, తలనొప్పి, వణుకు, కండరాల నొప్పులు లాంటి లక్షణాలు కనిపిస్తాయి. సకాలంలో గుర్తించక పోతే శ్వాస సంబంధిత వ్యాధులకు దారితీస్తుంది. లక్షణాలు కనబడిన వెంటనే ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వ్యాధిపై ఆందోళన అవసరం లేదని, శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలని, ఇంటి బయట నిద్రించకుండా ఉండాలని వైద్యులు తెలిపారు. పొలం పనులు చేసేవారు చేతులకు గ్లౌజులు, కాళ్లకు రబ్బరు బూట్లు ధరించాలని, ఇంటి చుట్టుపక్కల పొదలు, ఎలుకలు నివారించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

# ఎయిమ్స్‌కు రాచమార్గం

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఎయిమ్స్‌కు ప్రస్తు తం ఉన్న రోడ్డుని సువిశాలంగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంగళగిరి శివారులోని పాత ఎన్‌హెచ్-5 నుంచి ఎయిమ్స్‌కు రెండు వరసల రోడ్డు మార్గమే ఉన్నది. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ స్తంభించిపోతున్నది. ఈ క్రమంలో ఎయిమ్స్‌కు చేరుకునే మార్గాన్ని పశ్చిమ వైపున 600 మీటర్ల పొడవునా విస్తరించి సెంట్రల్ డివైడర్ సదుపాయంతో రోడ్డుని అభివృద్ధి చేయాలని రోడ్లు, భవనాల శాఖను ప్రభు త్వం ఆదేశించింది. ఆ మేరకు రూ.10 కోట్లకు పరిపాలన అనుమతి మంజూరు చే స్తూ ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి తిరుమల కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

### రేషన్‌లో.. 3 కేజీల జొన్నలు

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో ఈ నెలలో పౌర సరఫరాల శాఖ జొన్నలు కూడా పంపిణీ చేస్తోంది. ప్రతి రైస్ కార్డుకు గరిష్ఠంగా 3 కిలోల చొప్పున ఉచితంగా జొన్నలు అందించనున్నారు. కాగా పెండింగులో ఉన్న స్మార్ట్ కార్డులను త్వరగా తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి కోమలి పద్మ కోరారు. కార్డుల పంపిణీ సెప్టెంబరు 1 నుంచి కొనసాగుతున్నా ఇంకా 44,688 మంది కార్డులు తీసుకోలేదన్నారు. సచివాలయానికి వెళ్లి తమ కార్డు ఎక్క డ ఉందో తెలుసుకుని, కార్డులో ఉన్న సభ్యులలో ఎవరైనా వేలిముద్ర వేసి స్మార్ట్ కార్డు పొందవచ్చన్నారు.

# రేషన్ షాపుల్లో సీసీ కెమెరాలు పెట్టాలి

- బియ్యం అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్, జేసీలకు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అక్రమాలను నియంత్రించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి కోరారు. నియోజకవర్గంలో రేషన్ పంపిణీ వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలపై ఎమ్మెల్యే గళ్లా మాధవి బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాతో పాటు జేసీ అశుతోష్ శ్రీవాత్సవలకు వినతి పత్రం అందజేశారు. అక్టో బరులో నియోజక వర్గం లోని అన్ని రేషన్ దుకా ణాల గురించి తహసీ ల్దార్, స్థానిక ప్రధాన నాయకులతో కలిసి సమీ క్ష చేసిన ఆమె పేద కుటుంబాలకు ఇబ్బందిక రంగా మారిన రేషన్ అక్ర మాలను గుర్తించారు. వాటిపై చర్యలకు చేపట్టాలని కలెక్టర్, జేసీలకు అంద జేసిన వినతిపత్రాల్లో కోరారు. కొందరు డీలర్లు 2వ తేదీకే షాపులు మూసేసి స్టాక్ లేదని చెబుతున్నారని, బియ్యం ఇవ్వకుండా డబ్బులు తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని, షాప్ లోకేషన్‌లు ప్రజలకు అనుకూలంగా లేకుండా మారుస్తున్నారని, స్మార్ట్ కార్డుల పంపిణీలో జాప్యం జరుగుతోందని, కార్డు దారులకు సరైన విధంగా రేషన్ ఇవ్వడంలేదని ఫిర్యాదు చేశారు. నియో జకవర్గంలోని 90 షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రేషన్ అక్రమాలపై మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరిల దృష్టికి తీసుకువెళ్లగా 11 షాపులపై చర్యలు తీసుకు న్నారన్నారు. కొత్తగా కేటాయించిన డీలర్లు స్వచ్ఛందంగా తమ షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం శుభ పరిణామం అన్నారు. వచ్చే 1 నుంచి చర్యలను అమలు చేయనున్నట్లు అధికారులు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నియమిం చిన కొందరు డీలర్లు కావాలనే ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరి స్తున్నారని ఆరోపించారు. 'ఇంటి వద్దకే పింఛను- ఇంటి వద్దకే ప్రజా పంపిణీ' వంటి సంక్షేమ విధానాలను కూడా అడ్డుకునే ప్రయత్నాలు జరుగు తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధుల పేర్లు చెప్పి బెది రింపులు చేసే డీలర్లను ఏ మాత్రం ఉపేక్షించబోమన్నారు.



కలెక్టర్ అన్సారియాకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మాధవి

# సమన్వయంతో తెనాలి పట్టణాభివృద్ధి

- పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధు లు, ప్రజలు సమన్వయంతో పని చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీ లించారు. వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల వద్ద ఫైకస్ పార్కు పనులను పరిశీలించి.. సంక్రాంతి నాటికి పార్కును ప్రజలకు అం దుబాటులోకి తేవాలన్నారు. ప్రజలు సేద తీరేందుకు, చిన్న ఫంక్షన్లు జరుపుకునేందుకు అనువుగా పార్కును తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. అనంతరం శివాజీ చౌక్‌లోని రహదారి విస్తరణ పనులను, గాంధీ ఇ ర్విన్ పార్కు వద్ద నిర్మించిన షాపులను సందర్శించారు. రహదారి అభివృద్ధిలో భాగంగా తొలగించిన దివంగత మాజీ ఎంపీ యడ్లపా టి వెంకట్రావు ఆర్చిని, విగ్రహాన్ని కౌన్సిల్ ఆమోదంతో ఏర్పాటు చే స్తామన్నారు. బుర్రిపాలెం మార్గంలో షెల్టర్‌ను కూడా పునఃనిర్మిస్తా మన్నారు. రహదారి మధ్యలోని మహాత్ముని విగ్రహాన్ని తొలగించి అదే ప్రాంతంలో ఏర్పాటు చేస్తామని, సోలార్ విద్యుత్, పార్కింగ్ సౌకర్యాలను కల్పిస్తామన్నారు. వ్యర్థాల నిర్వహణ కోసం రూ.1.16 కోట్లతో మున్సిపాలిటీ కొనుగోలు చేసిన కాంపాక్టర్‌ను మంత్రి ప్రా రంభించారు. పట్టణ ప్రజలు అభివృద్ధి పనులకు సహకారించి.. స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకోవాలని సూచించారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, కౌన్సిలర్లు, కమిషనర్ అప్పలనాయుడు, ఎంఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



శివాజీచౌక్‌లో రహదారి విస్తరణ పనులు పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

# రేపు నారాకోడూరులో మెగా పీటీఎం 3.0

చేబ్రోలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేర కు ఈ నెల 5న శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ (మెగా పీటీఎం 3.0)లో భాగంగా నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను బుధవారం తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ మండల అధికారులతో కలసి సందర్శించారు. పాఠశాల లో జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ క ల్యాణ్ పాల్గొంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో సభా వేదిక, విద్యార్థులు, తల్లిదండ్రులు కూర్చునే ప్రాంగణం, వాహనాల పార్కింగ్, అతిథుల రాకపోకల మార్గాలు, గ్రౌండ్‌లో శానిటేషన్, తాగునీ టి సదుపాయం వంటి అంశాలను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమంలో.. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుం డా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె అధికారులకు సూచించారు. రాష్ట్ర నాయకులు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని నారాకోడూ రులో ఒక ఆదర్శంగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కా ర్యక్రమంలో ఎంఈవో రాయల సుబ్బారావు, తహసీల్దార్ శ్రీనివాసశర్మ, ఎంపీడీవో ఊహారాణి, ఈవోపీఆర్డీ రవిశంకర్, పాఠశాల ప్రధానోపాధ్యా యులు ఏడుకొండలు, విద్యా కమిటీ ఛైర్మన్ గోపినాథ్ పాల్గొన్నారు.



నారాకోడూరు జిల్లా పరిషత్ పాఠశాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ

## ఇక రెండు నెలలకోసారి డీఆర్‌సీ మీటింగ్

● కలెక్టర్లను ఆదేశించిన ప్రభుత్వం

గుంటూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు మూడు, నాలుగు నెలలకు ఒకసారి జరుగుతోన్న జిల్లా సమీక్ష మండలి సమావేశం ఇక నుంచి రెండు నెలలకు ఒకసారి జరుగుతుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ సమావేశం తేదీని కొన్ని రోజులు ముందుగానే ఖరారు చేసి డీఆర్‌సీకి నామినేట్ అయిన సభ్యులంతా హాజరయ్యేలా ఆహ్వానించాలని సూచించింది. జిల్లాకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించి పురోగతిలోకి తీసుకురావడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. దీంతో ఏడాదిలో ఆరు సార్లు ఇకపై డీఆర్‌సీ మీటింగ్‌లు జరుగనున్నాయి. దీని వల్ల పెండింగ్ సమస్యలపై చర్చించి పరిష్కారానికి ఆస్కారం ఏర్పడుతుందని ప్రజా ప్రతినిధులు, అధికారులు అంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఉన్నప్పుడు డీఆర్‌సీ మీటింగ్‌కు ఎంతో ప్రాధాన్యం ఉండేది. ఈ సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తప్పక హాజరయ్యేవారు. ప్రభుత్వ స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలపై డీఆర్‌సీలో తీర్మానం చేసి పంపించేవారు. అలాంటి తీర్మానాలకు ప్రభుత్వం కూడా ఆమోదం తెలిపేది. ఎప్పుడైతే జిల్లాల విభజన జరిగిందో అప్పటి నుంచి డీఆర్‌సీ పట్ల మనసకారం ప్రారంభించారు. మూడు, నాలుగు నెలలకు ఒకసారి మొక్కుబడి తంతుగా మారింది. ఈ నేపథ్యంలో మళ్లీ జవసత్వాలు తీసుకొచ్చేలా రెండు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతోంది.

## రాత్రిళ్లు ఎఫ్ఆర్ఎస్ నమోదంటే కష్టం

గుంటూరు సిటీ, డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం) నమోదులో ఎదురవుతున్న ఇబ్బందులను ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వైద్య ఆరోగ్య శాఖ కార్య దర్శి సౌరబ్ గౌర్ ఎదుట వెల్లడించారు. బుధవారం కార్యదర్శిని కలిసి వినతి పత్రం అంద జేశారు. అనంతరం గుంటూరులో విలేకరులతో అసోసియే షన్ కార్యదర్శి సందీ ప్‌కుమార్ మాట్లాడుతూ రాత్రిళ్లు ఎఫ్ఆర్ఎస్ వేయాలన్న నిబంధనను వెంటనే రద్దు చేయాలని హెల్త్ కార్యదర్శి ని కోరామన్నారు. కార్యదర్శిని కలిసిన వారిలో అసోసియే షన్ ఎన్టీఆర్ జిల్లా నాయకులు నీలిమ, నవీన్ తదితరులు ఉన్నారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 140, 149, 160 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 268.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 278.00 |

## 41,369 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 43,369 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 41,814 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 12,872 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| నాన్ ఏసీ కామన్ వెరైటీ | | | ఏసీ కామన్ వెరైటీ | | |
| 334 | 10000 | 17000 | 334 | 10500 | 16800 |
| నెంబరు. 5 | 11500 | 15600 | నెంబరు. 5 | 11000 | 15500 |
| 273 | ---- | ---- | 273 | ---- | ---- |
| 341 | 10500 | 16800 | 341 | 12000 | 17300 |
| 4884 | ---- | --- | 4884 | 12000 | 14200 |
| సూపర్ 10 | --- | ---- | | | |
| నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ | | | ఏసీ స్పెషల్ వెరైటీ | | |
| తేజ | 10000 | 15500 | తేజ | 11000 | 15000 |
| షార్క్-1 | ----- | ---- | బ్యాడిగి 355 | 11000 | 17500 |
| బ్యాడిగి | 10500 | 17200 | దేవనూరు డీలక్స్ | 10500 | 16000 |
| దేవనూరు డీలక్స్ | 11000 | 16500 | తాలుకాయలు | 5000 | 7800 |
| ఆర్మూరు | 10500 | 13300 | | | |



# రూ. 35.71 కోట్ల సర్‌చార్జీ విడుదలకు కృషి

● జడ్పీ చైర్‌పర్సన్‌కు రెవెన్యూ మంత్రి హామీ

గుంటూరు సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్‌కు రిజిస్ట్రేషన్ సర్ చార్జీ రూ.35.71 కోట్ల బకాయి వెంటనే విడుదల చేసేందుకు కృషి చేస్తానని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినాకు హామీ ఇచ్చారు. జడ్పీకి రిజిస్ట్రేషన్ సర్ చార్జీల బకాయి విడుదల చేయాలని చైర్‌పర్సన్ బుధవారం రెవెన్యూ మంత్రిని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఆర్థిక పరిస్థితులను మంత్రికి వివరించారు. ఉమ్మడి జడ్పీకి రిజిస్ట్రేషన్ సర్ చార్జీలు 2022 నుంచి రావలసి ఉందన్నారు. గుంటూరు జిల్లాకు రూ.22.34 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.2.18 కోట్లు, పల్నాడు జిల్లాకు రూ.11.19 కోట్లు రావాల్సి ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన మంత్రి అనగాని ఆర్థిక శాఖ మంత్రితో మాట్లాడి విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ను శాలువాతో మంత్రి సత్కరించారు.



మంత్రి అనగానితో సంభాషణలో జడ్పీ చైర్‌పర్సన్

## విద్యుదాఘాతంతో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

పెదకాకాని, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం చెందిన ఘటన బుధవారం వెలుగు చూసింది. పెదకా కాని పోలీసుల కథనం ప్రకారం.. కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన కొండ వెంకట హిమష్‌రెడ్డి అనే విద్యార్థి కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాడు. అతనికి వీవీఐటీ యూనివర్సిటీలో చదివే లోకేశ్ అనే విద్యార్థి స్నేహితుడయ్యాడు. ఈ క్రమంలో బుధవారం లోకేశ్ పుట్టిన రోజు కావడంతో.. అతనికి శుభాకాంక్షలె చెప్పేందుకు హిమేష్‌రెడ్డి ప్రత్యేక ఫ్లెక్సీలు తయారు చేసుకొని మరో స్నేహితుడు చెర్రీని తీసుకొని నం బూరు సమీపంలోని వీవీఐటీ వర్సిటీ వద్ద ఉన్న ప్రైవేటు హాస్ట ల్‌కు వచ్చాడు. అక్కడ ఫ్లెక్సీ కట్ట గా..ఆ ప్రాంతంలో ఫ్లెక్సీ కట్టడం నిషేధం అని తెలుసు కుని.. తొలగించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ విదుత్‌ట్రాన్స్‌ఫార్మర్ వల్ల షాక్‌కు గుర అక్కడికక్కడే మృతి చెందా డు. అతనితో పాటు వచ్చిన మరో స్నేహితుడు రామకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసు లు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పునీత శౌరి బోధనలు ఆచరణీయం

● బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య..

పట్టిచెరుకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానవాళి మనుగడ కోసం నిత్యం పరితపిస్తూ అశువులు బాసిన మహోన్నత వ్యక్తి పునీత శౌరివారి జీవితమని గుంటూరు పీఠాధి పతి బిషప్ చిన్నాబత్తిని భాగ్య య్య కొనియాడా రు. గుంటూ రులోని పట్టిచెరుకూరు మండ లం మేజరు పంచాయతీ ముట్లూరు గ్రామంలో కుల, మత లకు అతీతంగా ఆరాధి స్తూ పూజలు అందుకుంటున్న పునీత శౌరి వారి తిరునాళ్ల మహో త్సవం బుధవారం మహో త్సవ సమష్టి దివ్య బలి పూజ కార్యక్రమానికి బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేవాలయ ప్రాంగణంలో తరలి వచ్చిన వందలాది భక్తులను ఉద్దేశించి సందేశమిచ్చారు. పునీత శౌరి వారు మహనీయులని, ఆయన బోధనలు ఆచరణీయమని కొనియాడారు. ఏసుప్రభు ఆదేశానుసారం ప్రపంచ మానవాళి మనుగడ కోసం నిత్యం తపిస్తూ.. చైతన్యవంతం చేయడంలో సఫలీకృతమయ్యారన్నారు. ప్రతి ఒక్కరూ రాగద్వేషాలు, కుల, మతాలు, కక్షలు, కార్పణ్యాలు వీడి శాంతి మార్గంలో నడిచేందుకు ఆయన చెప్పిన ఆప్తవాక్యాలు గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో భక్తులను ఉద్దేశించి సమష్టి పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ సందేశమిచ్చారు. రాత్రికి భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు, కుటుంబ సభ్యులతో కలసి కొవ్వొత్తులతో ప్రదక్షణలు నిర్వహించారు. తిరునాళ్లలో ప్రధాన ఉత్సవాన్ని తేరు ఊరేగింపు మనంగా నిర్వహించారు. స్థానిక దేవాలయ ప్రాంగణంలోని హృదయ మందిరం వద్ద.. గ్రామానికి చెందిన కొచ్చర్ల జ్యోతిరాజు గుంటూరులోని స్టెప్స్ స్కూల్ కరస్పాండెంట్‌గా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. ఈ వేడకల నేపథ్యంలో ఆయన తల్లిదండ్రులు కొచ్చర్ల శౌరయ్య, ఆంతోనమ్మల జ్ఞాపకార్థం పునీత శౌరివారి 40 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందు కు నిర్ణయించారు. నిర్మాణ ప్రదేశంలో పలువురు ఫాదర్ల సమక్షంలో జ్యోతిరాజు కుటుం బ సభ్యుల సమక్షంలో బిషప్ భాగ్యయ్య ప్రత్యేక ప్రార్థనలు చేసి, భూమి పూజ చేశారు. తిరు నాళ్ళ సందర్భంగా అవాం ఛనీయ ఘటనలు జరగకుం డా డీఎస్పీ భానోదయ పర్య వేక్షణలో సీఐ రమా నాయక్ బందోబస్తు నిర్వహించారు.



భక్తులకు సందేశమిస్తున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య

# పొగాకు రైతులను ఆదుకోండి

● పార్లమెంట్‌లో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



నరసరావుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులు తీవ్ర కష్టాలు పడుతున్నారని, వేలం కేంద్రాల్లో విక్రయించేందుకు తీసు కొస్తున్న పొగాకు లాట్లను తిరస్క రిస్తున్నారని దీంతో ధర పతనం అవ డంతో తీవ్రంగా నష్టపోతున్నారని బుధవారం పార్లమెంట్ సమావే శంలో నరసరావు పేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు బాధిత రైతులు గోడు వినిపించారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం పొగాకు రైతుల దయనీ స్థితిని వివరించారు. ఏపీ ప్రభుత్వం రూ.278 కోట్లు ఖర్చు చేసి రైతులను ఆదుకుందని, సీఎం చంద్రబాబు నాయుడు అభ్యర్థన మేరకు, పొగాకు బోర్డు ద్వారా కేంద్రం వెంటనే ఆర్థిక సాయం అందించాలని కోరారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఐటీసీ నిర్లక్ష్యంపై ఎంపీ ధ్వజమెత్తారు. దేశంలో అతిపెద్ద టొబాకో కంపెనీగా ఉన్న ఐటీసీ 2025 -26 సంవత్సరం రెండో త్రైమాసికంలోనే రూ.5,187 కోట్ల లాభాలు ఆర్జించిందని గుర్తుచేశారు. అయితే పల్నాడు, గుంటూరు ప్రాంతాల్లో పొగాకు సాగుపై ఆధారపడి ఉన్న రైతుల సంక్షేమం, పంట వైవిధ్యీకరణ, వ్యవసాయ స్థిరీకరణ వంటి అంశాల్లో సీఎస్ఆర్ నిధులు వినియోగించడంలో ఐటీసీ పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని లోక్‌సభలో ఎండగట్టారు. రైతులు లాభాల మూలస్తంభమైతే కంపెనీలు సమాజ బాధ్యతలను నిర్వర్తించాల్సిన సమయం ఇదేనని స్పష్టం చేశారు. పల్నాడు ప్రాంతాల్లో రైతులకు ప్రత్యేక రక్షణ చర్యలు అవసరమని కోరారు. రైతుల వద్ద ఉన్న పొగాకు నిల్వలను కొనుగోలు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఏఎన్‌యూ యువజనోత్సవాలు వాయిదా

ఏఎన్‌యూ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 6 నుంచి 8 వరకు జరగాల్సిన అంతర కళాశాలల యువజనోత్సవాలను వాయిదా వేసినట్లు యువజనోత్సవం సమన్వయకర్త ఆచార్య ఎస్.మురళీమోహన్ బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న అంబేడ్కర్ వర్ధంతి కారణంగా యువజనోత్సవం మారిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 8న ప్రార ంభమై 10వ తేదీ ముగుస్తుందని ఆయన చెప్పారు. అంబేడ్కర్ వర్ధంతి రోజు. యువజ నోత్సవం నిర్వహణ సమంజసం కాదంటూ పలువురు పరిశోధకులు, విద్యార్థులు సునీల్ మామిడి, సీహెచ్.రవికుమార్, సతీష్ బురదగుంట, బి.ప్రిన్స్ తదితరులు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలానికి వినతిపత్రం అందజేశారు. యువజనోత్సవం నిర్వహించే రోజునే.. అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎవరూ ఉండరన్నారు. కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరారు.

గణపవరం పీహెచ్‌సీని సందర్శించిన

## ఆరోగ్య శాఖ కమిషనర్

నాదెండ్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామ పరిధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జి. వీరపాండ్యన్ బుధవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. సాయంత్రం 5:25 గంటల సమయంలో ఆయన ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. ఐతే అప్పటికే సిబ్బంది వెళ్లి పోవడంతో పాటు తాళాలు వేసి ఉండటాన్ని ఆయన గుర్తించారు. ఈ సందర్భ ంగా ఆయన ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించి ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. సాధార ణ పర్యటనలో భాగంగానే ఆయన సందర్శించినట్లు సమాచారం.

మహిళల హత్య కేసులో..

# ఇద్దరికి పదేళ్లు, ఒకరికి మూడేళ్ల జైలు

తుళ్లూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెక్కల్లు గ్రామానికి చెందిన ఇద్దరు మహిళల మరణానికి కారణమైన కేసులో ఇద్దరికి పదేళ్ల, ఒకరికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ గుంటూరు 5వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి కె.నీలిమ బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నెక్కల్లు గ్రామానికి చెందిన పసుపులేటి చినబాపయ్య, మరికొంతమంది తమ తాతల కాలం నుంచి బీ ఫాం కలిగిన స్థలంలో ఇళ్లు కట్టుకుని జీవిస్తున్నారు. పసుపులేటి చినబాపయ్య బాబాయి చలపతిరావుకు కూడా సమీపంలోనే స్థలం ఉంది. ఆ పక్కనే పసుపులేటి నాగుల్ మీరాకు 7 సెంట్ల స్థలం ఉంది. ఈ రెండింటికి మధ్య చిన్న వాగు నుంచి నీరు స్థలాలకు వెనకవైపున ఉన్న చెరువులోకి వెళ్తుంటుంది. అదే గ్రామానికి చెందిన ఆలూరి బ్రహ్మయ్య ఎకరానికిపైగా విస్తీర్ణంలో షెడ్డును వేసి అద్దెకిచ్చాడు. ఈ క్రమంలో షెడ్డుకు వెళ్లడానికి దారి కోసం చలపతిరావు, మీరావలి స్థలాల మధ్య ఉన్న వాగును మట్టితో పూడ్చించాడు. ఈ క్రమంలోనే చలపతిరావు స్థలంలోనూ మట్టిని పోయించి దారిగా మార్చాడు. దీంతో వివాదం తలెత్తి 2019 ఏప్రిల్ 5న సాయంత్రం ఘర్షణకు దారితీసింది. చినబాపయ్యతోపాటు బంధువులపై ఆలూరి సుధాకర్, ఆలూరి విజయబాబు అలియాస్ అజరు, ఆలూరి బ్రహ్మయ్య, యర్రమాసు శ్రీనివాసరావు, ఆలూరి వెంకటేశ్వర్లు, ఆలూరి ఆదినారాయణ దాడి చేశారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ట్రాక్టర్‌లో ఎక్కిస్తుండగా ఆలూరి సుధాకర్ కారుతో వచ్చి చినబాయ్య తల్లి పసుపులేటి మహాలక్ష్మి, భార్య పసుపులేటి వీరకుమారిని ఢీకొట్టాడు. అదేకారులో యర్రమాసు శ్రీనివాసరావు, ఆలూరి అజరు కూడా ఉన్నారు. అనంతరం తీవ్రంగా గాయపడిన మహిళలిద్దర్నీ గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా.. మహాలక్ష్మి మృతి చెందింది. వీరకుమారి ఓ ప్రైవేటు హాస్పిటల్ చికిత్స పొందుతూ చనిపోయింది.. ఈ ఘటనపై చినబాపయ్య ఫిర్యాదు మేరకు తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ నివేదికను సీఐలు ఎన్.శ్రీధర్‌బాబు, టి.విజయకృష్ణ కోర్టులో దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో ఆలూరి సుధాకర్, యర్రమాసు శ్రీనివాసరావుకు పదేళ్ల జైలు, రూ.10 వేల చొప్పున జరిమాన విధించారు. ఆలూరి అజరుకు మూడేళ్ల జైలు, రూ.3 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున టి.దుర్గాప్రసాద్ వాదనలు వినిపించారు. సాక్షులను కానిస్టేబుల్ శ్రీనివాస నాయక్ కోర్టులో ప్రవేశపెట్టారు.

SHRIRAM Finance

## శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(పూర్వపు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14ఎ, శ్రీ టవర్స్, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034

### డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, గౌరవ ఎన్‌సిఎల్‌టి, చెన్నై, తేది : 9-11-2022 నాటి ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పోరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద తన **జోనల్ ఆఫీస్ చిరునామా :** శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ ఆఫీస్, శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034. **మరియు బ్రాంచి ఆఫీస్ నరసరావుపేట** వద్ద నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

| క్ర సం. | ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు | NPA తేది / ఋణ మొత్తం | డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం |
|---|---|---|---|
| 1 | **1) జాకోబ్ పెరికల,** తండ్రి : ఆశీర్వాదం, డోర్ నెం. 1-68/1, వీరమ్మ కాలనీ, కొండమోదు, రాజుపాలెం, గుంటూరు జిల్లా, సీతారామపురం మైన్స్, గుంటూరు. **2) పెరికల విజయ్ భాను,** భర్త : జాకోబ్ పెరికల, డోర్ నెం. 1-68/1, వీరమ్మ కాలనీ, కొండమోదు, రాజుపాలెం, గుంటూరు జిల్లా, సీతారామపురం మైన్స్, గుంటూరు. **3) భాగ్యశ్రీ పెరికల,** తండ్రి : జాకోబ్, డోర్ నెం. 4-16-149ఎ, 1వ లైన్, భారత్ పేట, అన్నదాన సత్రం ఎదురుగా, గుంటూరు, బ్రాడీపేట, గుంటూరు. **4) సాల్‌మోన్ రాజు రెడ్డి గుడిపాటి,** తండ్రి : కోటేశ్వరరావు రెడ్డి జి, డోర్ నెం. 1-86/1, టిఎన్ నగర్, కొండమోదు పోస్ట్, రాజుపాలెం మండలం, గుంటూరు జిల్లా, కొండమోదు, గుంటూరు. | 31-03-2020 / Rs. 15,00,000/- | 14-11-2025 / రూ. 54,36,941/- (అక్షరాలా యాభై నాలుగు లక్షల ముప్పై ఆరు వేల తొమ్మిది వందల నలభై ఒక్క రూపాయలు మాత్రమే) |
| | ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. **NARP1TF1807280006** | | |
| | **షెడ్యూల్ ఆస్తులకు యజమాని శ్రీ జాకోబ్ పెరికల, డాక్యుమెంట్ నెం. 113/2015, పిడుగురాళ్ళ ఎస్.ఆర్.ఓ. :** పూర్వపు గుంటూరు జిల్లా, ప్రజెంట్ పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, పిడుగురాళ్ళ సబ్ డిస్ట్రిక్, రాజుపాలెం మండలం, కొటనెమలిపురి గ్రామ పంచాయితీ ఏరియా, కుబడుపురం గ్రామం, డి.నెం. 358/47ఎ1 వద్ద 234 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఇంటి స్థలము అందలి ఆర్‌సిసి రూఫ్ రెసిడెన్షియల్ బిల్డింగ్ దానికి చెందిన పాత డోర్ నెం. 5-92, ప్రజెంట్ డోర్ నెం. 6-161, పాత అసిస్ట్ నెం. 1081 మరియు ప్రజెంట్ అసిస్ట్ నెం. 1161, కొండమోదు గ్రామం. **హద్దులు : తూర్పు :** రోడ్డు - 43 1/2 అ॥, **దక్షిణం :** సోకుమంచి రాఘవులు గారి ఆస్తి - 46 అ॥, **పడమర :** కూకట్లపల్లి మేరి గారి ఆస్తి - 45 1/2 అ॥, **ఉత్తరం :** రోడ్డు - 48 1/2 అ॥. పై సరిహద్దుల మధ్య 234 చ॥గ॥లు విస్తీర్ణంలోని ఇంటి స్థలము అందలి ఆర్‌సిసి రూఫ్ రెసిడెన్షియల్ బిల్డింగ్ మాత్రమే (ఆస్తికి చెందిన డాక్యుమెంట్ నెం. 113/2015, పిడుగురాళ్ళ ఎస్.ఆర్.ఓ) | | |

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

**సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.**

తేది : 14-11-2025, ప్రదేశం : నరసరావుపేట — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.


SHRIRAM Finance

## శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(పూర్వపు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14ఎ, శ్రీ టవర్స్, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034

### డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, గౌరవ ఎన్‌సిఎల్‌టి, చెన్నై, తేది : 9-11-2022 నాటి ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పోరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద తన జోనల్ ఆఫీస్ చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ ఆఫీస్, శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034. మరియు బ్రాంచి ఆఫీస్ వినుకొండ వద్ద నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.


| క్ర సం. | ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు | NPA తేది / ఋణ మొత్తం | డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం |
|---|---|---|---|
| 1 | **1) తేలప్రోలు వెంకట సుబ్బారావు,** తండ్రి : పున్నయ్య, డోర్ నెం. 5-87-75, 3వ లైన్, లక్ష్మీపురం, జూబిలేషన్ హై స్కూల్, గుంటూరు టౌన్ మరియు గుంటూరు జిల్లా. **2) తేలప్రోలు మల్లిక,** భర్త : వెంకట సుబ్బారావు, డోర్ నెం. 5-92-39/4, 3వ లైన్, దేవాపురం, పట్టాభిపురం, గుంటూరు టౌన్ మరియు గుంటూరు జిల్లా. **3) తేలప్రోలు మోహన్‌బాబు,** తండ్రి : శ్రీరాములు, డోర్ నెం. 25-17-48, 8వ లైన్, శ్రీనివాసరావు పేట, గుంటూరు టౌన్ మరియు గుంటూరు జిల్లా. | 31-03-2021 / Rs. 15,00,000/- | 22-11-2025 / రూ. 46,69,886/- (అక్షరాలా నలభై ఆరు లక్షల అరవై తొమ్మిది వేల ఎనిమిది వందల ఎనభై ఆరు రూపాయలు మాత్రమే) |
| | ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. **VNKN3TF1902230006** | | |
| | **షెడ్యూల్ ఆస్తులకు యజమాని శ్రీ తేలప్రోలు వెంకట సుబ్బారావు మరియు తేలప్రోలు మల్లిక గార్ల పేరిట ఉన్నది. యం.ఓ.డి. డాక్యుమెంట్ నెం. 1108/2019, వినుకొండ ఎస్.ఆర్.ఓ : ఐటమ్ నెం. 1 :** పూర్వపు గుంటూరు జిల్లా, ప్రజెంట్ పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, వినుకొండ సబ్ డిస్ట్రిక్ట్, శావల్యాపురం మండలం, వేల్పూరు గ్రామ పంచాయితీ ఏరియా, వేల్పూరు గ్రామం, డి.నెం. 185/ఎ1 వద్ద ఎకరా 2.71 సెంట్లు అందలి ఎకరా 0.03 సెంట్లు లేదా 145.2 చ॥గ॥లు లేదా 121.40 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. **హద్దులు : తూర్పు :** రోడ్డు, **పడమర :** తేలప్రోలు మల్లిక గారి స్థలము (ఐటమ్ నెం. 3), **ఉత్తరం :** తేలప్రోలు రవి గారి స్థలము, **దక్షిణం :** తేలప్రోలు కోటి రామ మూర్తి గారి స్థలము. పై సరిహద్దుల మధ్య ఎకరా 0.03 సెంట్లు లేదా 145.2 చ॥గ॥లు లేదా 121.40 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము మాత్రమే (శ్రీ తేలప్రోలు మల్లిక గారి ఆస్తికి చెందిన డాక్యుమెంట్ నెం. 676/2016, వినుకొండ ఎస్.ఆర్.ఓ.)<br>**ఐటమ్ నెం. 2 :** పూర్వపు గుంటూరు జిల్లా, ప్రజెంట్ పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, వినుకొండ సబ్ డిస్ట్రిక్ట్, శావల్యాపురం మండలం, వేల్పూరు గ్రామ పంచాయితీ ఏరియా, వేల్పూరు గ్రామం, డి.నెం. 185/ఎ1 వద్ద ఎకరా 2.71 సెంట్లు అందలి ఎకరా 0.04 సెంట్లు లేదా 193.6 చ॥గ॥లు లేదా 161.868 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. **హద్దులు : తూర్పు :** తేలప్రోలు మల్లిక గారి స్థలము (ఐటమ్ నెం. 3), **పడమర :** తేలప్రోలు మల్లిక గారి స్థలము (ఐటమ్ నెం. 4), **ఉత్తరం :** తేలప్రోలు రాఘవేంద్రరావు తదితరుల స్థలము, **దక్షిణం :** తేలప్రోలు రామలింగం గారి స్థలము. పై సరిహద్దుల మధ్య ఎకరా 0.04 సెంట్లు లేదా 193.6 చ॥గ॥లు లేదా 161.868 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము మాత్రమే (శ్రీ తేలప్రోలు మల్లిక గారి ఆస్తికి చెందిన డాక్యుమెంట్ నెం. 6186/2015, వినుకొండ ఎస్.ఆర్.ఓ.)<br>**ఐటమ్ నెం. 3 :** పూర్వపు గుంటూరు జిల్లా, ప్రజెంట్ పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, వినుకొండ సబ్ డిస్ట్రిక్ట్, శావల్యాపురం మండలం, వేల్పూరు గ్రామ పంచాయితీ ఏరియా, వేల్పూరు గ్రామం, డి.నెం. 185/ఎ1 వద్ద ఎకరా 2.71 సెంట్లు అందలి ఎకరా 0.04 సెంట్లు లేదా 193.6 చ॥గ॥లు లేదా 161.868 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. **హద్దులు : తూర్పు :** తేలప్రోలు మల్లిక గారి స్థలము (ఐటమ్ నెం. 1), **పడమర :** తేలప్రోలు మల్లిక గారి స్థలము (ఐటమ్ నెం. 2), **ఉత్తరం :** తేలప్రోలు రాఘవేంద్రరావు తదితరుల స్థలము, **దక్షిణం :** తేలప్రోలు రామలింగం గారి స్థలము. పై సరిహద్దుల మధ్య ఎకరా 0.04 సెంట్లు లేదా 193.6 చ॥గ॥లు లేదా 161.868 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము మాత్రమే (శ్రీ తేలప్రోలు మల్లిక గారి ఆస్తికి చెందిన డాక్యుమెంట్ నెం. 6187/2015, వినుకొండ ఎస్.ఆర్.ఓ.)<br>**ఐటమ్ నెం. 4 :** పూర్వపు గుంటూరు జిల్లా, ప్రజెంట్ పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, వినుకొండ సబ్ డిస్ట్రిక్ట్, శావల్యాపురం మండలం, వేల్పూరు గ్రామ పంచాయితీ ఏరియా, వేల్పూరు గ్రామం, డి.నెం. 185/ఎ1 వద్ద ఎకరా 2.71 సెంట్లు అందలి ఎకరా 0.04 సెంట్లు లేదా 193.6 చ॥గ॥లు లేదా 161.868 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. **హద్దులు : తూర్పు :** తేలప్రోలు మల్లిక గారి స్థలము (ఐటమ్ నెం. 2), **పడమర :** తేలప్రోలు వెంకట కోటేశ్వరరావు గారి స్థలము, **ఉత్తరం :** తేలప్రోలు రాఘవేంద్రరావు తదితరుల స్థలము, **దక్షిణం :** తేలప్రోలు రామలింగం గారి స్థలము. పై సరిహద్దుల మధ్య ఎకరా 0.04 సెంట్లు లేదా 193.6 చ॥గ॥లు లేదా 161.868 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము మాత్రమే (శ్రీ తేలప్రోలు మల్లిక గారి ఆస్తికి చెందిన డాక్యుమెంట్ నెం. 6188/2015, వినుకొండ ఎస్.ఆర్.ఓ.)<br>**ఐటమ్ నెం. 5 :** పూర్వపు గుంటూరు జిల్లా, ప్రజెంట్ పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, వినుకొండ సబ్ డిస్ట్రిక్ట్, శావల్యాపురం మండలం, వేల్పూరు గ్రామ పంచాయితీ ఏరియా, వేల్పూరు గ్రామం, డి.నెం. 185/ఎ1 వద్ద ఎకరా 2.71 సెంట్లు అందలి ఎకరా 0.03 సెంట్లు లేదా 145.2 చ॥గ॥లు లేదా 121.401 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. **హద్దులు : తూర్పు :** రోడ్డు, **పడమర :** తేలప్రోలు మల్లిక గారి స్థలము (ఐటమ్ నెం. 3), **ఉత్తరం :** తేలప్రోలు మల్లిక గారి స్థలము (ఐటమ్ నెం. 1), **దక్షిణం :** కొసన పెద వీరాంజనేయులు గారి స్థలము. పై సరిహద్దుల మధ్య ఎకరా 0.03 సెంట్లు లేదా 145.2 చ॥గ॥లు లేదా 121.401 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము మాత్రమే (శ్రీ తేలప్రోలు వెంకట సుబ్బారావు గారి ఆస్తికి చెందిన డాక్యుమెంట్ నెం. 1973/2017, వినుకొండ ఎస్.ఆర్.ఓ.) **పైన ఉన్న ఐటమ్ నెం. 1 నుండి 5 వరకు ఉన్నవి ప్రక్క ప్రక్కనే ఉన్నాయి. మరియు తూర్పు వైపున ఉన్న ఐటమ్ నెం. 1 మరియు 5 ద్వారా యాక్సెస్ కలిగి ఉన్న ఒకే సైటు ముక్కగా ఉన్నాయి)** | | |


పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

**సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.**


తేది : 22-11-2025, ప్రదేశం : వినుకొండ — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.


స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మేయర్, కమిషనర్, సభ్యులు

## అభివృద్ధి పనులకు ఆమోదం

● స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధి కోసం సభ్యులు, అధికారులు ప్రతిపాదించిన పలు పనులపై చర్చించి ఆమోదించినట్టు మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో బుధవారం స్టాండింగ్ కమిటీ సమావేశం మేయర్, స్టాండింగ్ కమిటీ చైర్మన్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కమిషనర్ పులి శ్రీనివాసులు, సీఎంఓహెచ్ డాక్టర్ శాంతి కళ, సిటీ ప్లానర్ రాంబాబు, సెక్రటరి బి. శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు రాజశేఖర్, రవి కిరణ్ రెడ్డి, సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, కొమ్మినేని కోటేశ్వరరావు, దాసరి లక్ష్మీ దుర్గ, ముప్పవరపు భారతి, సూకవరపు బాలాజీ, నగర పాలక సంస్థ వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

● నగరంలో రోడ్ల నిర్మాణ సమయంలో రోడ్ల పక్కన మొక్కలు నాటడానికి వీలుగా రింగ్స్ ఏర్పాటు చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ముత్యాలరెడ్డినగర్, స్వర్ణభారతి నగర్, విజయపురికాలనీ, జేకేసీరోడ్డు, శ్రీనివాసరావుతోటల్లోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. నగరంలో పర్యావరణ పరిరక్షణ, మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా పచ్చదనం పెంపుకు మొక్కలను విరివిగా నాటాలని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలకు సంబంధిత ఎమినిటి కార్యదర్శి, ఏఈలే బాధ్యత వహించాలని కమిషనర్ అన్నారు.

## నల్లపాడుకు వరద ముంపు నుంచి విముక్తి

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

● భారీ డ్రైయిన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని నల్లపాడు వర్షం పడితే పూర్తిగా నీటిమయం అవుతోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. దాని నుంచి విముక్తి కల్పించడానికి భారీ డ్రైయిన్ నిర్మాణం చేపట్టామని చెప్పారు. నల్లపాడు నుంచి నల్లకుంట ఆంజనేయ స్వామి ఆర్చి వరకు రూ.2 కోట్ల వ్యయంతో అవుట్‌ఫాల్ ప్రధాన డ్రెయిన్ నిర్మాణ పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ, గతంలో ఆర్‌అండ్‌బీ ద్వారా 3 అడుగుల వెడల్పు, 7 అడుగుల లోతుతో నిర్మించిన డ్రెయిన్ భారీ నీటి ప్రవాహాన్ని తట్టుకోలేకపోవడంతో తిరిగి అంచనాలు మార్చి దాదాపు రూ.2 కోట్లతో 550 మీటర్ల పొడవుతో కొత్త డ్రెయిన్ నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. ఒకటిన్నర నెలల్లో డ్రెయిన్‌ను పూర్తిగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

## కార్యకర్తలే టీడీపీకి బలం

టీడీపీకి కార్యకర్తలే అసలైన బలమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం 'కార్యకర్తలతో ముఖాముఖి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, పార్టీ కోసం శ్రమించే కార్యకర్తల సమస్యలను పరిష్కరించడం పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్నా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారి పాల్గొన్నారు.

## డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ జన్మదిన వేడుకలు

గుంటూరు మెడికల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'రోగుల నమ్మకమే తాను ఉత్తమ వైద్య సేవలు అందించేందుకు చోదక శక్తిగా పని చేస్తోందని అహల్యా హాస్పిటల్ కు చెందిన ప్రముఖ ఐవీఎఫ్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తెలిపారు. బుధవారం కొత్తపేటలోని అహల్యా హాస్పిటల్‌లో డాక్టర్ ఉమాశంకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్న డాక్టర్ ఉమాశంకర్ కేక్ కట్ చేసి సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. వేలాది మంది దంపతులకు సంతాన సాఫల్యాన్ని అందించి అనేక కుటుంబాల జీవితాల్లో ఆనందాన్ని నింపిన డాక్టర్ ఉమాశంకర్ సేవలు వైద్య రంగంలో విశేషమైనని ఈ సందర్భంగా పలువురు ప్రశంసించారు. ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ కచ్చితమైన చికిత్స అందించడం, రోగులపట్ల చూపే మానవతా దృక్పథం ఆయనపై ప్రజలకు మరింత విశ్వాసాన్ని పెంచిందని అభినందించారు. తమ పిల్లల చదువుకు సాయం అందించడంతో పాటు కొందరిని జేఎన్‌టీయూ వంటి ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో డాక్టర్ ఉమాశంకర్ చదివిస్తున్నారని ఈ సందర్భంగా అహల్యా హాస్పిటల్ సిబ్బంది తెలిపారు.


వైద్య సిబ్బందితో కలసి కేక్ కట్ చేస్తున్న డాక్టర్ ఉమాశంకర్

## అక్టోబరు 2 నుంచి రిలీవ్ ఆర్డర్లు ఇవ్వండి

గుంటూరు విద్య డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ 2025లో ఉపాధ్యాయులుగా ఎంపికైన 21 మంది వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఈ ఏడాది అక్టోబరు 2 నుంచి రిలీవింగ్ ఆర్డర్లు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బసవలింగారావు, మహమ్మద్ ఖలీద్ విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ తమీమ్ అన్సారియాకు బుధవారం వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయులుగా ఎంపికైన 21 మంది వెల్ఫేర్ అసిస్టెంట్లకు అక్టోబరు 2న కాకుండా 13న రిలీవ్ చేయడం శోచనీయమని పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమశాఖ డీడీ చేసిన నిర్వాకం వల్ల ఎంపికైన డీఎస్సీ అభ్యర్థులు 11 రోజులు సర్వీస్ కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బదిలీలతో పాటు రేషనలైజేషన్‌లో నష్టపోతారన్నారు. అనేక జిల్లాల్లో ఉపాధ్యాయులుగా ఎంపికైన సచివాలయ ఉద్యోగులను అక్టోబరు 2కు ముందే రిలీవ్ చేశారని గుర్తు చేశారు.

## 7న అంబేడ్కర్ వర్ధంతి సభ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కేఎస్ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు (తూర్పు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట యూటీఎఫ్ కార్యాలయంలో ఈ నెల 7న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సభ జరుగుతుందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. సభకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆయన ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. డాక్టర్ అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ జరుగుందని చెప్పారు. ఈ సభలో కుల నిర్మూలన అంశంపై ప్రముఖ సాహితీ విమర్శకుడు జి.లక్ష్మీ నరసయ్య, తెలుగు సాహిత్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంశంపై ప్రముఖ కవి, సాహితీ విమర్శకుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సభలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు, తదితరులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జయసుధ, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల పెన్షన్ పెంపు ఘనత చంద్రబాబుదే

● దివ్యాంగులు, వృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ నారాయణ స్వామి

● ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం


మాట్లాడుతున్న నారాయణ స్వామి, వేదికపై అశుతోష్ శ్రీవాస్తవ, ఎమ్మెల్యే మాధవి, గోనుగుంట్ల తదితరులు

గుంటూరు (తూర్పు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పెన్షన్‌ను 12 రెట్లు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని దివ్యాంగులు, వృద్ధులు సహాయ సంస్థ చైర్మన్ గుడిపూడి నారాయణ స్వామి అన్నారు. గుంటూరు, ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం జిల్లా దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నారాయణస్వామి మాట్లాడుతూ, పెన్షన్‌లు తెచ్చింది, పెంచింది టీడీపీయేనని అన్నారు. రూ. 500 నుంచి రూ. 6వేల వరకు పెంచిందని తెలిపారు. వైసీపీ పాలనలో పూర్తిగా నిర్వీర్యమైన విభిన్న ప్రతిభా వంతుల శాఖను కేవలం 18 నెలల్లోనే ముఖ్యమంత్రి గాడిలో పెట్టారని అన్నారు. ఎప్పుడూ లేని విధంగా దివ్యాంగుల దినోత్సవానికి ప్రతి జిల్లాకు రూ. 4 లక్షలు కేటాయించారన్నారు. దివ్యాంగుల ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ, దివ్యాంగులకు సాయం కంటే ప్రోత్సాహం అవసరమని నమ్మి అనేక కార్యక్రమాలను చంద్రబాబు తీసుకువస్తున్నారని అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని విద్య, ఉపాధి, క్రీడా రంగాల్లో రాణించాలని కోరారు. జేసీ అశుతోష్ శ్రీ వాస్తవ మాట్లాడుతూ, దివ్యాంగుల్లో ప్రతిభకు కొదవలేదని వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, వెలుగులోకి తీసుకురావాలన్నారు. క్రీడలు ఇతర రంగాల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ, దివ్యాంగులు గొప్ప స్ఫూర్తి ప్రదాతలన్నారు. పారా ఒలింపిక్స్‌లో అనేక పతకాలు సాధించి దేశానికి గొప్ప పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారని అన్నారు. అనంతరం క్రీడలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ ఏడి దుర్గాబాయి, విభిన్న ప్రతిభావంతుల సంఘాల అధ్యక్షుడు కొల్లగాని శ్రీనివాసరావు, జయరాజ్, శివ ప్రసాదు, సాయి తదితరులు పాల్గొన్నారు.

### ఏర్పాట్లపై తీవ్ర అసంతృప్తి

దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లపై దివ్యాంగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వేడుకలను తూతూ మంత్రంగా నిర్వహించడంపై అసహనం వ్యక్తం చేశారు. స్టేడియం లోపల నిర్వహించిన సభ వరకు వీల్ చైర్లు ఏర్పాటు చేయకపోవడంతో, స్టేడియం బయటే వాహనాలల్లోనే వేచి ఉన్నారు. కనీసం తాగు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భోజనం దుర్వాసన రావడంతో చాలమంది తినకుండానే వెనుతిరిగారు. ఒక సమయంలో విభిన్న ప్రతిభా వంతుల ఏడీని దివ్యాంగులు నిలదీశారు. రూ.4లక్షల ఎందుకు ఖర్చుయిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

## దివ్యాంగులకు అన్ని విధాలా ప్రోత్సాహం

● సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు మెడికల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ సిబ్బందికి అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని గుంటూరు సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత కార్యక్రమంలో పారా ఒలింపిక్స్‌లో పాల్గొని ప్రతిభను చాటిన జీజీహెచ్ స్టాఫ్ నర్స్ విజయ్‌ను, వీల్‌చైర్ వాలీబాల్, క్రికెట్ క్రీడల్లో రాణిస్తున్న జీజీహెచ్ సిబ్బందిని ఆయన సత్కరించారు. స్టాఫ్‌నర్స్‌గా విధులు నిర్వహిస్తూనే వివిధ క్యాడర్‌లలో సమర్థవంతంగా సేవలు అందిస్తున్న సిబ్బందిని కూడా సన్మానించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ బివి రావు, ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీదేవి, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 మాధురి, గంగమ్మ పాల్గొన్నారు.

### రాజాగారితోటలో...

గుంటూరు (విద్య), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైకల్యంతో ఎన్నో అవరోధాలను, కష్టాలను ఎదుర్కొంటూ జీవిస్తున్న దివ్యాంగుల స్ఫూర్తి ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని తూర్పు ఎంఈవో జ్యోతి కిరణ్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాజాగారితోటలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మనందరికీ స్ఫూర్తినిస్తున్న దివ్యాంగులకు చేయూతనిద్దామని ఆమె సూచించారు. పశ్చిమ ఎంఈవో కె.నాగేంద్రమ్మ మాట్లాడుతూ, దివ్యాంగులు శారీరక వైకల్యాన్ని మరిచి మనోధైర్యంతో ఎదగాలన్నారు. శారీరక, మానసిక వైకల్యంతో జన్మించిన చిన్నారులకు సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలు, ఉపకరణాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.రామ నర్సయ్య, ఉపాధ్యాయులు మానస, భాను, శ్రీధర్, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## 6న మహా క్రిస్మస్ వేడుకలు

● ముఖ్య ప్రసంగికుడిగా పాల్ దినకరన్ హాజరు

గుంటూరు సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఏసీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 6వ తేదీన సాయంత్రం 5 గంటలకు మహా క్రిస్మస్ వేడుకలు జరగనున్నాయి. యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం ఆధ్వర్యంలో జరగనున్న కమ్యూనిటీ క్రిస్మస్ వేడుకల్లో జీసస్ కాల్స్‌కు చెందిన డాక్టర్ పాల్ దినకరన్ ముఖ్య ప్రసంగికుడుగా హాజరు కానున్నారు. ఈ వేడుకకు ఏసీ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం ప్రెసిడెంట్ మద్దిరాల జోసెఫ్ ఇమ్మాన్యుయేల్ బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుంటూరులోని అన్ని క్రైస్తవ సంఘాలు, సంస్థలు, ఫెలోషిప్‌లు కలిసి నిర్వహించే ఈ మహా క్రిస్మస్ వేడుకకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా సీతారామాచార్యుల శతజయంతి

గుంటూరు (తూర్పు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై పౌరాణిక శిరోమణి, బహు గ్రంథకర్త సారస్వతమూర్తి కోగంటి సీతారామచార్యుల శతజయంతి వారోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానం పాలకమండలి అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య దీప ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త డీఎన్ దీక్షిత్ మాట్లాడుతూ సంస్కృతంతో పాటు తెలుగు సాహితీ ప్రియుల్ని ఆయన రచనలు అలరింప చేస్తాయని చెప్పారు. సభకు కోగంటి వీర రాఘవ చార్యులు అధ్యక్షత వహించారు. ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి హనుమద్ వైభవంపై మాట్లాడారు. కార్యక్రమంలో తిరుప్పావై డాక్టర్ కోగంటి శ్రీరంగ నాయకి, భారతీయ ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపకుడు బొల్లెపల్లి సత్యనారాయణ, నూతలపాటి తిరుపతయ్య, కోగంటి అప్పలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## లోకోల దీక్షలకు సీపీఎం మద్దతు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ పిలుపు మేరకు గుంటూరు రైల్వే స్టేషన్ ఆవరణలో జరుగుతున్న 48 గంటల దీక్షలకు సీపీఎం పార్టీ మద్దతు తెలిపారు. ఈ దీక్షలను సందర్శించి వై.నేతాజీ ప్రసంగిస్తూ అవిశ్రాంతంగా పనిచేయడం వల్ల ఉద్యోగుల ఆరోగ్యం దెబ్బ తినడంతో పాటు పలు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఖాళీలున్నా భర్తీ చేయకపోవడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును ఉద్యోగులు ప్రతిఘటించాలని, ప్రజాతంత్ర వాదులు ఉద్యోగులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు బి.లక్ష్మణరావు, కాకుమాను నాగేశ్వరరావు, బైరగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరపాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి కేఎల్ యూనివర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండారపు యశ్వంత్ రఘువీర్ డిమాండ్ చేశారు. కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆ యూనివర్సిటీలో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారని, వాటిపై విచారించాలని కోరారు. విద్యార్థి మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అతడి కుటుంబానికి నష్ట పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అమర్నాథ్, అజయ్, ఆనంద్, తేజ, సతీష్ పాల్గొన్నారు.

## నేడు లంకా దినకర్ రాక

గుంటూరు(తూర్పు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇరవై సూత్రాల కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్ గురువారం జిల్లాకు రానున్నారని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ఆరోగ్యం, విద్యా రంగాలకు సంబంధించిన ప్రత్యేక పథకాల అమలు పురోగతి., అమృత్, అమలు స్థితి, జల్ జీవన్ మిషన్ పురోగతి, పీఎం సూర్యఘర్, కుసుమ్ పథకాలను సమీక్షిస్తారని పేర్కొన్నారు. అనంతరం మీడియాతో సమావేశమై విజయవాడకు వెళతారని తెలిపారు.

## పూల మార్కెట్ గోడపై తాత్సారమేల...?


కూల్చిన గోడ (పాత చిత్రం)

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న పూల మార్కెట్‌లో నెల రోజుల క్రితం కూల్చివేసిన గోడ పునర్నిర్మాణంపై అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారంటూ పలువురు వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. గోడ కూల్చివేత కారణంగా తాము తీవ్రంగా నష్టపోతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూల మార్కెట్లో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దుకాణాలు నిర్మించారు. అయితే ఉద్దేశపూర్వకంగా ఓ వ్యాపారి గోడను కూల్చివేశారని మిగిలినవారు వాపోతున్నారు. గోడ కూల్చివేయడంపై అప్పట్లోనే ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ నూరి ఫాతిమా నిరసన వ్యక్తం చేయగా, ఎస్టేట్ అధికారి స్పందించి తాము గోడను పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇది జరిగి నెల గడిచినా ఇంతవరకు ఎటువంటి నిర్మాణ పనులు జరగలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాము ఇబ్బందులు పడుతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి గోడ నిర్మాణం పూర్తిచేయాలని వారు కోరుతున్నారు.

## అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

పంట నష్టం కారణంగా చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఓ కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నల్లపాడు పోలీసుల వివరాల ప్రకారం, జొన్నలగడ్డకు చెందిన ఇమిడాబత్తిన దత్తారాయుడి (79)కి ఎకరం పొలం ఉంది. తన కుమారులతో కలసి మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. సాగు పెట్టుబడికి అప్పు చేశాడు. అయితే పంటలు సరిగా పండకపోవడంతో అప్పు తీర్చే మార్గం తెలియక తీవ్ర మానసిక వేదనకు లోనయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 2న ఇంట్లో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే దత్తారాయుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. అతని కుమారుడు వెంకటేశ్వరరావు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బైక్ దొంగకు ఏడాది జైలు శిక్ష

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం చోరీ చేసిన కేసులో నిందితుడికి ఎక్సైజ్ కోర్టు ఏడాది జైలు శిక్షను విధించింది. దేవాపురం 2వ లైనుకు చెందిన నిందితుడు పులి రమేష్ అలియాస్ రావణ అలియాస్ రమ్మి (22)పై ఈ ఏడాది మే 7న పట్టాభిపురం పోలీసుస్టేషన్‌లో బైక్ చోరీ కేసు నమోదైంది. పోలీసులు అతడిని అరెస్టు చేసి అతను దొంగతనం చేసిన బైక్‌ను రికవరీ చేశారు. ఎక్సైజ్ కోర్టులో ఈ కేసుకు సంబంధించి విచారణ నిర్వహించి బుధవారం న్యాయమూర్తి మేరి శారా దానమ్మ నిందితుడికి ఒక సంవత్సరం కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ముద్దాయి రమేష్ మరో దొంగతనం కేసులో నాలుగు నెలల జైలు శిక్ష అనుభవిస్తూ ప్రస్తుతం జిల్లా జైలులో ఉన్నాడు. తాజాగా బైక్ చోరీ కేసులో అతడికి ఏడాది జైలు శిక్ష విధించారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని మృతదేహం

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): ఏసీ కళాశాల ఎదురు బుధవారం సుమారు 40-45 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందా డు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి, ఏసీ కళాశాల ప్రాంతంలో భిక్షాటన చేసుకుంటూ రోడ్డు పక్కన పడుకుంటూ ఉంటాడని అంతకు మించి వివరాలు తెలియవని స్థానికులు తెలిపారు. బుధవారం అతడు మృతిచెందగా కొత్తపేట పోలీసులు మృతదేహాన్ని మార్చురీలో భద్రపరచారు. మృతుడిని గుర్తించిన వారు కొత్తపేట సీఐను 8688831320 నెంబరులో సంప్రదించాలన్నారు.

### కాల్వలో పడి గుర్తు తెలియని వృద్ధుడు..


వృద్ధుడి మృతదేహం

లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముఫ్తీ బజారులో బుధవారం గుర్తు తెలియని వృద్ధుడు కాల్వలో పడి మరణించాడు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామని, మృతుడి వివరాలు తెలిసిన వారు లాలాపేట పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై వెంకటరావు కోరారు.




ముస్లిం కళాశాలలో జరిగిన జాబ్‌మేళాలో ప్రసంగిస్తోన్న కలెక్టర్, పక్కన ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

## నైపుణ్యం పెంచుకుంటేనే ఉపాధి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలు పెంచుకొని ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారీయా నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పొన్నూరు రోడ్డులోని ఆంధ్రా ముస్లిం కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నైపుణ్యం కలిగిన వారికి అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని అన్నారు. ఉపాధి ఎక్కడ లభించినా వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వేతనం తక్కువ అని వెనుకడుగు వేయొద్దని, ఆ సంస్థలో అవసరమైన నైపుణ్యం పెంచుకోవడం వల్ల ఉన్నత అవకాశాలు వస్తాయని చెప్పారు. గుంటూరు తూర్పు శాసన సభ్యుడు నసీర్ అహ్మద్ మాట్లాడుతూ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అనేక జాబ్ మేళాలను నిర్వహిస్తోందని, యువత వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



నజీనా బేగంను సత్కరిస్తున్న మహిళా కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న కుమారి పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

## ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

● జిల్లా పర్యావరణ ఇంజనీర్ నజీనా బేగం

గుంటూరు (తూర్పు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని జిల్లా పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం అన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం) గుంటూరు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్-1 ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమం స్థానిక ఏటి అగ్రహారం, ఎస్‌కేబీఎమ్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జరిగింది. ముఖ్య అతిథిగా హజరైన నజీనా బేగం మాట్లాడుతూ, సామాజిక అవగాహన కార్యక్రమాల్లో వలంటీర్ల పాత్ర కీలకమైందని అన్నారు. ఎన్ఎస్ఎస్‌తో సేవలతో పాటు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ పెరుగుతాయని చెప్పారు. ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి మాట్లాడుతూ, గత నెల 27న ప్రారంభమైన ఈ శిబిరం బుధవారంతో ముగిసినట్టు చెప్పారు. స్థానిక ఆకులవారితోటలో వలంటీర్లు చేపట్టిన స్వచ్ఛ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ ఆఫీసర్ సంతోష్ కుమారిని నజీనా బేగం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ వేత్త డి.తిరుపతి రెడ్డి, ఐటీసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.వెంకటనారాయణ, ఎస్‌కేబీఎమ్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.





# ముఖేష్, ప్రణవి ద్వయానికి రజితం



రజత పతక విజేతలు ముఖేష్, ప్రణవి

గుంటూరు(క్రీడలు) డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరుగుతున్న ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో నేలవల్లి ముఖేష్, ద్వారం ప్రణవిల జంట రజత పతకం సాధించింది. చివరి రోజైన బుధవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీం విభాగంలో వీరికి పతకం లభించింది. కేఎల్ వర్సిటీకి ప్రాతినిధ్యం వహించిన నేలవల్లి ముఖేష్ (గుంటూరు), ప్రణవి (ఒంగోలు)లు ఫైనల్‌లో పంజాబ్ యూనివర్సిటీ (చండీఘర్) జంట ఒలింపియన్ సరబ్ జ్యోత్ సింగ్, అంతర్జాతీయ క్రీడాకారిణి పాలక్ గులియాతో హోరా హోరీ తలపడ్డారు. స్కోర్ 15/15 ఉండగా చివరి షాట్ కు ముందు పంజాబ్ యూనివర్సిటీ కోచ్ టైమ్ ఔట్ తీసుకొని వీరి ఏకాగ్రతను దెబ్బ తీయడంతో చివరి 2 పాయింట్లు కోల్పోయి 17/15తో రజతంతో సరిపెట్టుకున్నారు. యూనివర్సిటీ గేమ్స్‌లో ముఖేష్‌కు ఇది మూడో పతకం. షూటింగ్‌లో మొత్తం 4 పతకాలతో కేఎల్ యూనివర్సిటీ 4వ స్థానంలో నిలిచింది. ముఖేష్, ప్రణవిలను రాష్ట్ర రైఫిల్ అసోసియేషన్ కార్యదర్శి డి.రాజకుమార్, వర్సిటీ స్పోర్ట్స్ విభాగం డీన్ కాకర్ల హరికిషోర్, పీడీలు గుంటి గౌతం, శ్రీహరి అభినందించారు.

## విద్యుత్ శాఖ ఈఈగా నాగేశ్వరరావు

గుంటూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గుంటూరు టౌన్ 1 విద్యుత్ ఈఈ టి.శ్రీనివాసబాబు పదోన్నతిపై ఎస్ఈగా విజయవాడలోని కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ పోస్టుకు టెక్నికల్ ఈఈగా వ్యవహరిస్తున్న పి.నాగేశ్వరరావును ఇంచార్జిగా నియమిస్తూ సీఎండీ పి.పుల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు టౌన్ 1 ఆపరేషన్ డివిజన్ ఈఈ పోస్టుకు తీవ్రస్థాయిలో రాజకీయ ఒత్తిళ్లు రావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ శాఖ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కాగా రోజుల వ్యవధిలోనే కొత్త ఈఈ నియామకం జరుగుతుందని చెబుతున్నారు.

# నో.. సైలెన్స్








- బైక్ సైలెన్సర్లను ఇష్టానుసారం మారుస్తున్న ఆకతాయిలు
- గుండెలు హడలేలా విపరీత, వింత శబ్దాలు
- పాదచారులు, స్థానికులకు తీవ్ర అసౌకర్యం
- మోత మోగిస్తున్నా పట్టించుకోని రవాణ శాఖ
- విపరీత శబ్ద కాలుష్యంతో అనారోగ్య సమస్యలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ప్రశాంతంగా వెళ్తున్న సమయంలో బాణ సంచా పేలినట్లు, జంతువులు అరిచినట్లు శబ్దాలు.. ఒక్కసారిగా గుండెలు జల్లుమని... హడలి అటు చూస్తూ.. బైక్ సైలెన్సర్లతో ఆకతాయిల ఆగడాలు కనిపిస్తాయి. అంతులేని అతివేగం.. ప్రాణాలు హరించే సర్పంలా ద్విచక్రవాహనంపై మెలికలు తిరుగుతున్న లెక్కలేని తనం దర్శనమిస్తుంది. విచ్చలవిడితనంతో ప్రవర్తించే వీరంతా విద్యార్థులు, బాధ్యతలేని మైనర్లు, యువతే. వారిని ఎవరైన ప్రశ్నిస్తే గొడవకు దిగుతారు.. కొట్లాడుతారు. నగరంలో సైలెన్సర్లు మార్చి.. భారీ శబ్దాలతో మోత మోగించే ద్విచక్ర వాహనాల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో శబ్ద కాలుష్యంతో పాటు ఆనారోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయి. ట్రాఫిక్, రవాణ శాఖలు వీరిని పట్టించుకోకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

### ● ఖరీదైన సైలెన్సర్లు

షోరూంలలో కొనుగోలు చేసిన బైక్‌లను యువత సైలెన్సర్లను మార్చి భారీ శబ్దాలను వెలువరించే పరికరాలను అమర్చుతున్నారు. వీటి ఖరీదు రూ.5 వేలు నుంచి రూ.15 వేలు, వింత శబ్దాలు వినబడే కొన్ని సైలెన్సర్లు రూ.40 వేల వరకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఫైల్‌బోర్, కాక్‌టైల్ షార్మర్, డాల్ఫిన్, డెవిల్, మెగాఫోన్, క్రాకర్, రాకెట్ ఇతర పేర్లతో వీటిని అమ్ముతున్నారు. వీటికి ఎటువంటి అనుమతులు లేనప్పటికి యధేచ్ఛగా విక్రయాలు జరుగుతున్నాయి. అధికారులు తనిఖీలు చేపట్టడం లేదు. వ్యాపారులపై చర్యలూ తీసుకోవడం లేదు.

### ● ఆరోగ్య సమస్యలు

60 డెసిబుల్స్‌లోపు శబ్దం వింటే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. 100 డిసిబుల్స్ దాటితే గుండె జబ్బులు ఉన్నవారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తలనొప్పి, బ్రెయిన్ స్ట్రోక్ ఉన్న వారికి విపరీతమైన తలనొప్పి, చికాకు, చర్మ సంబంధిత వ్యాధులు తలెత్తుతాయి. 160 డెసిబుల్ శబ్దం దాటితే వినికిడి కణాలపై ప్రభావం చూపుతుంది. నరాలు దెబ్బతిని పాక్షిక వైకల్యం కలుగుతుంది. 190 డెసిబుల్ దాటితే కర్ణభేరి పగిలిపోతుంది. తద్వారా శాశ్వతంగా వినికిడి శక్తి కోల్పోతారని వైద్యులు చెబుతున్నారు.

### ● శబ్ద కాలుష్యాలపై కేసులు

శబ్ద కాలుష్య కారుకులైన వాహనదారులపై మోటారు వాహన చట్టం 1968 సెక్షన్ ప్రకారం 190(2) ప్రకారం రవాణ, పోలీసు అధికారులు కేసులు నమోదు చేస్తారు. తొలిసారి కేసు అయితే రూ 1,000 జరిమానా, రెండోసారి పట్టుబడితే రూ.2వేలుతో పాటు కఠిన చర్యలకు సిఫారుసు చేస్తారు. మరోసారి దొరికితే డ్రైవింగ్ లెసెన్సు రద్దు చేసి, వాహనాన్ని సీజ్ చేస్తారు. మోటారు కంపెనీ ఉత్పత్తి చేసిన బైకులకు విడి పరికరాలు మార్చడం చట్ట రీత్యా నేరమన్న విషయాన్ని వాహనదారులు గుర్తుంచుకోవాలి. తప్పనసరి సమయంలో సైలెన్సర్ మార్చే సమయంలో దుకాణదారులు విధిగా సీ బుక్ కాపీ తీసుకోవాలి.

### ● సైలెన్సర్ మార్చుకోవాలంటే..

ద్విచక్ర వాహనానికి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత సామర్థ్యం కలిగిన సైలెన్సరును అమర్చుకోవాలి. గుర్తింపు పొందిన కంపెనీలు నిర్ణీత డెసిబుల్ శబ్దాన్ని వెలువరించే ప్రమాణాలతో సైలెన్సర్లను ఉత్పత్తి చేస్తాయి. 60 డెసిబెల్స్ వరకు శబ్దం వినేలా వీటిని తయారు చేస్తారు. వాటికి మాత్రమే అధికారులు అనుమతి ఇస్తున్నారు. సాధారణ మనిషి కూడా ఈ శబ్దాన్ని వినగలగుతాడు.

### ప్రత్యేక డ్రైవ్ చేపడతాం

బైక్ సైలెన్సర్లపై ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. గతంలో పట్టుబడిన సైలెన్సర్లను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశాం. మరోసారీ తనిఖీలు నిర్వహించి.. సైలెన్సర్లును స్వాధీనం చేసుకుంటాం. భారీ జరిమానాలు విధిస్తాం. వరుసగా పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తాం. వీటిని అమ్మే డిస్ట్రిబ్యూటర్లు, వ్యాపారులకు ప్రత్యేక సమావేశం నిర్వహించి, నిబంధనలు వివరిస్తాం. ఆ తరువాతే కుడా అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేస్తాం.



- కే సీతారామిరెడ్డి, జిల్లా ఉప రవాణా కమిషనర్

# రెండో విడత భూసమీకరణకు శ్రీకారం



(5వ పేజీ తరువాయి)

సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అమరావతి మాస్టర్ ప్లాన్ ప్రకారం రాజధానిలో 30 శాతం బ్లూ అండ్ గ్రీన్ ఉండేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ట్రంక్ రోడ్లు, ఎల్పీఎస్ జోన్లలో రోడ్లకు ఇరువైపులా, డివైడర్ మధ్య, రిజర్వాయర్ల చుట్టూ పచ్చదనం పెంపొందించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ పనులన్నీ జనవరి నెలాఖరు నుంచి ప్రారంభిస్తామన్నారు.

### రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం

రాజధానికి భూములిచ్చి ప్లాట్లు పొందిన రైతులను వెంటనే రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఫోన్ల ద్వారా సమాచారం ఇస్తున్నట్లు మంత్రి చెప్పారు. మొత్తం 29,233 మంది రైతులకు 69,421 ప్లాట్లు కేటాయించగా కేవలం 2,168 మంది మాత్రమే 7,743 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందన్నారు. లంక అసైన్డ్ ప్లాట్లకు సంబంధించి ఇంకా 157 మంది రైతులకు 295 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. కొంతమంది రైతులు రిజిస్ట్రేషన్ కోసం మరింత సమయం కావాలని కోరుతున్నారని, ఇంకా రైతులకు 719 ఎకరాల మేర ప్లాట్లు కేటాయించాల్సి ఉందని తెలిపారు.

### మరింత భూమి అవసరం

రాజధానిలో రెండో దశ ల్యాండ్ పూలింగ్‌లో 16,666 ఎకరాల మేర సమీకరణకు ఇప్పటికే ప్రభుత్వం జీవో జారీ చేసిందని మంత్రి నారాయణ చెప్పారు. ఈ భూమి రైల్వే ట్రాక్, రైల్వేస్టేషన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, స్పోర్ట్స్ సిటీ కోసం సమీకరిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు, స్మార్ట్ ఇండస్ట్రీస్ కోసం మరికొంత భూమి అవసరం అవుతుందని, దీనికి సంబంధించి అధికారులతో కసరత్తు జరుగుతోందని మంత్రి చెప్పారు. గతంలో మాదిరిగా ల్యాండ్ పూలింగ్‌పై రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కరించేలా సీఆర్డీఏ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

### నాలుగు గ్రామాలకు మినహాయింపు

సీఆర్‌డీఏ నుంచి కొన్ని అధికారాలను మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు ప్రభుత్వం బదిలీ చేసింది. పెనుమాక, నవులూరు, నిడమర్రు, ఉండవల్లి గ్రామాలను మినహాయించి మిగిలిన ఏరియాకు మాత్రమే ఈ అధికారాలను బదలాయించింది. సీఆర్‌డీఏ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద బిల్డింగ్ పర్మిషన్లు, లేఅవుట్ అనుమతులు, క్వారీయింగ్, పెట్రోలు బంకులు, ఫిల్లింగ్ స్టేషన్లు, సినిమా థియేటర్లకు ఎన్‌వోసీల జారీ, అనుమతి పొందిన లేఅవుట్లలో ప్లాట్ల సబ్ డివిజన్‌కు కమిషనర్‌కు అధికారాలను ఇచ్చింది. అలానే సర్వే చేసే అధికారం, సరిహద్దుల నిర్ణయంపైనా అధికారాన్ని కేటాయించింది. ప్రొవిజనల్ ఆదేశాల జారీ, షోకాజ్ నోటీసులు, కూలివేతకు ఆదేశాలు ఇవ్వొచ్చు. ఏదైనా నిర్మాణాలను నిలుపుదల చేయొచ్చు.

# అడవి బిడ్డల ప్రతిభకు వేదిక

- కేఎల్‌యూలో ఘనంగా ఉద్భవ్-2025
- ప్రారంభించిన కేంద్ర మంత్రి జువల్ ఓరమ్
- గొప్ప మార్పునకు నాంది: మంత్రి సంధ్యారాణి
- ఆకట్టుకున్న గిరిజన విద్యార్థుల నృత్యాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖామంత్రి జువల్ ఓరమ్


సంప్రదాయ వాద్యాన్ని ఊదుతున్న కేంద్ర మంత్రి జువల్ ఓరమ్

తాడేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మరో అద్భుతమైన వేడుకకు రాష్ట్రం వేదికైంది. గిరిజన విద్యార్థుల ఆట పాటలు, సంస్కృతి, సాంప్రదాయాలు ఒకే వేదికపై కనువిందు చేశాయి. అడవి బిడ్డలలో దాగిన ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పే.. 6వ జాతీయ ఉద్భవ్ 2025 ఉత్సవాలను బుధవారం కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరమ్ జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. తొలుత కేంద్ర మంత్రికి ఈఎంఆర్ఎస్ విద్యార్థులు గిరిజన సాంప్రదాయాల నడమ స్వాగతం పలికారు. గిరిజన సంస్కృతి, కళలను ప్రోత్సహించడమే లక్ష్యంగా కేఎల్‌యూలో మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జాతీయ స్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎంఆర్ఎస్) సాంస్కృతిక ఉత్సవాలు ఏపీలో తొలిసారిగా జరుగుతున్నాయి. 22 రాష్ట్రాల నుంచి 1647 మంది ఆరు నుంచి 12వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థులు విచ్చేశారు. ఏపీలోని 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి ఎంపికైన 110 మంది ప్రతిభావంతులు తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించనున్నారు. ఉత్సవాల ప్రారంభం అనంతరం వేదికపై కేంద్ర మంత్రి జువల్ ఓరమ్ మాట్లాడుతూ.. గిరిజన చిన్నారులు అన్ని రంగాల్లో రాణించాలని, అడవి బిడ్డల్లో దాగి ఉన్న ప్రతిభ ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఉద్భవ్ ఉత్సవాలు వేదికగా నిలవడం సంతోషకరమన్నారు. గిరిజన వ్యవహారాల శాఖకు వాజ్‌పేయి హయాంలోనే నామకరణం జరిగిందని గుర్తుచేశారు. ఐదేళ్ల గిరిజన సాంస్కృతి ఉత్సవాల సమయంలో తానే కేంద్ర మంత్రిగా ఉండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు సైనిక్ స్కూళ్ల తరహాలోనే ఈఎంఆర్ఎస్ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి ఓరమ్ స్పష్టం చేశారు. ఉద్భవ్ అంటే హృదయాంతరాల నుంచి బయటకు తీయడం అని, అందుకే ఈ ఉత్సవాలకు ఆ పేరు పెట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గిరిజన స్టాళ్లను ఆయన పరిశీలించారు. అరకు కాఫీ స్టాల్‌ను సందర్శించారు. మంత్రి గుమ్మడి సంధ్యారాణి కేంద్ర మంత్రికి వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు. ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న ఏపీ ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి ప్రశంసించారు.

### ఉద్భవ్.. గొప్ప మార్పునకు వేదిక

ఉద్భవ్ వేడుక కాదని, గొప్ప మార్పునకు వేదికని రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సభలో ఆమె మాట్లాడుతూ చిన్నారుల్లో ప్రతిభ, సృజనాత్మకతను బయటకు తీసి విశ్వాసం నింపాలన్నదే లక్ష్యమన్నారు. కొత్త పరిచయాలు, కొత్త సాంప్రదాయాలు తెలుసుకునే అవకాశం ఈ ఉద్భవ్ వల్ల సాధ్యపడుతుందన్నారు. 405 ఈఎంఆర్ఎస్ స్కూళ్ల నుంచి 1647 మంది తరలివచ్చారని, ఏపీ నుంచి 110 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. గిరిజనుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో దేశవ్యాప్తంగా చిన్నారులు ఈ వేడుకలో పాల్గొనడం విశేషమన్నారు. వెనుకబడిన వర్గాలకు సీఎం చంద్రబాబు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. ఏపీకి మరిన్ని ఈ ఎం ఆ ర్ ఎ స్ స్కూళ్లను మంజూరు చేయాలని కేంద్రమంత్రిని కోరారు. నెస్ట్ కమిషనర్ అజిత్‌కుమార్ శ్రీవాత్సవ్ మాట్లాడుతూ ఈ కళా ఉత్సవాలుకు తొలిసారి ఏపీ వేదికగా నిలిచిందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్ మాట్లాడుతూ 28 లక్షల మంది గిరిజనులు ఉన్న ఏపీలో ఈ ఉద్భవ్ ఉత్సవాలకు ఆతిథ్యమిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ హసన్ బాషా, నెస్ట్ కమిషనర్ అజిత్‌కుమార్ శ్రీవాత్సవలను సత్కరించారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదా భార్గవి, గురుకులం కార్యదర్శి ఎం.గౌతమి, నెస్ట్ జేసీ బిపిన్ చంద్రరటూరి, కేఎల్‌యూ డీన్ ప్రొఫెసర్ జీపీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న నృత్యాలు

వడ్డేశ్వరం కేఎల్‌యూ దేశ నలు మూలల నుంచి వచ్చిన ఏకలవ్య గురుకుల మోడల్ పాఠశాలల విద్యార్థులతో సందడిగా మారింది. గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా చిన్నారులు నృత్యాలు ప్రదర్శించారు. వక్తృత్వం, రచన, చిత్రకళలు వంటివి నిర్వహించారు. తొలిరోజు ఉత్సవాలు ఘనంగా జరిగాయి.


సాంస్కృతిక కార్యక్రమాలు





# స్క్రబ్ టైఫస్.. కలకలం

(5వ పేజీ తరువాయి)

బాధితుల ఇళ్లను సందర్శించి చికిత్స సమయంలో చేసిన వైద్య పరీక్షల గురించి ఆరా తీశారు. రుద్రవరం గ్రామానికి చెందిన జ్యోతి నవంబరు 1న పొలం పనులకు వెళ్లగా గుర్తు తెలియని పురుగు కుట్టింది. అప్పుడు సహజంగా ఏదో కుట్టిందిలే అని ఆమె పట్టించుకోలేదు. కొద్ది రోజులకు జ్వరం, ఒళ్లు నొప్పులు, శ్వాస, జీర్ణకోశ సమస్యలతో ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందగా జ్వరం తగ్గినా వాంతులు, విరోచనలు ప్రారంభమయ్యాయి. పురుగు కుట్టిన చోట దద్దులు వచ్చి పుండు ఏర్పడి తీవ్ర అనారోగ్యానికి గురైంది. గమనించిన కుటుంబసభ్యులు సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడి వైద్యులు గుంటూరుకు తీసుకెళ్లాలని సూచించారు. కాని కుటుంబసభ్యులు జ్యోతిని మంగళగిరిలోని ఎయిమ్స్‌కు తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె రక్తనమూనాలను పరీక్షించగా స్క్రబ్ టైఫస్ వ్యాధి పురుగు కుట్టడం వల్ల అరుదైన వ్యాధి లక్షణాలతో మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. దీంతో సత్తెనపల్లి మలేరియా యూనిట్ అధికారి చంద్రశేఖర్ బుధవారం గ్రామంలో పర్యటించి వివరాలు ఆరా తీశారు. ఇదే లక్షణాలతో మృతి చెందిన రాజుపాలెంలోని పులిచింతల పునరావాస కేంద్రానికి చెందిన నాగమ్మ నివాస గృహం వద్దకు వెళ్లిన డాక్టర్లు రవితేజానాయక్, పాల్ రవి, వైద్య సిబ్బంది కుటుంబసభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఆమె ఇంటి పరిసరాల్లోని వారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఆ తర్వాత చికిత్స పొంది కోలుకున్న కొత్తూరు గ్రామానికి వెళ్లి సాలెమ్మను విచారించారు.

### ప్రాణాంతకం కాదు : డీఎంహెచ్‌వోలు

స్క్రబ్ టైఫస్ వ్యాధి అనేది ప్రాణాంతకం కాదని గుంటూరు, పల్నాడు డీఎంహెచ్‌వోలు డాక్టర్ కే విజయలక్ష్మి, డాక్టర్ రవి తెలిపారు. నల్లిని పోలిన చిన్న కీటకం స్క్రబ్ టైఫస్ అన్నారు. ఈ కీటకం కుడితే జ్వరం, వంటి నొప్పులు, కడుపు నొప్పి ఎక్కువగా ఉంటుందన్నారు. డాక్సీసైక్లిన్ అనే టాబ్లెట్ వేసుకుంటే వ్యాధి వెంటనే తగ్గుతుందన్నారు. స్క్రబ్ టైఫస్ కాటుతో సోకే బ్యాక్టీరియా ప్రభావాన్ని గుర్తించేందుకు గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రయోగశాల ఉందని తెలిపారు. పాజిటివ్‌గా గుర్తిస్తే చికిత్స అందిస్తారని తెలిపారు. పొలంలో పనిచేసే సమయంలో ఏదైనా పురుగులు కుట్టినట్టు అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

## రేపల్లె - మచిలీపట్నం రైల్వే లైన్ సర్వేకు డీపీఆర్

- లోక్‌సభలో ప్రకటించిన మంత్రి అశ్విని వైష్ణవ్

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రేపల్లె, మచిలీపట్నం ప్రాంతాల ప్రజల చిరకాల కోరిక రైలు మార్గం డీపీఆర్ కోసం.. ఫీల్డ్ సర్వే చేపట్టినట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఎంపీ బాలశౌరీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. 45.30 కిలోమీటర్ల పొడవునా ఈ రైలు మార్గం నిర్మించాల్సి ఉంటుందని, దీంతో పాటే రేపల్లె - బాపట్ల కొత్త రైలు మార్గం(46 కిలోమీటర్లు) సర్వే చేపట్టడానికి డీపీఆర్ మంజూరు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు.

### రెడ్డిపాలెం గూడ్స్‌షెడ్‌కు ఈసీఆర్‌టీ హోదా

రెడ్డిపాలెం గూడ్స్ షెడ్డుని ప్రత్యేక కంటైనర్ రైల్ టెర్మినల్‌గా నోటిఫై చేసినట్లు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుదేష్ణ సేన్ తెలిపారు. అమరావతి రాజధానికి సమీపంలో ఈ టెర్మినల్ ఉండటం, భవిష్యత్తులో లాజిస్టిక్ హబ్ కూడా ఏర్పాటు కానుండటంతో దక్షిణ మధ్య రైల్వే కంటైనర్ రవాణ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుత గూడ్స్ రవాణాతో పాటు కంటైనర్ ట్రాఫిక్‌ని కూడా ఇకపై రెడ్డిపాలెం గూడ్స్ షెడ్డు నిర్వహిస్తుందని చెప్పారు. దీంతో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రవాణ సదుపాయాలను ఈ కంటైనర్ టెర్మినల్ అందుబాటులోకి తీసుకొస్తుందన్నారు. ప్రస్తుతం మిర్చి టిక్కీలు కంటైనర్ల ద్వారా చెన్నై పోర్టుకు రవాణా అవుతున్నాయన్నారు. కంటైనర్ టెర్మినల్ వల్ల రెడ్డిపాలెం గూడ్స్ షెడ్డు నుంచి సులభతరంగా చెన్నై పోర్టుకు చేర్చే అవకాశం ఉంటుందన్నారు.

## కేజేఎస్ఎస్ సేవలు అభినందనీయం

- ఎన్నారై డాక్టర్ పోసాని వెంకటప్పయ్య

గుంటూరు(తూర్పు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ బాలికా విద్యను ప్రోత్సహిస్తున్న కమ్మ జన సేవ సమతి (కేజేఎస్ఎస్) సేవలు అభినందనీయమని ఎన్నారై, డాక్టర్ పోసాని వెంకటప్పయ్య పేర్కొన్నారు. పలువురు ఎన్నారైలు సమీకరించిన రూ.25 లక్షల విరాళాన్ని బుధవారం కుందుల రోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో సమితి అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరికి అందజేశారు. అనంతరం వెంకటప్పయ్య ప్రసంగిస్తూ ఎన్నారైలు పోసాని పార్థసారథి రూ.5లక్షలు, పోసాని వినీత్ ఆదిత్య రూ.5లక్షలు, పార్థసారథి రూ.5లక్షలు, పోసాని శివకుమారి, సౌజన్య రూ.10లక్షలు మొత్తం రూ.25లక్షల నగదు చెక్కును అందజేసినట్లు చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన హరేంద్రనాథ్ చౌదరి మాట్లాడుతూ దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వెంకటప్పయ్యను సమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. ఎన్నారై ప్రభాకరరావు, సమితి కార్యదర్శి కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, సంయుక్త కార్యదర్శులు రాయపాటి గోపాలకృష్ణ, ఘంటా పున్నారావు, వడ్లమూడి శివరామకృష్ణయ్య, కరణం పట్టాభి సీతారామరావు, మర్రిపూడి సీతారాయ్య, గౌరవ సలహాదారు వంకాయలపాటి బలరామకృష్ణయ్య, పెద్ది సాంబశివరావు పాల్గొన్నారు.


మల్లెల హరేంద్రనాథ్ చౌదరికి చెక్కును అందజేస్తున్న డాక్టర్ పోసాని వెంకటప్పయ్య

# ప్రకృతి దోబూచులాట


కొల్లిపర సమీపంలో ధాన్యంపై కప్పిన పట్టాలపై నిలిచిన వర్షపు నీరు


కొల్లిపర మండలం తూములూరు సమీపంలో ధాన్యాన్ని గోతాలకు ఎత్తుతున్న కూలీలు


కొల్లిపరలో వర్షానికి ధాన్యంపై పట్టలు కప్పుతున్న రైతులు

కొల్లిపర, వేమూరు డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) ప్రకృతి రైతులతో దోబూచులాడుతోంది. రెండు రోజుల నుంచి వర్షం తగ్గడంతో పాటు ఎండవచ్చింది. మళ్లీ వెంటనే బుధవారం మబ్బులు కమ్ముకొచ్చి వర్షం కురిసింది. దీంతో వరి ధాన్యాన్ని రక్షించుకోవటానికి అన్నదాతలు ఉరుకులు పరుగులు తీశారు. ధాన్యరాసులను కాపాడుకునేందుకు పట్టాలు కప్పడం రైతులకు దినచర్యగా మారింది. ఉదయం ఎండ రావడం మధ్యాహ్నం నుంచి మబ్బులు కమ్ముకువచ్చి వర్షం పడడంతో రైతులు పడుతున్న శ్రమ మొత్తం నీరుగారిపోతోంది. కొల్లిపర మండలంలో సిరిపురం, అత్తోట, అత్తోట యాదవపాలెం, కుంచవరం, దంతలూరు గ్రామాల్లో వరి పంట ఎక్కువ శాతం కోతలు కాలేదు. భారీ వర్షం పడితే పంట ఎక్కడ దెబ్బతింటుందేమోనని.. వర్షాన్ని కూడా లెక్కచేయకుండా యంత్రాలతో నూర్పిళ్లు పూర్తి చేస్తున్నారు. బుధవారం తెల్లవారు జామున ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొచ్చి వర్షం పడడంతో రైతులు హడావిడిగా ధాన్యాన్ని పట్టాలు కప్పి రక్షించుకున్నారు. కొన్ని చోట్ల రైతులు ఆరబెట్టిన ధాన్యం కురిసిన వర్షానికి పూర్తిగా తడిచిపోయింది.

### ఉరుకులు పరుగులు

వేమూరు మండలంలో.. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతుల పాట్లు అంతా ఇంతా కాదు. ధాన్యం రాసులపై పట్టాలు కప్పి చుట్టు నీళ్ల నిలవకుండా ఉండేందుకు జాలు చేశారు. మరికొన్ని చోట్ల హడావుడిగా ధాన్యాన్ని గోతాలు కట్టారు. కొన్ని ధాన్యం బస్తాలు వర్షానికి తడిసిపోయాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు పూర్తిగా నేల వాలిపోయింది.


వేమూరులో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు


వేమూరు: పోతుమర్రులో ధాన్యం తడవకుండా పట్టాలు కప్పుతున్న రైతులు



ఇండోర్ ప్లాంట్స్

# ఈ మొక్కలతో కాలుష్యం దూరం

రానురానూ గాలి నాణ్యత క్షీణిస్తోంది. పొగమంచు, కాలుష్యం కలగలసి శ్వాసకోశ వ్యవస్థకు తిప్పలు తెచ్చిపెడుతున్నాయి. అయితే ఆరుబయట కాలుష్యాన్ని అడ్డుకోలేకపోయినా, ఇళ్ల లోపల గాలిని వడగట్టుకునే సదుపాయాలను ఆశ్రయించే ప్రయత్నం చేయాలి. అందుకోసం ఇవిగో ఇలాంటి ఇండోర్ ప్లాంట్స్ పెంచుకోవాలి

**స్నేక్ ప్లాంట్:** దీన్ని పెంచుకోవడం ఎంతో సులభం. గాల్లో కలిసిన ఫార్మల్డిహైడ్, క్సైలీన్, టోలిన్‌లను పీల్చుకుని, రాత్రివేళ ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది. కాబట్టి ఈ మొక్కను బెడ్రూమ్‌లో ఏర్పాటు చేసుకోవాలి

**పీస్ లిల్లీ:** అమ్మోనియా, అసిటోన్, ఇతరత్రా అస్థిర సేంద్రియ సమ్మేళనాలతో పాటు మోల్డ్ స్పోర్స్‌ను కూడా తగ్గిస్తుంది

**స్పైడర్ ప్లాంట్:** వేగంగా పెరిగే ఈ మొక్క గాల్లో కలిసిన ఫార్మల్డిహైడ్స్‌ను తొలగిస్తుంది

**అరెకా పామ్:** సహజసిద్ధంగా గాల్లో తేమను పెంచే ఈ మొక్క గాల్లో కలిసిన ఫార్మల్డిహైడ్‌తో పాటు క్సైలీన్‌ను కూడా తొలగిస్తుంది

**మనీ ప్లాంట్:** ప్రతి ఇంట్లో సర్వసాధారణంగా కనిపించే ఈ మొక్క గాల్లో కలిసిన బెంజీన్, కార్బన్ మోనాక్సైడ్‌లను పీల్చుకుని, స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది

**ఇంగ్లిష్ ఐవీ:** ఈ మొక్క పలు రకాల గాలి కలుషితాలను తొలగిస్తుంది

**రబ్బర్ ప్లాంట్:** తక్కువ వెలుగును సైతం తట్టుకోగలిగే ఈ మొక్క గాలిలోని విషాలను తొలగిస్తుంది

**డ్రాసెనా:** ఇదొక గొప్ప ఎయిర్ ప్యూరిఫయర్. పలు రకాల డ్రాసెనా మొక్కలు దొరుకుతాయి. దేన్నైనా ఎంచుకోవచ్చు

**చైనీస్ ఎవర్‌గ్రీన్:** తక్కువ వెలుగులో ఏపుగా పెరిగే ఈ మొక్క కూడా గాల్లోని కలుషితాలను తొలగిస్తుంది

**అలోవెరా:** ఈ మొక్కకు కూడా కలుషితాలను పీల్చుకునే గుణం ఉంటుంది. అలాగే ఈ మొక్కలు రాత్రివేళ స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి

**బోస్టన్ ఫెర్న్:** గాల్లోని తేమను పెంచడంతో పాటు ఆకర్షణీయమైన పూలతో ఆకట్టుకునే ఈ మొక్క గాలి కాలుష్యాన్ని కూడా హరిస్తుంది. అయితే ఈ మొక్క ఆరోగ్యంగా పెరగడం కోసం తక్కువ వెలుగు సోకే ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలి

### ఈ చిట్కాలు పాటించాలి

**గాలి చొరబడేలా:** కాలుష్యాన్ని హరించే మొక్కలను ఇళ్లలో పెంచుకోవడంతో పాటు, రాత్రివేళ కిటికీలు తెరచి ఉంచి గాలి చొరబడేలా చూసుకుంటే, ఈ మొక్కలు ఆరోగ్యంగా ఎదుగుతూ, మంచి ఫలితాలను కనబరుస్తాయి

**తగిన ప్రదేశం:** స్నేక్ ప్లాంట్ లాంటి కొన్ని మొక్కలు రాత్రివేళ ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి కాబట్టి వాటికి బెడ్రూమ్స్‌లో చోటు కల్పించాలి.

**భద్రత:** ఇంట్లో పెంపుడు జంతువులు, పిల్లలు ఉంటే, స్పైడర్ ప్లాంట్ లాంటి విషం లేని మొక్కలను ఎంచుకోవాలి. పీస్ లిల్లీ లాంటి గాలిని శుభ్రపరిచే కొన్ని మొక్కల విషపూరితమైనవి కాబట్టి వీటిని పెంపుడు జంతువులు, పిల్లలకు అందనంత ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలి.

---

# భాష కోసం పాటే ఆయుధం

**మాంతీ టిగ్గా, నిక్కీ టిగ్గా... వారి గానం కేవలం వినోదానికి కాదు... అంతకుమించి. అంతరించి పోయే ప్రమాదంలో ఉన్న తమ భాషను బతికించుకొనే పోరాటానికి వారు ఎంచుకున్న ఆయుధం... పాట. జార్ఖండ్‌కు చెందిన ఈ కజిన్స్ చేపట్టిన ప్రయత్నం ఎందరికో ప్రేరణగా నిలుస్తోంది.**



"మేము ఎక్కడ ప్రదర్శన ఇచ్చినా కచ్చితంగా పాడే పాట ఒకటుంది. "కురుఖ్ ప్రజలారా! మనం ఎటు పోతున్నాం? మన పూర్వీకులు కన్న కలలేమిటో తెలుసా? వాళ్ళ ఆలోచనలేమిటో తెలుసా? వాళ్ళు మనం బతకడానికి పొలాలు ఇచ్చారు, ధాన్యం కొట్టాలు ఇచ్చారు. వాటిని వదిలేస్తున్నాం. వాళ్ళు ఇచ్చిన ఇళ్ళు అమ్మేస్తున్నాం. మనం ఎటుపోతున్నాం?..." ఈ అర్థంతో ఆ పాట సాగుతుంది. ప్రేక్షకులకు వినోదం అందించడం కాదు... మా భాషను బతికించుకోవడం మా లక్ష్యం. దాని కోసం సాధనంగా, ఆయుధంగా పాటను మేము ఎంచుకున్నాం" అని చెబుతారు మాంతీ టిగ్గా, నిక్కీ టిగ్గా.

### ఆ ప్రశ్న బాధించింది...

అన్నదమ్ముల బిడ్డలైన ఈ అమ్మాయిల సొంత ఊరు... జార్ఖండ్ రాష్ట్రంలోని బ్రంబే అనే గిరిజన గ్రామం. ఇరవై నాలుగేళ్ళ మాంతీ గిరిజన ప్రాంతీయ భాషల్లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. 2002లో 'టాటా స్టీల్ ఫౌండేషన్' నిర్వహించిన 'సంవాద్' ఈవెంట్‌లో ఆమె తొలి ప్రదర్శన ఇచ్చారు. "నా మాతృభాష కురుఖ్. దాన్నే 'కుడుఖ్' అని కూడా అంటారు. ఆ భాషలో నేను పాడాను. అంతకుముందు స్టేజి మీద ఎప్పుడూ పాడకపోవడంతో చాలా భయపడ్డాను. అయితే ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన నాకు ఆత్మవిశ్వాసాన్ని కలిగించింది. ఆ కార్యక్రమం ముగిసిన తరువాత... కొందరు నా దగ్గరకు వచ్చి "నువ్వు పాడిన పాట చాలా బాగుంది. ఇంతకీ అదేం భాష?" అని అడిగారు. ఆ ప్రశ్న నాకు ఎంతో బాధ కలిగించింది. నిజానికి వారి తప్పేం లేదు... ఎందుకంటే... కురుఖ్ కుటుంబాల్లో పుట్టినవారే మా భాష మాట్లాడడం తగ్గిపోతోంది. అదేదో సిగ్గుపడే వ్యవహారంగా, హిందీలో మాట్లాడడం గర్వకారణంగా భావిస్తున్నారు" అంటారు మాంతీ.

### వారే మా టీచర్లు...

ఆ తరువాత ఆమెకు 'రిథిమ్ ఆఫ్ ది ఎర్త్' బ్యాండ్‌తో కలిసి పనిచేసే అవకాశం వచ్చింది. కానీ తన భాష అస్తిత్వానికి సంబంధించిన ప్రశ్నలు ఆమెను వేధిస్తూనే ఉన్నాయి. కురుఖ్... ద్రవిడ భాషా కుటుంబంలో ఉత్తర ద్రవిడ ఉప కుటుంబానికి చెందినది. మన దేశంతో పాటు నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్‌లలోని కొన్ని ప్రాంతాలలో ఈ భాష మాట్లాడేవారు ఉన్నారు. వారిని 'ఓరన్ తెగ' అంటారు. "పట్టణాలకు, నగరాలకు వలస వెళుతున్న ఇప్పటి తరం వారు మా భాషను మాట్లాడడం నామోషీ అనుకుంటున్నారు. ఈ భాష మాట్లాడేవారి సంఖ్య క్రమంగా తగ్గిపోయి... అంతరించిపోయే ప్రమాదంలో ఉంది. మన భాషను మనం మరచిపోతే... గుర్తింపును కోల్పోయినట్టే" అంటున్నారు మాంతీ. తన ఆవేదనను తన కజిన్ నిక్కీ టిగ్గాతో ఆమె పంచుకున్నారు. కామర్స్‌లో మాస్టర్స్ చేసిన ఇరవయ్యారేళ్ళ నిక్కీ కూడా ఆమెతో కలిసి గళం కలిపేందుకు ముందుకు వచ్చారు. "మేమిద్దరం సంగీతంలో ఎలాంటి శిక్షణ తీసుకోలేదు. మా అమ్మ, అమ్మమ్మ, మా గ్రామంలోని మహిళలు... వాళ్ళే మా టీచర్లు. వారు పొలాల్లో పని చేస్తున్నప్పుడు, పండుగల సందర్భంగా పాడే పాటలు వింటూ పెరిగాం. వాటితోపాటు చిన్నప్పుడు మమ్మల్ని నిద్రపుచ్చే సమయంలో... రాత్రివేళ చెప్పిన కథలను గుర్తుకు తెచ్చుకున్నాం. వాటినే వేదికలపై వినిపించాలని నిర్ణయించుకున్నాం" అని చెప్పారు ఆ ఇద్దరూ.

### ఈ ప్రయత్నం అందరికోసం...

ప్రదర్శనలు ఎలా ఉండాలనే విషయంలో ఆ ఇద్దరూ చాలా కసరత్తే చేశారు. ఎరుపు, తెలుపు రంగులతో ఉండే తమ సంప్రదాయాన్ని ప్రతిబింబించే చీరలు, తలకు పక్షి ఈకల అలంకారాలు, మెడ చుట్టూ గిరిజనులు ధరించే ఆభరణాలు... ఇదీ వారి ఆహార్యం. వాయిద్యాలు కూడా తరతరాలుగా గిరిజనులు ఉపయోగించేవాటినే ఎంచుకున్నారు. పాత పాటలకు కొత్త బాణీలు కట్టారు. "కురుఖ్ ప్రజలారా! మనం ఎటు పోతున్నాం?..." అనే అర్థం వచ్చే పాటతో సహా... కొత్త పాటలు రూపొందించారు. కురుఖ్ ప్రజలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇవ్వడం మొదలుపెట్టారు. "కురుఖ్ సంప్రదాయాల గొప్పతనాన్ని, గర్వకారకమైన విషయాలను తెలియజేస్తూ.. పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చి, భాషను, సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరాన్ని వివరించే మా పాటలకు ప్రతిచోటా చక్కని స్పందన వస్తోంది. ఇది కేవలం కురుఖ్ ప్రజలకు మాత్రమే కాదు... తమ భాష, సంస్కృతి అంతరించిపోతున్నాయనే భయంతో ఉన్న ప్రతి వర్గాన్నీ తట్టిలేపే ప్రయత్నం" అంటున్నారు ఈ కజిన్స్. ఈ ఏడాది టాటా స్టీల్ ఫౌండేషన్ వారి యూట్యూబ్ ఛానెల్‌లోనూ వారు ఒక పాట విడుదల చేశారు.

### సేవ కాదు, బాధ్యత...

కొన్నేళ్ళుగా వారు సాగిస్తున్న ఈ కృషికి ఇప్పుడు ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వారి గ్రామంలోనే కాదు, ఆ చుట్టుపక్కల గ్రామాల్లోని పిల్లలు, యువత... ప్రస్తుతం ఏ కార్యక్రమం జరిగినా ఆధునికమైన పాటలతో పాటు కురుఖ్ పాటలను తప్పకుండా ప్రదర్శిస్తున్నారు. పాతతరానికి చెందినవారు "మా భాష, మా మాట మళ్ళీ ప్రతిధ్వనిస్తున్నాయి" అని మురిసిపోతున్నారు. "ఇది మేము సాధించిన గొప్ప విజయంగా భావిస్తున్నాం. దేశంలోని పలు ప్రాంతాల్లో... అనేక వేదికల



మీద మా పాటను వినిపిస్తున్నాం. ఇది కేవలం గానం కాదు, మా వారసత్వాన్ని భద్రపరుచుకోవడం. సంస్కృతికి భాష గొప్ప సాధనం. వాటిలో తమ మూలాలను ప్రజలు వెతుక్కుంటారు. అందుకే దీన్ని కళగానో, సేవగానో మేము చూడడం లేదు... బాధ్యతగా భావిస్తున్నాం. ప్రజలకు తమ బాధ్యతను గుర్తు చేస్తున్నాం" అంటున్నారు మాంతీ, నిక్కీ.

---

**కళాకారుల ఊహల్లో పుట్టి... వారి చేతుల్లో ప్రాణం పోసుకున్న చిత్రరాజాలు గ్యాలరీలకే పరిమితమా! కాదంటారు ప్రముఖ కళాకారిణి బృందా మిల్లర్. అందుకే ఆ అద్భుతాలను ప్రజల మధ్యకు తీసుకువచ్చారు. కాదేదీ కాన్వాస్‌కు అనర్హం అంటూ... వీధి గోడలు, ఆసుపత్రులు, పార్కులు, విమానాశ్రయాలకు ఆహ్లాదకర చిత్రాలతో వన్నెలద్దారు. వారసత్వ సంపదను పరిరక్షించే బాధ్యతను చేపట్టారు. ఔత్సాహికులను, కళాభిమానులను ఒకచోట చేర్చి... భావి కళాకారులుగా తీర్చిదిద్దుతున్న బృంద జర్నీ ఇది.**

# కుంచెతో చైతన్యం

అభిరుచి



"నా మనసు చిత్రకళ వైపు ఎప్పుడు ఎలా మళ్లిందో నాకు తెలియదు. చిన్నప్పుడే అది నన్ను ఆకర్షించింది. నాకు ప్రేరణనిచ్చింది. కళాకారిణిగా ప్రపంచ స్థాయి గుర్తింపును తెచ్చింది. ఇన్ని దశాబ్దాల ప్రయాణంలో ఎన్నో ఒడుదొడుకులు... సవాళ్లు... సమస్యలు. కానీ అన్నిటినీ తట్టుకొని నిలబడే ఆత్మస్థైర్యాన్ని, ఉన్నతమైన స్థానాన్ని ఈ కళ నాకు ఇచ్చింది. నా బాల్యం, విద్యాభ్యాసం, నా జీవన గమనమంతా ముంబయి మహానగరంతోనే ముడిపడి సాగుతోంది. పాఠశాలలో చదువుతున్న రోజుల్లోనే నాలోని కళాకారిణికి దృఢమైన పునాది పడింది. తరువాత 'క్వీన్స్ మేరీ స్కూల్'లో చేరాను. అక్కడ మనలోని సృజనకు పదును పెట్టి, కళల్లో ప్రోత్సహించేవారు. నాలో ఉత్సాహం రెట్టింపయింది. చిత్రలేఖనం కొనసాగించగలననే ఆత్మవిశ్వాసం కలిగింది. ఈ రంగంలోనే స్థిరపడాలన్న కోరికను బలపరిచింది.

### మరింత నైపుణ్యం కోసం...

మొదట్లో చిన్న చిన్న డ్రాయింగ్స్, పెయింటింగ్స్ వేసిన నేను క్రమంగా పట్టు సాధించాను. అంతటితోనే సరిపెట్టుకోవాలని అనుకోలేదు. నాలోని నైపుణ్యానికి మరింత పదును పెట్టాలన్న ఉద్దేశంతో ముంబయిలోని 'సర్ జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్'కు వెళ్లాను. టెక్స్‌టైల్ డిజైనింగ్‌లో స్పెషలైజేషన్ చేశాను. ఆ కోర్సు డిజైనింగ్ అంశాలపై అవగాహన కలిగించడమే కాకుండా, నాలోని ఆలోచనలను అద్భుతమైన కళాఖండాలుగా ఆవిష్కరించగలిగే సామర్థ్యాన్ని ఇచ్చింది. అనంతరం, అంటే 1989లో అమెరికాలోని న్యూయార్క్ వెళ్లాను. అక్కడి 'స్కూల్ ఆఫ్ పార్సన్స్'లో డ్రాయింగ్, పెయింటింగ్‌లో మెళకువలు నేర్చుకున్నాను. ఈ ప్రయాణంలో ప్రతి అడుగూ కళ పట్ల నాకున్న మక్కువను, ఆసక్తిని రెట్టింపు చేసింది. సృజనాత్మక వ్యక్తీకరణకు అంకితమైన నా జీవితానికి సరైన దిశను నిర్దేశించింది.

### ఉద్యోగంలో చేరినా...

నా చదువు అయిపోగానే 'కటావూ మిల్స్'లో టెక్స్‌టైల్ డిజైనర్‌గా ఉద్యోగం వచ్చింది. మంచి ఉద్యోగం. కోరుకున్న జీతం. కానీ కొన్నాళ్లకు నాలో ఏదో అసంతృప్తి మొదలైంది. నాలోని సృజనను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోలేకపోతున్నాననే భావన కలిగింది. కూర్చొని ఆలోచిస్తే అర్థమైంది ఏమిటంటే... పెయింటింగ్ నాకు కేవలం ఒక అభిరుచి మాత్రమే కాదని. దాంతోనే నా జీవితం ముడిపడి ఉందని, అటువైపు రమ్మని నన్ను పిలుస్తోందని. ఆ తరువాత ఒక్క క్షణం కూడా ఆగలేదు. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసి నాదైన ప్రపంచంలోకి అడుగుపెట్టాను.

### ఆరంభమే అదిరింది...

ఉద్యోగం వదిలేశాక పూర్తి స్థాయిలో పెయింటింగ్స్‌కు సమయాన్ని కేటాయించాను. ధైర్యం చేసి బరోడాలో నా నేను గీసిన చిత్రాలతో సోలో ఎగ్జిబిషన్ పెట్టాను. అదే నా మొదటి ఎగ్జిబిషన్. అడుగు ముందుకైతే వేశాను కానీ లోపల సందేహం... అవి 'నచ్చుతాయా' అని. అయితే నా అంచనాలకు మించి ప్రదర్శన విజయవంతమైంది. అద్భుతమైన స్పందన వచ్చింది. ఆ స్పందన చూశాక నేను తీసుకున్న నిర్ణయం సరైనదేననే నమ్మకం కలిగింది. కళాకారిణిగా నా అసలైన ప్రయాణం ఆ రోజే ప్రారంభమైంది.

### మరో మలుపు...

బరోడాలో ఎగ్జిబిషన్ తరువాత మళ్లీ వెనక్కి తిరిగి చూసుకోలేదు. అంచలంచెలుగా ఎదిగాను. దేశవిదేశాల్లో ప్రదర్శనలు, ప్రశంసలు, సత్కారాలు... నాకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు లభించింది. అయితే నా నలభయ్యవ ఏట నా వ్యక్తిగత జీవితం, అలాగే వృత్తిగత జీవితం అనుకోని మలుపు తిరిగాయి. 'కాలా ఘోడా ఆర్ట్ ఫెస్టివల్' సంస్థతో కలిసి పని చేయడం ప్రారంభించాను. సంస్థ నిర్వహించే ప్రతి ఉత్సవంలో చురుగ్గా పాల్గొన్నాను. ఈ క్రమంలోనే మదిలో సరికొత్త ఆలోచనలు ఉద్భవించాయి. చిత్రకళను మరో స్థాయికి తీసుకువెళ్లే అవకాశం లభించింది. అదే సమయంలో నాలోని సృజనకు అతిపెద్ద వేదిక లభించింది. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అనుకున్నాను. కళకు విస్తృత ప్రాచుర్యం కల్పించి, ప్రజల్లో చైతన్యం తేవాలని భావించాను. తదనుగుణంగా పలు కార్యక్రమాలు నిర్వహించాను. ముంబయిలోని రహదారులు, పలు ఆసుపత్రుల గోడలపై అర్థవంతమైన చిత్రాలు వేయించాను. శిథిలమైపోతున్న వారసత్వ కట్టడాలను పరిరక్షించేందుకు కళను ఒక సాధనంగా ఎంచుకున్నాను. 2006లో సంస్థ గౌరవ డైరెక్టర్‌గా ఉన్న నేను 2020 నాటికల్లా చైర్‌పర్సన్ స్థాయికి ఎదిగాను.

### పురస్కారాలు ఎన్నో...

'కాలా ఘోడా ఆర్ట్ ఫెస్టివల్'తో అనుబంధం నన్నే కాదు... మరెందరో కళాకారులను తీర్చిదిద్దడానికి సహకరించింది. తరచూ వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేసి ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్నాను. వారిలోని సృజనను వెలికి తీసి, నైపుణ్యం పెంచేందుకు ప్రయత్నిస్తున్నాను. నా ఈ ప్రయాణం పూర్తిగా కళకే అంకితమైపోయింది. మదిలో నిండిన భావాలను కాన్వాస్‌పై పెడుతున్నప్పుడు ఉండే ఆనందం, ఆత్మసంతృప్తి నాకు మరెందులోనూ దొరకవు."

---

# స్వెట్టర్ శుభ్రం ఇలా...

చలికాలంలో పెద్దలు, పిల్లలు ఎక్కువగా ఉన్నితో తయారు చేసిన స్వెట్టర్లు ధరిస్తూ ఉంటారు. వీటి మీద మురికి చేరినప్పుడు వాటిని జాగ్రత్తగా శుభ్రం చేయాలనీ లేని పక్షంలో వాటి మన్నిక దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు. స్వెట్టర్ మీద చేరిన మురికిని సులువుగా తొలగించే చిట్కాలు...

- ఒక గిన్నెలో అర కప్పు వెనిగర్‌ను తీసుకుని అందులో అర కప్పు నీళ్లు పోసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో పలుచని చేతి రుమాలును ముంచి దానితో స్వెట్టర్‌ను తుడవాలి. మురికి ఎక్కువగా ఉన్న భాగాల మీద ఎక్కువగా దృష్టి పెట్టాలి. తరువాత గాలి తగిలేలా ఆరబెట్టాలి.
- ఒక బకెట్ నీటిలో లిక్విడ్ డిటర్జెంట్ వేసి బాగా కలపాలి. ఈ నీళ్లలో స్వెట్టర్‌ను ముంచి అయిదు నిమిషాలు నాననివ్వాలి. ఆపైన చేతులతో సున్నితంగా రుద్దాలి. తరువాత స్వెట్టర్‌ను మంచినీళ్లలో ఒకసారి ముంచి ఆరేయాలి.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి అందులో అరకప్పు నీళ్లు పోసి బాగా కలపాలి. స్వెట్టర్ మీద మురికిగా ఉన్న చోట ఈ నీటిని కొద్ది కొద్దిగా చిలకరించి వేళ్లతో నుసిమి మెల్లగా పిండేయాలి. ఆపైన గాలికి ఆరబెట్టాలి.



- స్వెట్టర్‌ను హ్యాంగర్‌కు వేలాడదీసి దానిమీద కొద్దిగా కార్బొనేటెడ్ వాటర్‌ను స్ప్రే చేస్తే చాలు. చెమట వాసన, దుమ్ము తదితరాలు తొలగిపోతాయి.
- ఒక బకెట్లో సగానికిపైగా గోరువెచ్చని నీళ్లు పోసి అందులో రెండు చెంచాల ఉప్పు, కొద్దిగా షాంపూ వేసి బాగా కలపాలి. ఈ నీళ్లలో బాగా మాసిన స్వెట్టర్‌ను పది నిమిషాలపాటు నానబెట్టాలి. తరువాత చేతి వేళ్లతో సున్నితంగా ఉతికి మంచి నీళ్లలో ముంచి ఆరేయాలి.
- స్వెట్టర్ మీద నూనె లేదా గ్రీజు మరకలు పడితే వాటి మీద కొద్దిగా టాల్కం పౌడర్ చల్లి చేతి రుమాలుతో తుడిస్తే సరిపోతుంది.

---

**ఒకప్పుడు ఇంటికే పరిమితమైన గ్రామీణ మహిళలు ఇప్పుడు ఆకాశంలో డ్రోన్లు నడుపుతూ వ్యవసాయ రంగంలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్, దుర్గ్ జిల్లాల్లో కనిపిస్తున్న ఈ మార్పు మహిళా సాధికారతకు అద్దం పడుతోంది.**

# 'డ్రోన్ దీదీ'లు



రాజ్‌నంద్‌గావ్ జిల్లా అచ్చోలి గ్రామానికి చెందిన శాంతి విశ్వకర్మ కథ ఎంతో స్ఫూర్తిదాయకం. 15 ఏళ్లుగా స్వయం సహాయక బృందంలో అధ్యక్షురాలిగా ఉన్న ఆమె గతంలో పచ్చళ్లు, అప్పడాలు అమ్ముతూ జీవనం సాగించేవారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నమో డ్రోన్ దీదీ' పథకం గురించి తెలుసుకుని గ్వాలియర్‌లో 15 రోజులపాటు డ్రోన్ పైలట్‌గా శిక్షణ పొందారు. ఇప్పుడు ఆమె ఆ ప్రాంతంలో 'డ్రోన్ దీదీ'గా సుపరిచితమయ్యారు. "గత రెండేళ్లుగా ఈ పని చేస్తున్నాను. రోజూ పది నుంచి 20 ఎకరాలకు మందు పిచికారీ ఆర్డర్లు వస్తుంటాయి. నా యూట్యూబ్ చానల్ కూడా నాకు బాగా సాయపడింది. నా కుటుంబ పూర్తి మద్దతు ఇస్తోంది" అని శాంతి ఆనందంగా చెప్పుకొచ్చారు. వరి పొలానికి ఎకరానికి రూ. 300 చొప్పున తీసుకుంటూ చేస్తూ ఆమె ఇప్పుడు 'లఖ్‌పతి దీదీ'గా మారారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో ఆమెకు రూ. 10 లక్షల విలువైన డ్రోన్, రూ. 5 లక్షల విలువైన వాహనం కూడా అందింది. ఈ వాహనంలోనే జిల్లా అంతా తిరుగుతూ రైతులకు సేవలు అందిస్తున్నారు.



### టీచర్ కావాలనుకుని..

దుర్గ్ జిల్లాకు చెందిన జాగృతి సాహు ప్రస్థానం మరో అద్భుతం. రెండు పీజీలు, బీఎడ్ పూర్తి చేసి టీచర్ కావాలనుకుని కలలు కన్నారు. కానీ విధి ఆమెను వ్యవసాయ రంగం వైపు నడిపింది. మొదట పుట్టగొడుగుల పెంపకంలో అద్భుత విజయం సాధించి 'మష్రూమ్ లేడీ'గా గుర్తింపు పొందారు. ఆ తర్వాత సహజ సిద్ధమైన రంగుల తయారీ చేపట్టి, గతేడాది ఏకంగా రూ. 8.25 లక్షల విలువైన ఉత్పత్తులు విక్రయించారు. ఇప్పుడు ఆమె 'నమో డ్రోన్ దీదీ' పథకం కింద శిక్షణ పొంది సర్టిఫైడ్ డ్రోన్ పైలట్‌గా మారారు. టీచర్ కావాలన్న కోరిక నెరవేరకపోయినా డ్రోన్ టెక్నాలజీ, పుట్టగొడుగుల పెంపకం వంటి విషయాల్లో ఎందరో మహిళలకు శిక్షణ ఇస్తూ గురువుగా మారారు.

### గ్రామాల్లో కొత్త విప్లవం

శాంతి, జాగృతి వంటి మహిళలు వ్యవసాయంలో ఆధునిక సాంకేతికను ప్రవేశపెట్టడమే కాకుండా, పాతకాలపు అడ్డంకులను ఛేదిస్తున్నారు. డ్రోన్ల వాడకం వల్ల రైతులకు సమయం, శ్రమ, ఖర్చు ఆదా అవుతున్నాయి. మహిళలను వ్యవసాయ రంగంలో భాగస్వాములను చేయడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తోంది పథకం.

---

కౌన్సెలింగ్

# ఆ అడిక్షన్‌ను వదిలించేదెలా?

Q A

డాక్టర్! మా వారికి పోర్న్ చూసే అలవాటుంది. క్రమేపీ ఈ అలవాటు పెరుగుతూ పోతోంది. ఖాళీ సమయాల్లో గంటల తరబడి పోర్న్ చూస్తూ, నాతో సమయం గడపడం తగ్గించేస్తున్నారు. ఆయనను మార్చుకునేదెలా?

**- ఓ సోదరి,**
హైదరాబాద్.



మీ వారికి ఈ అలవాటు టీనేజీలో మొదలై ఉంటుంది. అప్పుడప్పుడూ పోర్న్ చూడడం వల్ల పెద్దగా ఇబ్బందేమీ లేదు. కానీ అదే పనిగా పెట్టుకుని భాగస్వామిని నిర్లక్ష్యం చేస్తే భార్యాభర్తల అనుబంధం బీటలుబారుతుంది. మీ వారు పోర్న్‌కు నిజంగానే బానిస అయ్యారో లేదో తెలుసుకోవడం కోసం ఈ కింది లక్షణాలను గమనించండి

- లైంగికంగా కలవడానికి మించి పోర్న్ మీద ఆసక్తి కనబరచడం
- పోర్న్ వల్ల రోజువారీ పనులను వాయిదా వేస్తూ ఉండడం, బాధ్యతలను అశ్రద్ధ చేయడం
- పోర్న్ చూడనిదే లైంగికోద్రేకం పొందలేకపోవడం
- చాటుమాటుగా పోర్న్ చూడడం
- ఆ అలవాటు గురించి చర్చించడానికి ఇష్టపడకపోవడం

పై లక్షణాల ఆధారంగా మీవారు పోర్న్‌కు బానిస అయ్యారో లేదో కనిపెట్టవచ్చు. ఒకవేళ మీ అనుమానమే నిజమని తేలితే ఆ అలవాటు వల్ల మీరెంత బాధపడుతున్నదీ స్పష్టంగా చెప్పండి. అది వ్యసనంగా మారిందేమో ఆయన్నే అడగండి. అవసరమైతే సెక్సాలజిస్ట్ సహాయం తీసుకోండి. చాలా సందర్భాల్లో భార్యలు భర్తల్ని 'నేను కావాలో, పోర్న్ కావాలో తేల్చుకో!' అని కండిషన్ పెడుతూ ఉంటారు. ఇలా చేయడం వల్ల కొందరు భర్తలు నిజాయితీగా పోర్న్ మానేస్తారు. మరికొందరు చాటుమాటుగా అదే అలవాటును కొనసాగిస్తూ ఉంటారు. కాబట్టి నేర్పుతో మసలుకోవాలి.

**డాక్టర్ షర్మిలా మజుందార్**
సెక్సాలజిస్ట్ అండ్ సైకో అనలిస్ట్,
email: mili77@gmail.com

# అమ్మో.. స్క్రబ్ టైఫస్!

- తీవ్రమవుతున్న బ్యాక్టీరియా వ్యాప్తి
- రాష్ట్రంలో 736 కేసులు నమోదు
- అనధికారికంగా మరిన్ని పాజిటివ్‌లు
- విజయనగరం, పల్నాడు జిల్లాల్లో వ్యాధి లక్షణాలతో ముగ్గురు మృతి
- జ్వరం, నల్లమచ్చలు ఉంటే జాగ్రత్త

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం కొత్తూరులో రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది



రాష్ట్రంలో 'స్క్రబ్ టైఫస్' జ్వరాలు కలకలం సృష్టిస్తున్నాయి. దాదాపు అన్ని జిల్లాల్లోనూ కేసులు నమోదవుతున్నాయి. ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 736 కేసులు నమోదయ్యాయి. కానీ అనధికారికంగా వీటి సంఖ్య వేలల్లో ఉండొచ్చని తెలుస్తోంది. బ్యాక్టీరియా సోకిన చిగ్గర్ మైట్ అనే నల్లిని పోలిన చిన్న కీటకం కుట్టడం ద్వారా వ్యాపించే ఈ ఇన్ఫెక్షన్ జ్వరాలకు ప్రధానకారణమవుతోంది. వర్షాలు కురిసే సమయంలో దీని తీవ్రత అధికంగా ఉంటోంది. రాష్ట్రంలో గత రెండు, మూడేళ్ల నుంచి ఈ వ్యాధికి సంబంధించిన కేసులు నమోదవుతున్నా తొలిసారిగా ఈ ఏడాది మూడు మరణాలు నమోదయ్యాయి. విజయనగరం జిల్లాకు చెందిన ఓ మహిళతో పాటు పల్నాడు జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు వ్యాధి లక్షణాలతో మృతిచెందారు. కంగారు పడాల్సిన అవసరం లేదని ప్రభుత్వం, ఆరోగ్య శాఖ చెబుతున్నా పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలో 2023లో 579 కేసులు నమోదు కాగా, 2024లో 803 కేసులు వెలుగులోకి వచ్చాయి. ఈ ఏడాది నవంబరు 30 వరకూ 736 కేసులను ఆరోగ్యశాఖ గుర్తించింది. ఇప్పటి వరకూ కాకినాడ, చిత్తూరు, విశాఖ, కడప, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, విజయనగరం, గుంటూరు, తిరుపతి, శ్రీకాకుళం, అనకాపల్లి, అనంతపురం, అన్నమయ్య, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల్లో కేసులు నమోదయ్యాయి.

## నల్ల మచ్చలతో గుర్తింపు

కీలకం కుట్టిన చోట నల్లటి మచ్చ లేదా దద్దుర్లు ఉంటే జ్వరం, తలనొప్పితో పాటు కండరాల నొప్పులు ఉంటే స్క్రబ్ టైఫస్‌గా అనుమానించాలి. ఈ పురుగు కుట్టినప్పుడు దాని లాలాజలం ద్వారా ఓరియాంటియా సుట్సుగముషి అనే బ్యాక్టీరియా మనిషి రక్తంలోకి ప్రవేశించి ఇన్ఫెక్షన్‌కు కారణమవుతుంది. దట్టమైన చెట్లు, వ్యవసాయ భూముల పక్కనే నివసించే వారిపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అధికంగా రాత్రి సమయాల్లో ఈ పురుగులను మనుషులను కుడుతుంటాయి. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సకాలంలో గుర్తించి చికిత్స అందించకపోతే ఊపిరితిత్తులు, వెన్నెముక, కిడ్నీలు, మెదడు, కాలేయం, ఇతర అవయవాలపై ప్రభావం చూపిస్తుంది. క్రమంగా రోగి కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. పీహెచ్‌సీలు, ఇతర ఆస్పత్రుల వైద్యుల సిఫారసులతో వచ్చిన రోగుల నుంచి సేకరించిన రక్త నమూనాలను బోధనాస్పత్రులు, జిల్లా పబ్లిక్ హెల్త్ లేబొరేటరీల్లో పరీక్షిస్తున్నారు.

## ఈ ఆరు నెలలు అప్రమత్తం

స్క్రబ్ టైఫస్ కీటకాల తాకిడి ఆగస్టు నుంచి ఫిబ్రవరి మధ్య ఎక్కువగా ఉంటుంది. ఈ కాలంలో ఇన్ఫెక్షన్లు సోకే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇది అంటువ్యాధి కాదని చెబుతున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే స్క్రబ్ టైఫస్ జ్వరాల వల్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంటున్నారు. ఇది కూడా సాధారణ జ్వరం లాంటిదేనని, జ్వరం బారినపడిన మూడు రోజుల వరకు తగ్గకపోతే రక్తపరీక్షల ద్వారా ఈ వ్యాధి బయటపడుతుంది. శరీరంపై చిన్న నల్లమచ్చ కనిపించిన తర్వాత జ్వరం వస్తే స్క్రబ్ టైఫస్ అనుమానించాలి. కొన్ని కేసుల్లో నల్ల మచ్చ కనిపించకపోయినా, జ్వరం లక్షణాలు కనిపించిన మూడు రోజుల తర్వాత కచ్చితంగా పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. 1890లో జపాన్‌లో తొలిసారి ఈ జ్వరాలను గుర్తించారు. అప్పటి నుంచీ కేసులు నమోదవుతూ వస్తున్నాయి. కానీ మరణాలు మాత్రం పెద్దగా సంభవించలేదు. తాజాగా ముగ్గురు మృతిచెందడం ఆరోగ్య శాఖకు ఆందోళన కలిగిస్తోంది. ప్రజలు ఈ వైరస్ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పాత మంచాలు, పరుపులు, దిండ్లు వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలి. నివాసం ఉండే చోట పందులు, ఎలుకల సంచారం తక్కువగా ఉండేలా చూసుకోవాలి. తడి నేలలు, పొలాలు, పశువుల పాకల్లో పనులు చేసేవారు అప్రమత్తంగా ఉండాలి. పొలం పనులకు వెళ్లేవారు రబ్బరుతో తయారుచేసిన బూట్లు ధరించాలి. పిల్లలకు కాళ్లు, చేతులు కప్పి ఉంచేలా దుస్తులు వేయాలి.

### పల్నాడులో స్క్రబ్ టైఫస్ కలకలం

నరసరావుపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో రెండు స్క్రబ్ టైఫస్ మరణాలు నమోదయ్యాయి. మృతుల నుంచి సేకరించిన రక్త నమూనాలను పరీక్షించగా స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ రవి బుధవారం తెలిపారు. ముప్పాళ్ల మండలం రుద్రవరం గ్రామానికి చెందిన జ్యోతి(20), రాజుపాలెం ఆర్ఆర్ కాలనీకి చెందిన నాగమ్మ(62)లను పొలం పనులు చేస్తుండగా ఏదో పురుగు కుట్టిందని, ఆ తర్వాత జ్వరం, ఒంటి నొప్పులతో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ 20 రోజుల క్రితం మృతి చెందారని వైద్యశాఖ అధికారులు వివరించారు. ఇదే వ్యాధి లక్షణాలతో రాజుపాలెం మండలం కొత్తూరుకు చెందిన సాలమ్మ అనే మహిళ చికిత్స పొందారు. ఈ నేపథ్యంలో రాజుపాలెం మండలం కొత్తూరు, రాజుపాలెం, రుద్రవరంలో ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది బుధవారం సర్వే నిర్వహించారు. జ్వరంతో ఉన్నవారి నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షల కోసం గుంటూరు ప్రభుత్వాస్పత్రి ల్యాబ్‌కు పంపారు. కాగా, స్క్రబ్ టైఫస్ ప్రాణాంతకం కాదని డాక్టర్ రవి తెలిపారు. డాక్సీసైక్లిన్ టాబ్లెట్ వేసుకుంటే తగ్గుతుందన్నారు. అనుమానిత లక్షణాలున్న వారి రక్త నమూనాలకు గుంటూరు ప్రభుత్వాస్పత్రి ల్యాబ్‌లో నిర్ధారణ పరీక్షలు చేస్తామన్నారు. పాజిటివ్‌గా గుర్తిస్తే చికిత్స అందిస్తారని తెలిపారు. పొలంలో పనిచేసే సమయంలో పురుగులు కుట్టినట్టు అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.





తిరుపతి జిల్లాలో కొట్టుకుపోయిన ముట్టెంబాక-చిట్టమూరు రోడ్డు, నెల్లూరు జిల్లా మనుబోలు వద్ద నీట మునిగిన వరి నారును చూపుతున్న రైతు

# కుమ్మేసిన వాన

## నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు

- వాకాడులో 28, సర్వేపల్లిలో 27.2 సెంటీమీటర్లు
- పలు చెరువులకు గండ్లు.. కొట్టుకుపోయిన రోడ్లు..
- ఉధృతంగా వాగులు, వంకలు.. పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- నెల్లూరు నగరం అతలాకుతలం.. నీట మునిగిన కాలనీలు
- తొట్టంబేడులో గోడకూలి వృద్ధురాలి మృతి
- పుదుచ్చేరిలో తీరం దాటిన వాయుగుండం
- నేడు చిత్తూరు, అన్నమయ్య, ప్రకాశం జిల్లాల్లోనూ భారీ వానలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



నెల్లూరులోని తల్పగిరి కాలనీలో నిలిచిన వర్షం నీరు

నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో వర్షం కుమ్మేసింది. దిత్వా తుఫాను బలహీనపడి కొనసాగుతున్న వాయుగుండం బుధవారం పుదుచ్చేరి వద్ద తీరం దాటింది. ఈ ప్రభావంతో ఉత్తర తమిళనాడుతోపాటు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం ఉదయం నుంచి 24 గంటల వ్యవధిలో తిరుపతి జిల్లా వాకాడులో 28, చిట్టమూరులో 27.6, అల్లంపాడులో 23.8, విద్యానగర్, గుణపూడులో 19.6, మల్లాంలో 17.6, నెల్లూరు జిల్లా సర్వేపల్లిలో 27.2, ఈడగలిలో 24, వెంకటాచలంలో 21.4, మనుబోలులో 17.9, అక్కంపేటలో 16.7, నెల్లూరు 14, తోటపల్లిగూడూరులో 11.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంగళవారం రాత్రి కొన్ని గంటలపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నెల్లూరు నగరం జలమయమైంది. జనజీవనం అస్తవ్యస్తమైంది. ఉడుముల వాగు ఉధృతంగా ప్రవహించడంతో కొత్తూరు, వైఎస్ఆర్ నగర్, శ్రామికనగర్, తల్పగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ, రెవెన్యూ కాలనీ, చంద్రబాబు నగర్ తదితర ప్రాంతాలు నీట మునిగాయి. చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి నీటమునగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బస్సులు, లారీలు మినహా మిగిలిన వాహనాలను దారి మళ్లించారు. నెల్లూరులోని మాగుంట లేఅవుట్, రామలింగాపురం అండర్ బ్రిడ్జిలు కూడా మునిగిపోయాయి. మాగుంట లేఅవుట్, రంగనాయకులపేట, మనుమసిద్దినగర్, పొగతోట ప్రాంతాల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. నెల్లూరు రూరల్ మండలం ములుమూడి వద్ద కలుజు ఉధృతంగా ప్రవహించడంతో నెల్లూరు-తాటిపర్తి మార్గాన రాకపోకలు నిలిపేశారు. మనుబోలు వద్ద ప్రధాన రహదారిపై కండలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. సౌత్‌మోపూరు సమీపంలో మొగళ్లపాలెం చెరువు తెగిపోయింది. కోవూరు మండలంలో సదరన్ ఛానల్‌కు గండి పడింది. చాలా రోడ్లపై వర్షపు నీరు నిలబడి గుంతలు పడ్డాయి. చాలా చోట్ల నాట్లు, నారుమళ్లు దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా ప్రకారం నెల్లూరు జిల్లాలో 507 హెక్టార్లలో వరినాట్లు నీట మునిగి పనికిరాకుండా పోయాయి. మరో 116 హెక్టార్లలో నారుమళ్లు దెబ్బతిన్నాయి. ఇంకా వేల ఎకరాల్లో నాట్లు, నారుమళ్లు నీటిలో మునిగి ఉన్నాయి. నీరంతా బయటకు వెళితే గానీ ఆ సాగు పనికొస్తుందా.. లేదా..? అన్నది తేలుతుంది. తిరుపతి జిల్లాలో స్వర్ణముఖి, కైవల్య, కాళంగి నదులతో పాటు పలు వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు మార్గాల్లో రాకపోకలు స్తంభించాయి. తొట్టంబేడు మండలం కాసరం గ్రామంలో ఇంటి గోడ కూలి మంచంపై నిద్రిస్తున్న రేణుకమ్మ (60) అక్కడికక్కడే మృతి చెందారు. చిట్టమూరు మండలం మొలకలపూడి రోడ్డు, కేవీబీపురం మండలంలో పూడి వంతెన, వాకాడు మండలం ముట్టెంబాక-చిట్టమూరు రోడ్డు కొట్టుకుపోయాయి. తడ మండలంలో కారిజాత చెరువు, పెళ్ళకూరు మండలం నెలబల్లి చెరువులకు గండ్లు పడ్డాయి. తడ, చిట్టమూరు, చిల్లకూరు మండలాల్లో వెయ్యి ఎకరాలకు పైగా పొలాలు నీట మునిగాయి.

### ముగిసిన 'దిత్వా' కథ

శ్రీలంక, తమిళనాడు, ఏపీలకు వణుకు పుట్టించిన 'దిత్వా' తుఫాన్ కథ ముగిసింది. తుఫాను బలహీనపడిన తర్వాత కొనసాగుతున్న వాయుగుండం బుధవారం ఉదయం పుదుచ్చేరికి దక్షిణ ప్రాంతంలో తీరం దాటి తీవ్ర అల్పపీడనంగా మారింది. రాత్రికి మరింత బలహీనపడి అల్పపీడనంగా మారింది. ఇది తమిళనాడు భూభాగం మీదుగా పయనించి గురువారం నాటికి పూర్తిగా బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. గురువారం ఉదయం వరకు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ అతిభారీ వర్షాలు, చిత్తూరు, అన్నమయ్య, ప్రకాశం జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. గత నెల 26నుంచి ఏడు రోజులపాటు శ్రీలంక, దక్షిణ భారతంపై దిత్వా తుఫాను తీవ్ర ప్రభావం చూపింది. గురువారం నుంచి వర్షాలు తగ్గనున్నాయి. గురువారం రాయలసీమ ప్రాంతంలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.



# చిత్రజ్యోతి

SINCE 1965



## సనాతన ధర్మం గొప్పతనాన్ని ఆవిష్కరిస్తుంది

నందమూరి బాలకృష్ణ

తాను మద్రాస్‌లో జన్మించానని, అందువల్ల అది తన జన్మభూమి అనీ, తెలంగాణ కర్మభూమి, ఆంధ్రప్రదేశ్ ఆత్మభూమి అని నందమూరి బాలకృష్ణ వెల్లడించారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఆయన నటించిన 'అఖండ 2.. తాండవం' చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం బుధవారం చెన్నైలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించింది. అందులో బాలకృష్ణ మాట్లాడుతూ.. 'నేను మద్రాస్‌లో జన్మించాను. ఇది నాకు సొంతిల్లులా అనిపిస్తుంది. 'అఖండ:2' సనాతన ధర్మం గొప్పతనాన్ని ఆవిష్కరిస్తుంది. భవిష్యత్ తరాలు ఈ సినిమా ద్వారా సనాతన ధర్మం గురించి తెలుసుకుంటాయి' అన్నారు. చిత్ర దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ, 'భారతదేశ ఆత్మ. దేశం, దైవం, ధర్మం వంటి అంశాలతో ఈ సినిమా రూపుదిద్దుకుంది. ప్రతి ఒక్కరూ ఈ సినిమా చూసి ఆదరిస్తారని నమ్ముతున్నాను' అని పేర్కొన్నారు. సీనియర్ నటి వీజీ చంద్రశేఖర్ మాట్లాడుతూ, 'ఈ మూవీలో బాలకృష్ణ క్రమశిక్షణ, సహనంతో నటించారు. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు దైవత్వం, భావోద్వేగం వంటి అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని పేర్కొన్నారు. సీనియర్ నటుడు వైజీ మహేంద్రన్ మాట్లాడుతూ, 'ఇందులో టిబెటన్ సన్యాసి పాత్రలో నటించాను. క్లైమాక్స్‌లో మైనస్ 7 డిగ్రీల ఉష్ణోగ్రతలో బాలకృష్ణ చొక్కా లేకుండా నటించారు. ఆ పరమశివుడే బాలకృష్ణలో ఆవహించినట్లు అనిపించింది' అని పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

## అత్తారింట సమంతకు ఘనస్వాగతం



రాజ్ తల్లితండ్రులు కృష్ణ నిడిమోరు, రమా రత్నాకర... సోదరి శీతల్, మేనల్లుళ్లు విష్ణు, కేశవ్, మాధవ్‌లతో సమంత

ఇటీవలె దర్శకుడు రాజ్ నిడిమోరుతో హీరోయిన్ సమంత వివాహం జరిగిన సంగతి తెలిసిందే. తాజాగా ఆమెకు అత్తారింట్లో ఘనస్వాగతం లభించింది. ఈ మేరకు రాజ్ నిడిమోరు సోదరి శీతల్ ఈ జంటకు అభినందనలు చెబుతూ భావోద్వేగానికి లోనయ్యారు. నిడిమోరు కుటుంబంలోకి సామ్‌ను ఆహ్వానిస్తూ కుటుంబమంతా కలసి తీసుకున్న ఫొటోను షేర్ చేశారు. 'కృతజ్ఞతా భావంతో హృదయం ఉప్పొంగిపోతోంది. ఈ ఆనందాన్ని వర్ణించటానికి మాటలు రావడం లేదు. రాజ్-సమంత జీవితంలో మొదలైన ఈ కొత్త అధ్యాయాన్ని సంతోషంతో స్వాగతిస్తున్నాము. ఈ రోజు మా కుటుంబం పరిపూర్ణమైంది. ఈ నూతన జంట ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ముందుకు సాగుతుండడం చూసి మాకెంతో గర్వంగా ఉంది. నిజాయితీతో రెండు హృదయాలు ఒకే మార్గాన్ని ఎంచుకున్నప్పుడు వారి జీవితం ప్రశాంతతతో నిండిపోతుంది. మీకెప్పుడూ అండగా ఉంటాము. అందరికీ ఇలాంటి అద్భుతమైన ప్రేమ దక్కాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను' అని పేర్కొన్నారు. శీతల్ పోస్ట్‌కు స్పందించిన సమంత 'లవ్ యూ' అని బదులిచ్చారు.

## శంకర వరప్రసాద్‌తో షూటింగ్ పూర్తి



"మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంలో నా పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను ఈ రోజుతో పూర్తి చేశాను. ఇదొక అద్భుతమైన ప్రయాణం' అని హీరో వెంకటేశ్ పేర్కొన్నారు. చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో వెంకటేశ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో చిరంజీవి, వెంకటేశ్‌పై ఓ మాస్ సాంగ్‌ను తెరకెక్కించారు. ఈ చిత్రంలో తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణ పూర్తి చేసినట్లు వెంకటేశ్ బుధవారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'నాకు అత్యంత ఇష్టమైన మెగాస్టార్ చిరంజీవి గారితో కలిసి పనిచేయడం ఎంతో ఆనందాన్నిచ్చింది. ఈ చిత్రం నాకు ఎన్నో మధుర జ్ఞాపకాలను మిగిల్చింది. చిరంజీవిగారితో కలిసి నటించాలన్నది నా చిరకాల కోరిక. దర్శకుడు అనిల్ రావిపూడి గారి వల్ల ఈ ప్రత్యేక చిత్రంతో ఇన్నాళ్లకు ఆ కోరిక తీరింది. 2026 సంక్రాంతికి థియేటర్లలో మీ అందరితో కలసి సంబరాలు చేసుకునేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని వెంకటేశ్ పేర్కొన్నారు. నయనతార కథానాయికగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు.

## ఆరు కాదు ఒక్కటే



ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ (ఎఫ్‌డీసీ), నిర్మాత దిల్ రాజు బాలీవుడ్‌కు వెళ్తున్నారు, అక్కడ ఒకేసారి ఆరు భారీ ప్రాజెక్టులు మొదలుపెడుతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై ఆయన బుధవారం స్పందించారు. పాత ఊహాగానాలకూ ఇప్పటి విషయాలకు ముడిపెట్టి కొందరు తప్పుగా ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 'కొన్ని రోజులుగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ నుంచి రాబోయే ప్రాజెక్ట్ గురించి బయట జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. నేను ప్రస్తుతం నిర్మిస్తున్న సినిమాలకు బాలీవుడ్‌తో సంబంధం ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం అక్షయ్‌కుమార్ హీరోగా అనీస్ బజ్మీ దర్శకత్వంలో ఒక చిత్రాన్ని మాత్రమే బాలీవుడ్‌లో నిర్మిస్తున్నాను. ఆ ప్రాజెక్ట్ ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలోనే అధికారిక ప్రకటన విడుదల చేస్తాం. అంతవరకూ ఇలాంటి అసత్య ప్రచారాలు చేయకండి' అని విజ్ఞప్తి చేశారు.

## అంగన్‌వాడీల్లో మౌలిక సదుపాయాల కోసం పిల్

» కౌంటర్ వేయాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్డి సదుపాయాలు కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ప్రతివాదులుగా ఉన్న కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల ముఖ్యకార్యదర్శులు, స్త్రీ శిశు సంక్షేమశాఖ కమిషనర్, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఎనిమిది వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హెల్ప్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కీతినీడి అఖిల్ శ్రీ గురుతేజ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... జాతీయ ఆహార భద్రత చట్టంలోని సెక్షన్ 5(2) ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాలలో తాగునీరు, మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

## ఐపీఎస్ సంజయ్‌కు రిమాండ్ పొడిగింపు

» అగ్నిమాపక నిధుల దుర్వినియోగం కేసులో కొండలరావుకు కూడా..



విజయవాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖలో నిధుల దుర్వినియోగం కేసులో ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్, ఏ4 బిక్కిన కొండలరావులకు ఈనెల 17వ తేదీ వరకు రిమాండ్ పొడిగించారు. విజయవాడలోని ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు ఈ ఆదేశాలిచ్చారు. కాగా, గతనెల 18వ తేదీన విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో పట్టుబడిన మావోయిస్టులు పొడియా బీమా అలియాస్ రంగు, మడకం లక్మ అలియాస్ మదన్, మడవి చిన్మయ్ అలియాస్ మనీలా, మంగి డొక్కుపాడిలకు ఈనెల 16వ తేదీ వరకు రిమాండ్ పొడిగించారు.

## పాస్‌వర్డ్‌లు చెప్పండి!

» లిక్కర్ కేసులో జోగి బ్రదర్స్ కుమారులను విచారించిన సిట్

విజయవాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాము కుమారులను సిట్ అధికారులు విచారించారు. జోగి బ్రదర్స్‌ను అరెస్టు చేసినప్పుడు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు సీజ్ చేశారు. వాటి పాస్‌వర్డ్‌లను వారి కుమారులతో తెరిపించారు. వాటిలో ఉన్న మొత్తం డేటాను ఫోరెన్సిక్ నిపుణులు సేకరించారు.

## సహజ ప్రసవాలు పెంచుతాం: వీరపాండియన్

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సహజ ప్రసవాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. ఇందులో భాగంగానే ప్రభుత్వాస్పత్రుల్లో గైనకాలజిస్టులకు తొలిసారిగా అసిస్టెడ్ వెజైనల్ డెలివరీ విధానంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈవిధానంలో వ్యాక్యూమ్ ఎక్స్‌ట్రాక్షన్ ఫోర్సెప్స్ సాయంతో సహజ ప్రసవాలు చేయడంలో మెళకువలు నేర్పిస్తారన్నారు.

## ఆ అధికారులకు 'మత్స్య' సంఘాల బాధ్యత

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టంలోని నిబంధనల మేరకు మత్స్య సహకార సంఘాల నిర్వహణకు సంబంధించి, మత్స్యశాఖ అధికారు(కమిషనర్, జేడీ, డీడీ, ఏడీ)లకు ఇవ్వదగిన అధికారాలను ఇస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సహకార చట్టంలోని వివిధ సెక్షన్ల కింద ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

## నజీర్ ఆచూకీ చెబితే 50వేల డాలర్లు

» అమెరికాలో ఆంధ్ర మహిళ హత్యకేసులో ఎఫ్‌బీఐ ప్రకటన

న్యూయార్క్, డిసెంబరు 3: ఎనిమిదేళ్ల క్రితం అమెరికాలోని న్యూజెర్సీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శశికళ నర్రా (38), ఆమె కుమారుడు అనీష్ నర్రా (6) హత్య కేసులో ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో నిందితుడైన భారత్‌కు చెందిన నజీర్ ఆచూకీ తెలిపిన వారికి 50 వేల డాలర్ల రివార్డు అందిస్తామని ప్రకటించింది. ఆయనను తమకు అప్పగించాలని భారత ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## బోయవాల్మీకులను ఎస్టీల్లో చేర్చండి: ఎంపీ శబరి

న్యూఢిల్లీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని బోయవాల్మీకులను షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి విజ్ఞప్తి చేశారు. ఈ వర్గానికి న్యాయం చేసేందుకు, సామాజిక న్యాయం కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణమే బిల్లును ప్రవేశపెట్టాలని కోరారు.

## మహిళలకు అండగా కూటమి: ఆచంట సునీత

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా కూటమి ప్రభుత్వం 18 నెలల్లోనే సూపర్ సిక్స్ హామీలన్నీ నెరవేర్చిందని డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత అన్నారు. డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ రుణాలను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచిన ఏకైక ప్రభుత్వం కూటమి సర్కారని చెప్పారు.

## పీపీపీపై జగన్‌ది దురుద్దేశం: వర్ల రామయ్య

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పేదలకు మేలు చేకూర్చే పీపీపీ విధానాన్ని జగన్ దురుద్దేశంతో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నో దేశాలు, రాష్ట్రాలు.. పీపీపీ విధానాన్ని అనుసరిస్తున్నారని, దీని ద్వారా రాష్ట్రానికి 220 మెడికల్ సీట్లు పెరుగుతాయని అన్నారు. కేంద్రం కోటా 15 శాతం సీట్లు బయటకు వెళ్లవని, ఇది మన రాష్ట్ర విద్యార్థులకే ఉపయోగమని చెప్పారు. జగన్ కోటి సంతకాల సేకరణ ద్వారా పీపీపీ విధానాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం పేదలకు నష్టం కలిగించడమేనని అన్నారు.

## జగన్ హయాంలో 272 మంది రాజధాని రైతులు మృతి: దేవినేని ఉమ

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అమరావతిపై జగన్ పత్రిక విషపు రాతలు రాస్తోందని, అమరావతి గురించి మాట్లాడే ముందు రాజధాని రైతులను ఏ విధంగా వేధించారో జగన్ గుర్తు చేసుకోవాలని మాజీ మంత్రి దేవినేని ఉమ విమర్శించారు. జగన్ హయాంలో 272 మంది అమరావతి రైతులు మృతి చెందారని, భూములిచ్చిన రైతులపై 400 కేసులు పెట్టారని అన్నారు.

## వేమన సతీశ్‌పై ఆరోపణలు.. పది కోట్లకు దావా

» అన్నమయ్య జిల్లాకు చెందిన దంపతులపై విజయవాడ కోర్టులో పరువు నష్టం కేసు

విజయవాడ(గాంధీనగర్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీశ్‌పై అన్నమయ్య జిల్లాకు చెందిన సుధామాధవి, ఆమె భర్త మురళి నిరాధారమైన ఆరోపణలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారిపై పది కోట్ల రూపాయలకు పరువు నష్టం దావా వేసినట్లు ఆయన తరపు న్యాయవాది మాగులూరి హరిబాబు తెలిపారు. విజయవాడ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో దావా వేసినట్లు వెల్లడించారు. విచారణ జరిపిన న్యాయస్థానం ఈ నెల 15న హాజరు కావాలని వారికి నోటీసులు జారీ చేసిందన్నారు. రాజంపేటకు చెందిన సతీశ్ కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా దశాబ్దాలుగా సమాజసేవ చేస్తున్నారన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని సుధామాధవి నుంచి సతీశ్ డబ్బులు తీసుకున్నారని మీడియా, సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వీటిని ఖండిస్తున్నట్టు చెప్పారు. వేమన సతీశ్ పరువుకు భంగం కలిగించేలా ప్రవర్తించిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# బెయిలిస్తే.. డేంజర్!

## సాక్షులను బెదిరించి ఆధారాలను తారుమారు చేస్తారు

» మద్యం పాలసీ రూపకల్పన, ముడుపుల వసూలులో రాజ్ కసిరెడ్డిదే కీలకపాత్ర

» సిట్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి(రాజ్ కసిరెడ్డి)కి బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను బెదిరించి, ఆధారాలను తారుమారు చేసే ప్రమాదం ఉందని సిట్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా బుధవారం హైకోర్టుకు నివేదించారు. మద్యం పాలసీ రూపకల్పన నుంచి సరఫరా కంపెనీల వద్ద ముడుపుల చేసేవరకు కసిరెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిపారు. కసిరెడ్డికి ముడుపులు అందజేసినట్లు మద్యం కంపెనీల యజమానులు ఇచ్చిన వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను సీల్డ్ కవర్‌లో కోర్టు ముందు ఉంచామన్నారు. ముడుపుల ద్వారా వచ్చిన సొమ్ముతో బంగారం, భూములు కొన్నట్టు తెలిపారు. సూట్ కేసు కంపెనీల ద్వారా సొమ్మును విదేశాలకు తరలించారని, పిటిషనర్ విదేశాలకు పారిపోతుండగా ఎయిర్‌పోర్ట్‌లో అరెస్ట్ చేశారని వివరించారు. కేసులో నిందితులుగా ఉన్న బెవరేజెస్ కార్పొరేషన్ అప్పటి ఎండీ వాసుదేవరెడ్డి, ప్రత్యేక అధికారి సత్యప్రసాద్‌ను అరెస్ట్ చేయకుండా... ప్రత్యేకంగా చూస్తున్నామన్న కసిరెడ్డి వాదనలో అర్థం లేదని కోర్టుకు తెలిపారు. అప్రూవర్‌గా మారుతామని, అనుమతించాలని వారిద్దరూ కోరుతున్నట్టు చెప్పారు. అప్రూవర్‌గా మారతామన్న వ్యక్తులతో పిటిషనర్ పోల్చుకోవడానికి వీల్లేదన్నారు. కేసులో ఇప్పటివరకు చాలా మందిని అరెస్ట్ చేశామని.. వారుగానీ, పిటిషనర్‌గానీ అప్రూవర్‌గా మారుతామనలేదని చెప్పారు. నిందితులను ఎలా 'ట్రీట్' చేయాలనేది దర్యాప్తు సంస్థ విచక్షణాధికారమని, కసిరెడ్డి బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు.




### ఆ విషయాలే చూడండి!

రాజ్ కసిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది నాగముత్తు, పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కేసు దర్యాప్తు సమీపకాలంలో పూర్తికాదని తెలిసిన తర్వాత కూడా నిందితుడిని జైల్లో ఉంచడం అతని ప్రాథమిక హక్కులను హరించడమేనని కోర్టుకు తెలిపారు. దర్యాప్తు సంస్థ సీల్డ్ కవర్‌లో ఇచ్చిన వివరాలను ఆధారంగా చేసుకుని బెయిల్‌ను తిరస్కరించడం, మంజూరు చేయడం వంటివి చేయకూడదన్నారు. ప్రాథమిక ఆధారాలు ఉన్న కారణంగానే పిటిషనర్‌ను ఇప్పటి వరకు జ్యుడీషియల్ కస్టడీలో ఉంచారని, అదే కారణంతో బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించడానికి వీల్లేదని చెప్పారు. "బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా నిందితుడు విదేశాలకు పారిపోయే అవకాశం ఉందా?. సాక్షులను ప్రభావితం చేస్తారా?. ఆధారాలను ధ్వంసం చేసే అవకాశం ఉందా?. అనే విషయాన్ని మాత్రమే పరిశీలించాలి." అని తెలిపారు. పిటిషనర్ విదేశాలకు పారిపోయే అవకాశం లేదని, సాక్షులను ప్రభావితం చేస్తున్నట్లు ఆధారాలు లేవన్నారు. కేసులో అప్రూవర్లుగా మారుతారని చెబుతున్న నిందితులు వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌లను అరెస్ట్‌చేస్తే ట్రయల్ ముగిసేవరకు వాళ్లు జైల్లో ఉండాల్సిందేనని, ఈ కారణంతోనే అరెస్ట్ చేయడం లేదని చెప్పారు. కాగా, బెయిల్ పిటిషన్‌పై ఇరు పక్షాల వాదనలు ముగిశాయి. దీంతో జస్టిస్ వెంకట జ్యోతిర్మయి.. మౌఖికంగా వినిపించిన వాదనలను రాతపూర్వకంగా అందజేయాలని ఆదేశించారు.

## అంతిమ సంస్కారాలైనా హుందాగా జరగాలి

» శ్మశానాల్లో కనీస సదుపాయాల కల్పన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే

» సీఎస్‌కు హైకోర్టు ధర్మాసనం ఆదేశం

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మనిషి అంతిమ సంస్కారాలైనా హుందాగా జరగాలని హైకోర్టు వ్యాఖ్యానించింది. శ్మశాన వాటికల్లో కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తేల్చి చెప్పింది. పిటిషనర్ సమర్పించిన ఫొటోలను పరిశీలిస్తే నిర్వహణ లోపం కారణంగా శ్మశానవాటికలు ముళ్ల చెట్లతో నిండి అధ్వాన్నస్థితిలో ఉన్నాయని పేర్కొంది. రాజమండ్రిలో ఓ మృతదేహానికి అంతిమ సంస్కారాలు రోడ్డుపై నిర్వహించిన ఘటన శ్మశానవాటికల స్థితి, కొరతను తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. పరిపాలనాపరమైన విధానాలు అమల్లో ఉన్నప్పటికీ... శ్మశానాల నిర్వహణకు అవసరమైన నిధులను ఇచ్చేందుకు ప్రభుత్వం ఎందుకు నిరాసక్తత చూపిస్తుందని ప్రశ్నించింది. శ్మశానాల ఏర్పాటు, నిర్వహణ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం పలు జీవోలు ఇచ్చినప్పటికీ, వాటి ఉద్దేశం నెరవేరలేదని, కాగితాలకే పరిమితమయ్యాయని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న శ్మశానవాటికల నిర్వహణకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడంతో పాటు రాబోయే రెండు దశాబ్దాలకు అవసరాలను తీర్చేలా ఖనన/దహన వాటికల ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. కనీస మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులు సమకూర్చాలని, రెండు నెలల్లో నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఎనిమిది వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పోరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయితీలలో శ్మశాన వాటికల్లో కనీస అవసరాలైన నీరు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు, ఫెన్సింగ్, వేదికలు, షెడ్లు ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ విజయవాడకు చెందిన పి.ప్రమోద్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. నిర్దిష్ట గడువులోగా యుద్ధ ప్రాతిపదికన వాటిని పూర్తి చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. శ్మశానవాటికల నిర్వహణ నిమిత్తం శాశ్వత నిధిని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... నిర్వహణ లోపం కారణంగా శ్మశాన వాటికలు ముళ్ల చెట్లతో నిండిపోయాయన్నారు. పురపాలక శాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది అంబటి శ్రీకాంత్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.... శ్మశాల నిర్వహణ బాధ్యత పట్టణ, స్థానిక సంస్థలు, గ్రామ పంచాయితీలదే అన్నారు.

# నేటి విచారణకు రాలేను!

» రెండు వారాల గడువివ్వండి

» రఘురామ కేసులో దర్యాప్తు అధికారికి ఐపీఎస్ సునీల్‌కుమార్ సమాచారం

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాటి నరసాపురం ఎంపీ, ప్రస్తుతం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో ప్రధాన నిందితుడైన(ఏ-1) సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ గురువారం విచారణకు హాజరుకావడంలేదు. ఆ కేసులో గుంటూరులోని సీసీఎస్ పోలీసు స్టేషన్‌లో ఈ నెల 4న విచారణకు హాజరు కావాలంటూ దర్యాప్తు అధికారి, ప్రస్తుతం విజయనగరం ఎస్పీ ఏఆర్ దామోదర్ గత నెల 26న ఆయనకు నోటీసులు జారీ చేశారు. అయితే తన కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్య కారణంగా రాలేనని, వచ్చేందుకు తనకు రెండు వారాల గడువు ఇవ్వాలని సునీల్ ఆయనకు సమాచారమిచ్చారు. సునీల్‌ను విచారించేందుకు ఎస్పీ దామోదర్ బుధవారమే గుంటూరుకు చేరుకున్నారు. చివరి నిమిషంలో తాను రావడం లేదని ఆయనకు సునీల్ సమాచారమిచ్చారు. నిజానికి సునీల్‌కుమార్‌కు నోటీసులు జారీ చేసినప్పటి నుంచీ ఆయన విచారణకు రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయనకు మళ్లీ నోటీసులివ్వాలా.. ఇస్తే అందులో ఏ షరతులు విధించాలి.. ఎంత గడువు ఇవ్వాలనే అంశాలపై న్యాయ సలహా అనంతరం నిర్ణయం తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ కేసులో ఏ-1గానాటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్ కుమార్‌ను, ఏ-2గా అప్పటి నిఘా చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, ఏ-3గా నాటి సీఎం జగన్, ఏ-4గా అప్పటి సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్, ఏ-5గా నాటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతిని చేర్చారు. దర్యాప్తు క్రమంలో విజయ్‌పాల్‌ను విచారించి అరెస్టు చేశారు. ఆ తర్వాత రఘురామపై దాడి చేసిన తులసిబాబును కూడా అరెస్టుచేశారు. ఆ తర్వాత పెద్దగా కదలికలేదు. ఐదేళ్ల క్రితం జరిగిన ఈ ఘటనపై దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉండడంపై రఘురామరాజు పలు దఫాలు అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం విదితమే.

## నకిలీ మద్యం కేసులో కస్టడీ పిటిషన్లపై 8న తీర్పు

విజయవాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో రిమాండ్ ఖైదీలను కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లపై ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఈనెల 8న తీర్పు ఇవ్వనుంది. నెల్లూరులోని కేంద్ర కారాగారంలో ఉన్న బాదల్ దాస్(ఏ7), ప్రదీప్ దాస్(ఏ8), డి.శ్రీనివాస్ రెడ్డి(ఏ11), ఏ.కల్యాణ్(12), టి.రమేశ్ బాబు(ఏ15), అల్లాభక్ష్ (ఏ16), చెక్కా సతీశ్ కుమార్(ఏ17)ను ఇప్పటికే సిట్ విచారణ చేసింది. వారిని రెండోసారి వారం పాటు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. వారితో పాటు సయ్యద్ హాజీ(ఏ5), కట్టా రాజు(ఏ6), మిథున్ దాస్(ఏ9), అంతాదాస్(ఏ10)లను కస్టడీకి ఇవ్వాలని మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండింటిపై వాదప్రతివాదనలు ముగియడంతో న్యాయాధికారి జి.లెనిన్‌బాబు 8న తీర్పును వెలువరిస్తానని తెలిపారు.

## 2 నెలలకో డీఆర్సీ సమావేశం

» ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లాల్లోని చైర్‌పర్సన్లు

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అభివృద్ధి కార్యకలాపాలు సమీక్షించే జిల్లా సమీక్షా కమిటీ(డీఆర్సీ) సమావేశం రెండు నెలలకొకసారి తప్పనిసరిగా నిర్వహించాలని ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశాలకు ఆయా జిల్లాలకు సంబంధించిన చైర్‌పర్సన్లను ప్రత్యేక ఆహ్వానితులుగా పిలవాలని సూచించారు.

## రాష్ట్ర వ్యాప్తంగా జనసేన కమిటీలు

### గ్రామాల్లో ఐదుగురితో ఏర్పాటు

» కూటమి ధర్మానికి కట్టుబడాలి: పవన్ కల్యాణ్

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ కమిటీల నిర్మాణంలో భాగంగా గ్రామ స్థాయిలో ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించాలని పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బుధవారం ఉదయం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నామినేటెడ్ పదవులపై సమీక్షించారు. జనసేన పొందిన నామినేటెడ్ పదవుల వివరాలను పరిశీలించారు. మిగిలిన పదవుల భర్తీపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడారు. 'ఇప్పటికే పిఠాపురంలో నియోజకవర్గ స్థాయిలో ప్రయోగాత్మకంగా ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటైంది. ఆ కమిటీ పనితీరును మదింపుచేసి గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీలకు రూపకల్పన చేయాలి. పార్టీ అంతర్గత వ్యవహారాల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ఉద్దేశించిన కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ విభాగం కేంద్ర కార్యాలయం నుంచే పర్యవేక్షించాలి. ఈ విభాగంలో 11 మంది వరకూ సభ్యులను నియమించాలి. ఈ విభాగం ముందుకు వచ్చే అంశం ప్రాధాన్యత, తీవ్రతను బట్టి ముగ్గురు లేదా విభాగంలోని మొత్తం సభ్యులు కలసి చర్చించి పరిష్కరించాలి. ఐదుగురు సభ్యులుండే కమిటీల్లో తప్పనిసరిగా ఒకరు, గరిష్ఠంగా ఇద్దరు వీర మహిళలు సభ్యులుగా ఉండాలి. 11 మంది ఉండే కమిటీలో ముగ్గురు వీర మహిళలకు స్థానం కల్పించాలి. కూటమి ధర్మాన్ని అనుసరించి పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసే వారికి వివిధ దశల్లో గుర్తింపు, బాధ్యతలు అందించే దిశగా ప్రయాణిస్తున్నాం' అన్నారు.



## పవన్‌ను కలిసిన వీరాభిమాని

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆయన వీరాభిమాని, తెలంగాణలోని జగిత్యాల జిల్లా కొండగట్టుకు చెందిన చట్టా సతీశ్ బుధవారం కలిశారు. 2024 జనవరి 22న అయోధ్య రామ మందిరంలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ రోజున సతీశ్ ఒక నిర్ణయం తీసుకున్నారు. పవన్ కల్యాణ్ గెలిచి, ప్రభుత్వంలోకి వచ్చే వరకూ చెప్పులు వేసుకోనని దీక్ష పూనారు. ఆయనను కలసిన తర్వాతే చెప్పులు వేసుకోవాలనుకున్నారు. ఎన్నికల్లో కూటమి విజయం సాధించిన తరువాత బుధవారం సతీశ్, పవన్‌ను కలిశారు. సతీశ్ అభిమానానికి ముగ్ధులైన పవన్ కల్యాణ్ ఆయనకు జ్ఞాపికను అందచేశారు.

## ఇక పంచాయతీల్లో

# పాలన పరుగు

## మినీ కలెక్టరేట్లుగా డీడీవో కార్యాలయాలు

» పాలన బలోపేతం.. సమన్వయంతో అభివృద్ధి

» డీడీవోలకు కీలక బాధ్యతలు

» డీడీవో కార్యాలయాల సముదాయంలోకి డీఎల్‌పీవో, డ్వామా ఏపీడీ, ఇతర ఆఫీసులు

» నేడు చిత్తూరు నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో పాలనను బలోపేతం చేయడం, సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించేందుకు పంచాయతీరాజ్ వ్యవస్థలకు పదునుపెట్టారు. డివిజన్ స్థాయిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే శాఖలన్నింటినీ ఒకే పరిపాలన నియంత్రణలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీడీవో) కార్యాలయాల ద్వారా సమన్వయం చేసుకుని అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. గతంలో ఉన్న బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారుల తరహాలో ఇప్పుడు డివిజన్ స్థాయిలో డీడీవో వ్యవస్థను తీసుకొచ్చింది. ఎంపీడీవోలకు పదోన్నతులు కల్పించడం ద్వారా నియమితులైన డీడీవోలు డివిజన్ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలకు రథసారథులుగా నిలవనున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్ సంస్కరణలు తీసుకురావడంతో డీడీవోలకు విశేష అధికారాలు సంక్రమించాయి. జిల్లాలో కలెక్టరేట్ తర్వాత మినీ కలెక్టరేట్ స్థాయిలో బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. అభివృద్ధి కార్యక్రమాలకు చిరునామాగా డీడీవో కార్యాలయాలను చేసేందుకు గతంలో ఇచ్చిన డీడీవోల జాబ్‌చార్ట్‌కు సవరణలు చేసి సమగ్రంగా రూపొందించారు. ఆ మేరకు జీఓ నంబర్ 58 విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖలో కీలక సంస్కరణలు ప్రారంభించారు. డివిజన్ స్థాయిలో ఉన్న డివిజనల్ పంచాయతీ ఆఫీసు(డీఎల్‌పీవో), డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్(ఏపీడీ), ఇతర శాఖలకు సంబంధించిన డివిజనల్ కార్యాలయాలను డీడీవో కార్యాలయాల సముదాయంలోకి మార్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గురువారం చిత్తూరు నుంచి పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా రాష్ట్రవ్యాప్తంగా డీడీవో కార్యాలయాలను ప్రారంభించనున్నారు.

### గ్రామ పంచాయతీల పాలన


పంచాయతీలకు సంబంధించి గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్(జీపీడీపీ)లను డీడీవోలు రూపొందించి అమలు చేస్తారు. ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు పన్నుల పెంపు, ఫీజు వసూలు తదితర వాటికి అనుమతిస్తారు. లేఅవుట్లు, బిల్డింగ్ రూల్స్‌కు సంబంధించి పర్యవేక్షణ చేస్తారు. నెలకు కనీసం మూడు గ్రామ పంచాయతీలను తనిఖీ చేయడంతో పాటు డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీవో)పై పాలనాపరమైన అధికారాలు కలిగి ఉంటారు. డీఎల్‌పీవోల టూర్ డైరీలను సమీక్షిస్తారు. ఆయా డివిజన్లలో డీఎల్‌పీవో పోస్టులు ఖాళీగా ఉంటే ఆ బాధ్యతలన్నీ డీడీవోలు నిర్వహిస్తారు. గ్రామ పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి సూచికల పురోగతిని సమీక్షిస్తారు. పన్ను వసూళ్లపై సమీక్ష, శానిటేషన్, ఘనవ్యర్థాల నిర్వహణ, మెషినరీ ఉపయోగించడం, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా తాగునీటిని వేసవిలో సరఫరా చేయడం, పంచాయతీల ఆస్తుల రక్షణ, కబ్జాలను తొలగించడం తదితర 16 రకాల అధికారాలను గ్రామపంచాయతీలపై డీడీవోలు కలిగి ఉంటారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి డ్వామా ఏపీడీలపై అధికారాలు కలిగి ఉంటారు. గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనుల పర్యవేక్షణలో కీలకంగా వ్యవహరిస్తారు. అవకతవకలపై కలెక్టర్‌కు డీడీవోలు నివేదిస్తారు. సోషల్ ఆడిట్ సిబ్బందితో గ్రామాల్లో తనిఖీలు నిర్వహించడంతో పాటు స్వయం సహాయక సంఘాల ద్వారా స్వయం ఉపాధి కోసం సహకారం అందిస్తారు. గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించి ఇప్పటికే ఆ శాఖ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం నిర్వహిస్తారు. డివిజన్ స్థాయిలో ఎన్నికైన స్థానిక సంస్థల ప్రతినిధులకు, పంచాయతీరాజ్ సంస్థల సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, శిక్షణ కోసం ఏపీహెచ్ఆర్‌డీఐ/ఏపీఎస్ఐఆర్‌డీ/ఈటీసీ తదితర సంస్థల సిబ్బందిని నియమించడం, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

### డీడీవోల విధులివే..

- డీడీవో కార్యాలయానికి అధిపతిగా ఉండే డీడీవో డివిజన్ స్థాయిలో అన్ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాలపై నియంత్రణ బాధ్యతలు నిర్వహిస్తారు.
- జిల్లా కలెక్టర్ నియంత్రణలో ఉంటూ డివిజన్ స్థాయిలో ఆయా శాఖల అనుసంధానంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తారు. అన్ని కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ సమీక్షలు నిర్వహిస్తారు.
- పాలనాపరంగా ప్రతి నెలా కనీసం 20 రోజులు పర్యటనలు చేసి టూర్ డైరీలను కలెక్టర్‌కు సమర్పించాలి.
- డివిజన్ స్థాయిలో ఎంపీడీవోలతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది మొత్తం డీడీవో నియంత్రణలో పనిచేస్తారు.
- మండలస్థాయి అధికారులతో డీడీవో కార్యాలయాల నుంచి సంప్రదింపులు చేస్తారు. ఎంపీడీవోల టూర్ డైరీలు, వారి వార్షిక కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు(ఏసీఆర్) ఇక్కడి నుంచే సమీక్షిస్తారు.
- పంచాయతీలు, మండల పరిషత్‌లు, గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించిన అక్రమాలపై డీడీవో విచారణ చేపడతారు. ప్రతి ఆర్నెల్లకోసారి మండల పరిషత్ కార్యాలయాలను తనిఖీలు చేస్తారు. అభివృద్ధి పనులకు సంబంధించి తేడాలుంటే జిల్లా యంత్రాంగానికి నివేదిస్తారు.
- పంచాయతీరాజ్ సంస్థల ఆడిట్ అభ్యంతరాలు, సర్‌చార్జి రికవరీ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. ఆర్థిక అవకతవకలపై కలెక్టర్, సీఈఓ, డీపీవోలకు నివేదిస్తారు.
- ఇప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి డిప్యూటీ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటీగా ఆర్డీవోలు ఉండేవారు. ఇక నుంచి డీడీవోలకు ఆ బాధ్యతలను అప్ప చెప్తూ పంచాయతీరాజ్ రూల్స్‌ను సవరిస్తారు.

## మత్స్యకారుల సమస్యకు శాశ్వత పరిష్కారం

» ఉప్పాడ మత్స్యకారులతో పవన్ భేటీ



అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉప్పాడ ప్రాంత మత్స్యకారుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బుధవారం మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయంలో ఉప్పాడ మత్స్యకారులతో 100రోజుల ప్రణాళిక అమలు, భవిష్యత్తు కార్యాచరణ, ఆదాయ పెంపు అంశాలపై ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. 'మత్స్యకారులకు సమస్య వస్తే.. నాకు వచ్చినట్లే. దాన్ని పరిష్కరిస్తా. రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లేవాడిని. మిగతా పార్టీల నాయకుల్లా సమస్య వస్తే బూతులు తిట్టడం, గొడవలు పెట్టడం చేయను. పరిష్కారం అయ్యేదాకా పనిచేస్తా' అని అన్నారు. 'ఉప్పాడలోని 7,200 మంది మత్స్యకారులు, 25,600 మంది కుటుంబసభ్యుల జీవన భృతి రెట్టింపు కావాలన్నదే లక్ష్యం. ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి రూ.323 కోట్లతో ప్రతిపాదనలు చేశాం. పిఠాపురంలోని వాణిజ్య భవన సముదాయంలో 50 శాతం మత్స్యకారులకు కేటాయిస్తాం' అని పవన్ పేర్కొన్నారు.



నల్లజర్లలో 'రైతన్నా.. నీ కోసం' కార్యక్రమానికి హాజరైన రైతులు

## చంద్రన్న.. రైతన్న!



నల్లజర్లలో 'రైతన్నా.. నీ కోసం' కార్యక్రమంలో మంచాలపై ఇరువైపులా రైతులను కూర్చోబెట్టుకుని ముఖాముఖిలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

### నులక మంచంపై కూర్చొని.. కుటుంబ సభ్యుడిగా కుశలమడుగుతూ..

రాజమహేంద్రవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తీరులో ఈసారి ఏదో మార్పు కనిపిస్తోంది. పెద్ద సభలు.. వేలల్లో జన సమీకరణ.. పెద్ద పెద్ద మైక్ సెట్లు.. గంటల తరబడి ప్రసంగాలు.. ఇలాంటి వాటికి స్వస్తి పలికారని అనిపిస్తోంది. ప్రజలతో మమేకమవుతూ ఇటీవలకాలంలో నిర్వహిస్తున్న సమావేశాలే దీనికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి. బుధవారం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో రైతు బొబ్బి ధర్మారావు వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వేదిక నిర్వహించి ముఖ్యమంత్రి మంచంపై కూర్చుని రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఓ చెట్టు కింద నులక మంచంపై సీఎం కూర్చున్నారు. సుమారు 3 గంటలు జరిగిన ఈ కార్యక్రమంలో గంటన్నర ఆయన 75 ఏళ్ల వయసులో అలాగే కూర్చుని రైతులతో మాట్లాడారు. రైతులు కూర్చోడానికి కూడా నులక స్టూల్స్‌ని కడప నుంచి రప్పించారు. ప్రకృతి ఒడిలో.. రైతన్నలతో మమేకమయ్యే విధంగా కలెక్టర్ కీర్తి చేకూరి చొరవ తీసుకొని ఏర్పాట్లు చేయించారు. రాష్ట్రంలో ఇలా సీఎం సభా వేదికను రూపుదిద్దడం ఇదే తొలిసారిగా చెప్పవచ్చు.

## 'లోక్'భవన్‌గా రాజ్‌భవన్

» పేరు మార్పునకు గవర్నర్ ఆమోదం.. వెంటనే నోటిఫికేషన్

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మార్చారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఇచ్చిన ఆర్డర్ ప్రకారం పేరు మార్పునకు గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ఆమోదం తెలిపారు. ఈ మేరకు రాజ్‌భవన్ పేరు మారుస్తూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాములు బుధవారం నోటిఫికేషన్ జారీచేశారు. గవర్నర్ ఆమోదించిన వెంటనే లోక్‌భవన్ అధికారులు గవర్నర్ వెబ్‌సైట్, అన్ని ఆన్‌లైన్ వేదికల్లో రాజ్‌భవన్ స్థానంలో లోక్‌భవన్‌గా పేర్లు మార్చేశారు. కాగా, ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోక్‌భవన్‌లో నాగాలాండ్, అసోం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా పాల్గొని, ఆయా రాష్ట్రాల చిన్నారుల నృత్యాలను తిలకించారు. కార్యక్రమంలో లోక్‌భవన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాములు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




రాజ్‌భవన్ వెబ్‌సైట్‌లో లోక్‌భవన్‌గా మారిన పేరు

## పొగాకు రైతులను కేంద్రం ఆదుకోవాలి

» లోక్‌సభలో టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు



న్యూఢిల్లీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొగాకు రైతుల ప్రయోజనాలను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వానికి టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. పొగాకు రైతులు అప్పుల పాలవుతున్నారని అన్నారు. పొగాకు రైతులకు మద్దతు అందించకపోతే కొనుగోళ్లు మరింత తగ్గి వేలాది కుటుంబాల్లో సంక్షోభం తప్పదని అన్నారు. లోక్‌సభలో సెంట్రల్ ఎక్సైజ్ సవరణ బిల్లు 2025పై బుధవారం జరిగిన చర్చ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ... పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. కాగా, దేశంలోని అతిపెద్ద పొగాకు సంస్థల్లో ఒకటైన ఐటీసీ లిమిటెడ్‌పై ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పల్నాడులో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఐటీసీ, ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.5,187 కోట్ల నికర లాభాన్ని నివేదించినప్పటికీ, తమకు సరుకు అందిస్తున్న రైతుల సంక్షేమం, ప్రత్యామ్నాయ పంటలు లేదా వారి ఆర్థిక స్థిరత్వం కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను సరైన రీతిలో వినియోగించడం లేదని ఆరోపించారు.

## పారిశ్రామికవేత్తలకు సహకరిస్తాం

» 'ఇండస్' ప్రతినిధులతో భేటీలో మంత్రి కొండపల్లి



అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పునరుద్ఘాటించారు. రాష్ట్ర సచివాలయంలో ది ఇండస్ ఎంటర్ ప్రెన్యూర్స్ (టీఐఈ) ప్రతినిధులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇండస్ ప్రతినిధులు తమ మెంటార్‌షిప్ ఫ్రేమ్‌వర్క్ గురించి మంత్రికి, అధికారులకు వివరించారు. కాగా, వచ్చే ఏడాది జనవరి 4న జైపూర్‌లో జరగనున్న టీఐఈ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా మంత్రిని వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి.. పీ4 విధానం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అందిస్తున్న సహకారం గురించిఇండస్ ప్రతినిధులకు వివరించారు. కార్యక్రమంలో టీఐఈ ప్రతినిధులు మురళి, విజయ్ మేనన్, మహావీర్ ప్రతాప్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీకి 125 కోట్ల కేంద్ర నిధులు

న్యూఢిల్లీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పట్టణ భూ సమీకరణ వ్యవస్థను ఆధునీకరించడంలో, 10 పట్టణ స్థానిక సంస్థలలో (యూఎల్‌బీఎస్) చూపిన విశేష పురోగతికి గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్‌కు సాస్కి-నక్ష ప్రోగ్రామ్ కింద రూ.125 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## మూలపేట పోర్టు పూర్తికి మరింత గడువివ్వండి

» కాంట్రాక్టు సంస్థ 'విశ్వసముద్ర' వినతి.. రాష్ట్రప్రభుత్వం అంగీకారం

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తుఫాన్లు, భారీ వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా మూలపేట (భావనపాడు) పోర్టును గడువులోగా పూర్తి చేయలేకపోయామని కాంట్రాక్టు సంస్థ విశ్వసముద్ర ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేర్కొంది. తమకు మరో 409 రోజులు గడువిస్తే నిర్మాణాన్ని పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. దీనికి రాష్ట్రప్రభుత్వం అంగీకరిస్తూ 2026 నవంబరు 30నాటికి మూలపాడు పోర్టును పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేసింది. జాప్యం కారణంగా పెరిగిన అదనపు వ్యయాలను చెల్లించబోమని తేల్చిచెప్పింది. ఈ మేరకు మౌలిక సదుపాయాల కల్పన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వు జారీ చేశారు.

## రెండో దశ ఫిషింగ్ హార్బర్లకు నిధులు రద్దు చేయొద్దు

» కేంద్రం ముందు నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రెండో దశలో చేపట్టనున్న నాలుగు ఫిషింగ్ హార్బర్లకు ఇప్పటికే కేటాయించిన రూ.320 కోట్లను రద్దు చేయకుండా ఇవ్వాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేయనుంది. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న పలు ప్రాజెక్టులకు ఆమోదంపై బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుతో రాష్ట్ర మౌలిక సదుపాయాలు, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మొవ్వ తిరుమల కృష్ణబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రులతో సంప్రదింపులు జరిపి నిధులు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కృష్ణబాబుకు సీఎం చంద్రబాబు సూచించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు సహకారం తీసుకుని జాతీయ రహదారులు, మౌలిక వసతుల శాఖల మంత్రులతో ప్రత్యేకంగా భేటీ కావాలని సూచించారు.

## త్వరలో విశాఖ ఉక్కుకు రాహుల్

» అది కోహినూర్ వజ్రం... దానిని అదానీకి అమ్మేస్తోంది: సునీల్ అహీరా

మహారాణిపేట(విశాఖపట్నం), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ త్వరలో విశాఖ ఉక్కును సందర్శించనున్నారని ఏఐసీసీ అధికార ప్రతినిధి సునీల్ అహీరా వెల్లడించారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'విశాఖ స్టీల్ కోహినూర్ వజ్రం వంటిది. ఇందిరమ్మ ఇచ్చిన స్టీల్ ప్లాంటును బీజేపీ తన కార్పొరేట్ మిత్రుడు అదానీకి అమ్మేస్తోంది. స్టీల్‌ప్లాంటును అమ్మనివ్వబోము' అని పేర్కొన్నారు.

# రైతు ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండ్

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రణాళిక అమలు చేయనున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం పరిధిలోని నల్లజర్లలో జరిగిన రైతన్నా-మీకోసం కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడారు. "నేను మంచి కన్సల్టెంట్‌ను పెట్టుకున్నా. ప్రపంచ పరిస్థితులను దానివల్ల ముందే గ్రహించగలుగుతున్నా. జటిలమైన వ్యవసాయ సమస్యల పరిష్కారానికీ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతుకు అండగా ఉండడానికీ పంచసూత్ర ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. ఈ సూత్రాలపై అవగాహన కల్పించడం కోసమే 'రైతన్నా- మీకోసం' చేపట్టాం" అని సీఎం వివరించారు. రాష్ట్ర రైతులు తెలివైనవారని, నీరు ఎక్కడ ఉంటే అక్కడకెళ్లి వ్యవసాయం చేస్తారన్నారు. "వ్యవసాయంలో సంక్షోభం వస్తుంటుంది. అది లేకుండా చూసే బాధ్యత నాపై ఉంది. ఇప్పటికే కొంత వరకు నియంత్రించాం. సాగును లాభసాటి చేయడానికి ప్రయత్నిస్తున్నాం. రైతు వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలపై దృష్టిపెట్టాలి. ప్రతి కుటుంబం నుంచి ఓ పారిశ్రామికవేత్త రావాలి. అందుకే ప్రతి నియోజకవర్గంలో ఓ ఎంఎస్ఎంఈని ఏర్పాటు చేస్తున్నాం. రైతులు పండించిన పంటను నేరుగా విని



రైతన్నా నీ కోసం కార్యక్రమంలో తోటలను పరిశీలించి మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

యోగదారులకు విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. సమావేశంలో మంత్రులు కందుల దుర్గేశ్, అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, తూర్పుగోదావరి కలెక్టర్ కీర్తి చేకూరి, స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పాల్గొన్నారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

### భూగర్భ జలాలు తగ్గాయి...

"రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 1నాటికి 6.8 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉంటే, తూర్పుగోదావరి జిల్లాలో 18 మీటర్ల లోతులో ఉన్నాయి. దానికి ఇక్కడి పరిస్థితులే కారణం. ఈ ఏడాది రిజర్వాయర్లలో 900 టీఎంసీల నీరు, 700 టీఎంసీల వరకు భూగర్భ జలాలున్నాయి. 20 లక్షల పంపుసెట్లు ఉన్నాయి. వాటితో సాగునీరు, మంచినీరు, పరిశ్రమలకు నీటిఎద్దడి లేకుండా చేస్తాం. గోదావరి-కృష్ణా అనుసంధానంతో ప్రతి ఎకరాకూ నీరందుతుంది. రాబోయే రోజుల్లో గోదావరిని వంశధారతో అనుసంధానం చేస్తాం. పెన్నాకు కూడా తీసుకెళ్తాం. ఈ ఏడాది గోదావరి నీరు ఏడు వేల టీఎంసీలు సముద్రం పాలైంది. 1500 టీఎంసీల కృష్ణా నీరు వృథా అయింది. ఇందులో కనీసం 200 టీఎంసీలను వాడుకోగలిగితే కరువన్న మాటే వినపడదు."

### పామాయిల్ ఎన్టీఆరే తెచ్చారు

"రాష్ట్రంలో మొదటి పామాయిల్ మొక్కను మలేసియా నుంచి ఎన్టీఆర్ తెచ్చారు. క్రమంగా దాని సాగు పెరిగింది. ఓ సమయంలో ధర పడిపోతే నేనే రాయితీ ఇచ్చి ప్రోత్సహించాను. పామాయిల్ సాగుకు మైక్రో న్యూట్రిషన్లు వాడాలి. ఒక పంటకు లాభం వస్తే అందరూ అదే వేస్తున్నారు. ఒకరు రైస్‌మిల్లు పెడితే అందరూ అవే పెడతారు. అది నష్టం. హెచ్‌డీ బర్లీ పొగాకు మొదట ఎవరూ కొనలేదు. తర్వాత డిమాండ్ ఉండడంతో అందరూ వేసేశారు. ఇవాళ కొనేవారు లేదు. కోకో ఫ్యాక్టరీలు పెరగాలి. మూడు నెలలకు ఒకసారి అందరికీ అన్ని వైద్య పరీక్షలు చేసేలా సంజీవని ప్రాజెక్టు తెస్తున్నాం. కుప్పం-చిత్తూరులో పూర్తి చేశాం. 2030 నాటికి ఎయిడ్స్‌రహిత రాష్ట్రం చేస్తాం."

### జాబిల్లి రావే.. అంటే పనులు కావు

"రెవెన్యూ ప్రక్షాళన చేయాలి. జగన్ ఆనాడు రెవెన్యూ రికార్డులు తారుమారు చేశారు. ఆయన మాట వినకపోయినా, చెప్పినట్టు చేయకపోయినా, భూములు ఇవ్వమన్నప్పుడు ఇవ్వకపోయినా, వాటిని 22ఏలో చేర్చారు. సొంతదారులకు హక్కులు లేకుండా చేశారు. గత ప్రభుత్వ వైఖరి వల్ల ఖజానా ఖాళీ అయింది. మేం, పవన్, బీజేపీ కూటమి ఏర్పడితే ప్రజలు అఖండ విజయం ఇచ్చారు. దాంతో మూడు, నాలుగు రెట్లు అభివృద్ధి చేయాలని భావిస్తున్నాం. అయితే, జాబిల్లి రావే...అంటూ చిన్న పిల్లలకు చెప్పినట్టు చెప్పి ఇంట్లో కూర్చుంటే పనులు కావు. గతంలో వైసీపీ విధ్వంసం వల్ల రోడ్లు గుంతలు పడ్డాయి. పూడ్చాం. తుఫాన్ వల్ల మళ్లీ దెబ్బతిన్నాయి. సంక్రాంతిలోపు గుంతలన్నీ పూడ్చేటట్టు ఆదేశాలిచ్చాం."

### చార్జీలు పెంచం

"విద్యుత్ చార్జీలు పెంచం. గతంలో కూడా చెప్పాను. మళ్లీ చెబుతున్నాను. రైతు పొలాల్లోనూ సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. సబ్ స్టేషన్లలోనూ ఉత్పత్తి చేస్తాం. మీరు, మేమూ కలిస్తే ఏదైనా సాధ్యమే. మన జీవితాలను మనమే మార్చుకోగలం."

### నేను రైస్ తినను: చంద్రబాబు

"మీరేమీ అనుకోకపోతే ఒకటి చెబుతాను. నేను రైస్ తినను. ఎవరు ఏమనుకున్నా లాంగ్‌టైమ్‌లో ప్రకృతి సేద్యమే మార్గం. రాయలసీమలో రాగి అన్నం తినేవారు. ఇటీవల అక్కడ కూడా తగ్గింది. అన్నం అందరికీ అలవాటయింది. ఎన్టీఆర్ కిలో 2 బియ్యంతో అందరూ రైస్ తినడం మొదలు పెట్టారు. ఒక పంట వరి వేసినా రెండో పంట హార్టికల్చర్ వేస్తే ఆదాయం పెరుగుతుంది. గోపాలపురం వంటి మెట్ట ప్రాంతాల్లో తృణధాన్యాలు, ఇతర పంటలు వేయడం లాభదాయకం. పంజాబ్, ఆంధ్రప్రదేశ్ దేశానికి అన్నపూర్ణగా ఉండేవి. ఇవాళ పంజాబ్ నుంచి నెలకు రెండు రైళ్ల నిండా క్యాన్సర్ రోగులు ఢిల్లీకి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. ఇక్కడ ఆ పరిస్థితి రాకూడదు."

### డ్రిప్ పెంచండి.. దాణాకు సబ్సిడీ ఇవ్వండి

**నల్లజర్లలో చంద్రబాబును కోరిన రైతులు**

తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలోని రైతు బొబ్బి ధర్మారావు వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటుచేసిన ప్రకృతి వేదికలో సీఎం చంద్రబాబు నులక మంచంపై కూర్చుని రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ అనుభవాలను పంచుకున్నారు.

**పెనుమత్స సుబ్బరాజు (దేవరపల్లి, యర్నగూడెం సొసైటీ అధ్యక్షుడు):** గతంలో మా ప్రాంతంలో 250 అడుగుల్లో నీరు పడేది. ఇప్పుడు 400 అడుగులు బోర్లు వేయాల్సి వస్తోంది. ఉద్యానవన పంటలకు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీరందిస్తే నీరు ఆదా అవుతుంది.

**సీఎం:** నువ్వు ఏ పంటలు పండిస్తున్నావు?

**సుబ్బరాజు:** పామాయిల్, కోకో సాగు చేస్తూ అంతర్ పంటగా మిరియాలు వేస్తున్నాను.

**గుంటముక్కల వేణు (రైతు, నల్లజర్ల):** వ్యవసాయంతోపాటు కాజు పరిశ్రమను నిర్వహిస్తున్నాను. దీనిద్వారా రూ.2కోట్ల టర్నోవర్ ఉంటోంది. ఏడాదికి రూ.25 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఆయిల్‌ఫాంలో అరటి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నాను. (వేణును సీఎం అభినందించారు)

**మార్ని మురళీ (రైతు, నల్లజర్ల):** ఆయిల్‌ఫాం చెట్ల గెలలు కోసేందుకు కూలీలు రావడం లేదు. ఆ చెట్లను తొలగించే ప్రక్రియకు ప్రభుత్వ సాయం అవసరం. నూతన మిషనరీ ఏర్పాటుచేసి చెట్లను నిర్వీర్యం చేయాలి.

**సీఎం:** (అధికారులతో) మలేసియా నుంచి కొత్త మిషనరీ తీసుకువచ్చే ఏర్పాటు చేయండి.

**పాతూరి రమేశ్ (రైతు, అచ్చన్నపాలెం):** ఆయిల్‌పాం తోటలో విద్యుత్ వైర్లు ఉండడం వల్ల గెలలు కోసే సమయంలో షాక్‌కు గురై రైతులు, రైతు కూలీలు మృతి చెందుతున్నారు. విద్యుత్ వైర్లు తొలగించి కేబుల్స్ వేయాలి.

**సీఎం:** కేబుళ్లు వేయడం ఖర్చుతో కూడిన పని. విద్యుత్ లైన్లు పక్కకు మార్చాలంటే, అందుకయ్యే వ్యయంలో రైతులు విద్యుత్ శాఖకు 25 శాతం చెల్లిస్తున్నారు. ఆ భారం తగ్గించడానికి యత్నిస్తాం.

**గన్నిన సుబ్బారావు (రైతు, నల్లజర్ల):** నాకు ఉన్న రెండు ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాను. బస్తా రూ.2,500 వరకు ధర పలుకుతుంది. పశువుల దాణాపై సబ్సిడీ అందించాలి.

**సీఎం:** పురుగుమందులు,ఎరువుల వినియోగంలో రైతులు జాగ్రత్తగా ఉండాలి.అధికంగా వాడితే క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంటుంది.

# దివ్యాంగులకు ఉచిత బస్సు

» వారు ప్రతిభావంతులు

» కాస్త మద్దతిస్తే అద్భుతాలు సృష్టిస్తారు: సీఎం

» అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో ఏడు వరాలు ప్రకటన

విజయవాడ సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు బలహీనులు కాదని, అత్యంత ప్రతిభావంతులని.. కొంచెం మద్దతిస్తే అద్భుతాలను సృష్టించే సత్తా వారి సొంతమని సీఎం చంద్రబాబు అన్నారు. అందరితోపాటు వారికి సమాన అవకాశాలు, హక్కులు, గౌరవం కల్పించేందుకు అనుకూలమైన సమాజాన్ని నిర్మించాలనే రాష్ట్రంలోని దివ్యాంగులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వారి జీవితాల్లో ఇంద్రధనుస్సు వెలుగులు నింపేందుకు ఏడు వరాలు ప్రకటించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరిగిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం, రాజకీయాల్లో రాణించడానికి స్థానిక సంస్థల్లో ఎక్స్-అఫిషియో సభ్యులుగా నియామకం, రూ.19 కోట్లతో దివ్యాంగుల ఆర్థిక సబ్సిడీ పునరుద్ధరణ, వారిలో క్రీడా నైపుణ్యాలను గుర్తించేందుకు ప్రత్యేక టాలెంట్ డెవలప్‌మెంట్ స్కీం, టిడ్కో ఇళ్లలో గ్రౌండ్‌ఫ్లోర్ ఫ్లాట్ల కేటాయింపు, బధిరులకు ప్రత్యేక కళాశాల, విద్యార్థులు ఎక్కడుంటే అక్కడే పింఛన్ పంపిణీ, అమరావతిలో విభిన్న ప్రతిభావంతులకు భవన నిర్మాణం.. మొత్తం 7 వాగ్దానాలు చేశారు. దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి ఎన్టీఆర్‌తో మొదలైందని గుర్తుచేశారు. తాను మొదటి సారి సీఎం అయ్యాక పింఛన్ రూ.200 చేశానని.. ప్రస్తుతం రూ.6 వేలకు పెంచానని చెప్పారు. బ్యాక్‌లాగ్ పోస్టులకు ప్రత్యేక నియామక గడువును పొడిగిస్తామన్నారు.

### అంధ క్రికెటర్లకు భారీ నజరానాలు

ఇటీవల ప్రపంచ అంధుల క్రికెట్ టోర్నీలో దేశానికి పతకం అందించిన రాష్ట్ర క్రీడాకారులు పి.కరుణకుమారి, దీపిక (కర్ణాటక తరపున ప్రాతినిధ్యం), గతంలో రెండుసార్లు ప్రపంచ కప్ తీసుకొచ్చిన అర్జున అవార్డీ అజయ్‌కుమార్‌రెడ్డికి ప్రభుత్వ ప్రోత్సాహకాలను సీఎం అందజేశారు. అల్లూరి జిల్లాకు చెందిన కరుణకుమారికి ప్రభుత్వం తరపున రూ.15 లక్షలు, ఇల్లు.. దీపికకు రూ.10 లక్షలు, ఇల్లు ఇస్తామని, అజయ్‌కుమార్‌రెడ్డికి రూ.2.50 లక్షలు ఇస్తామని ప్రకటించారు. కరుణకుమారికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మంజూరు చేసిన రూ.5 లక్షలు, మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమకూర్చిన రూ.5 లక్షలు, బ్లైండ్ క్రికెట్ అసోసియేషన్ మంజూరు చేసిన రూ.లక్ష చెక్కులను అందజేశారు. ఇండియన్ బ్లైండ్ క్రికెట్ టీంకు ఏసీఏ మంజూరు చేసిన రూ.10 లక్షలను కెప్టెన్ దీపికకు అందించారు. విశాఖలో 23 ఎకరాల్లో నేషనల్ సెంటర్ ఫర్ డిజబిలిటీ స్పోర్ట్స్ స్టేడియాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

### దివ్యాంగుల జీవితాలు ఎందరికో స్ఫూర్తి: పవన్




అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తున్న దివ్యాంగుల జీవితాలు ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆయన బుధవారం సాయంత్రం మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులు గోగన ఆదిశేషు, శెట్టివారి రఘులతో ముచ్చటించారు. మార్కాపురానికి చెందిన రఘు, బాపట్లకు చెందిన ఆదిశేషుల జీవన, కుటుంబ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. వారిద్దరికీ జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పింఛను మొత్తాన్ని పెంచడం వల్ల తమ జీవనానికి ఒక వెసులుబాటు దొరికిందన్నారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇక రోజుకు 5 గంటలు పార్టీకే

» పదవుల కోసం సిఫారసులతో పనిలేదు: చంద్రబాబు

» కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి

» గోపాలపురం నియోజకవర్గ భేటీలో నేతలకు ఆదేశం



బుధవారం నల్లజర్లలో గోపాలపురం నియోజకవర్గ టీడీపీ సమావేశానికి హాజరైన నేతలు, శ్రేణులు.. ప్రసంగిస్తున్న చంద్రబాబు.

గోపాలపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇక నుంచి పార్టీకి ప్రతి రోజూ ఐదు గంటల సమయం కేటాయిస్తానని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. ప్రతి కార్యకర్త బాగోగులు చూసుకునే బాధ్యత తనపై ఉందన్నారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో బుధవారం గోపాలపురం నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పార్టీకి కార్యకర్తలే బలం. కార్యకర్తలను నాయకులుగా తయారుచేసే విశ్వవిద్యాలయం టీడీపీ. అందువల్ల పదవుల కోసం ఏ ఒక్క కార్యకర్త పాకులాడాల్సిన అవసరం లేదు. కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ పదవులు వాటంతట అవే వస్తాయి. నాయకుల చుట్టూ తిరిగి రికమెండేషన్లు చేయించాల్సిన అవసరమే లేదు. అందరి వ్యక్తిగత డేటా నా వద్ద ఉంది' అని తెలిపారు. విశ్రమించని కార్యకర్తలు ఉన్నంతవరకు టీడీపీకి తిరుగులేదన్నారు. వారికి ఆగ్రహం వస్తే పార్టీ ఇబ్బందులకు గురవుతుందని, అందుకే ప్రతి నాయకుడూ వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని ఆదేశించారు. కష్టకాలంలో ఎదురైన ప్రతి ఇబ్బందినీ అధిగమించి పడిలేచిన కెరటంలా టీడీపీ విజయదుందుభి మోగించిందని తెలిపారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో చంద్రబాబు సెల్ఫీలు దిగారు.

## నేడు మన్యం జిల్లాకు లోకేశ్

» రేపు రానున్న చంద్రబాబు

» భామినిలో 'మెగా పీటీఎం'కు హాజరు

పార్వతీపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, విద్యా మంత్రి లోకేశ్ పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించనున్నారు. లోకేశ్ గురువారం రాత్రి పాలకొండ నియోజకవర్గం భామినిలో టీడీపీ కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు ముందుగా వస్తున్నారు. చంద్రబాబు శుక్రవారం రానున్నారు. ఇద్దరూ కలిసి అదే రోజు భామినిలోని ఏపీ మోడల్ స్కూల్ అండ్ కాలేజ్‌లో జరిగే మెగా పేరెంట్స్ సమావేశం(పీటీఎం)లో పాల్గొంటారు.

## సీఎం చంద్రబాబుతో గౌతం అదానీ భేటీ



అదానీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతో అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతం అదానీ భేటీ అయ్యారు. బుధవారం రాత్రి ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చిన అదానీ సీఎంతో కలసి డిన్నర్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులపై ఇరువురూ చర్చించుకున్నారు. అదానీ గ్రూప్ రాష్ట్రంలో పోర్టులు, డేటా సెంటర్, సిమెంటు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో వాటిపైనా, రానున్న రోజుల్లో రాష్ట్రంలో అదానీ గ్రూప్ పెట్టబోయే పెట్టుబడులపైనా చర్చ జరిగింది. ఈ భేటీలో అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్ ఎండీ కరణ్ అదానీ, మంత్రి లోకేశ్ ఉన్నారు.

## విశాఖకు మరో గ్లోబల్ డేటా సెంటర్!

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖపట్నం డేటా సెంటర్లకు కేంద్రంగా మారుతోంది. గూగుల్ డేటా సెంటర్ ప్రతిపాదన.. మరిన్ని గ్లోబల్ సంస్థలు విశాఖలో డేటా సెంటర్లు ఏర్పాటు చేసేందుకు దారి చూపుతోంది. తాజాగా ప్రముఖ ఐటీ సంస్థ కంట్రోల్-ఎస్ విశాఖలో 350 మెగావాట్ల డేటా సెంటర్ స్థాపించేందుకు ముందుకొచ్చింది. విశాఖలో డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే పలు కంపెనీలు ప్రతిపాదనలను సమర్పించాయి. వీటిని పరిశీలించిన ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విశాఖలో రెవెన్యూ అధికారులతో కలసి ప్రతిపాదిత భూములను పరిశీలించాలని వాటికి సూచించింది. బుధవారం విశాఖలో రెవెన్యూ అధికారులతో కలసి కంట్రోల్-ఎస్ సంస్థ ప్రతినిధులు భూములను పరిశీలించారు. అలాగే గ్లోబల్ స్థాయిలో ప్రఖ్యాతి గాంచిన ఓ దేశీయ సంస్థ ప్రతినిధులు, మరో ప్రఖ్యాత సంస్థ ప్రతినిధులు కూడా విశాఖలో భూములు పరిశీలించారు. ఈ భూముల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ సానుకూల ప్రతిపాదనలు ఇస్తే.. వాటిని ఎస్ఐపీసీ, ఎస్ఐపీబీ, ఆ తర్వాత ఈ నెల 25న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో ఆమోదించనున్నారు. ఈ మూడు డేటా సెంటర్లు విశాఖలోనే ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉండటంతో.. ఉత్తరాంధ్రలోని సముద్ర తీర ప్రాంతం డేటా సెంటర్లతో నిండిపోనుంది.

## 'మేఘా'కు సేఫ్టీ ఎక్సలెన్స్ అవార్డు



మేఘ ప్రతినిధి నాగకృష్ణకు అవార్డు అందిస్తున్న జెన్‌కో ఎస్ఈ రామభద్రరాజు

పోలవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పోలవరం జల విద్యుత్ కేంద్రం నిర్మాణ పనులు చేపట్టిన మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెయిల్) అరుదైన మైలురాయిని చేరుకుంది. 2020లో జలవిద్యుత్ కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభించినప్పటి నుంచి ఒక్క పనిదినం కూడా వృథా కాకుండా సురక్షితంగా 2.5 కోట్ల పనిగంటలు పూర్తి చేసుకుంది. ఈ క్రమంలో సరైన భద్రతా ప్రమాణాలు పాటించినందుకు గానూ ఏపీ జెన్‌కో నుంచి 'సేఫ్ మ్యాన్ అవర్స్ ఎక్సలెన్స్ అవార్డు'ను అందుకుంది. దీనికి సంబంధించిన ధ్రువపత్రాన్ని ఏపీ జెన్‌కో ఎస్ఈ కె.రామభద్రరాజు మేఘా సంస్థ అసోసియేట్ మేనేజర్ ప్రగడ నంద నాగకృష్ణకు బుధవారం అందజేశారు.

# విశాఖలో 'మహా సాగర్'

- ఫిబ్రవరిలో నేవీ మెగా ఈవెంట్లు
- తూర్పు నౌకాదళం వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా వెల్లడి



విశాఖపట్నం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో 'మహా సాగర్' పేరుతో భారీఎత్తున నేవీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తూర్పు నౌకాదళం ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా వెల్లడించారు. నేవీ డేను పురస్కరించుకొని ఐఎన్ఎస్ హిమగిరి యుద్ధనౌకపై బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 15 నుంచి 25వ తేదీ వరకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. వీటిలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్), ఎక్సర్‌సైజ్ మిలాన్-2026, ది ఇండియన్ ఓషన్ నేవల్ సింపోజియం(ఐఓఎన్ఎస్) ఉన్నాయని వివరించారు. ఐఎఫ్ఆర్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మిలాన్ సిటీ పరేడ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారన్నారు. మిలాన్‌కు 100కుపైగా దేశాలను ఆహ్వానించగా, 61 దేశాలు సానుకూలంగా స్పందించాయని తెలిపారు. ఫిబ్రవరి 21 నుంచి 25 వరకు మిలాన్ సీ ఫేజ్ విన్యాసాలు జరుగుతాయన్నారు. ఫిబ్రవరిలో భారీగా కార్యక్రమాలు ఉన్నందున ఏటా డిసెంబరు 4న విశాఖలో నిర్వహించే సాహస విన్యాసాలను ఈ ఏడాది ప్రదర్శించడం లేదన్నారు. నేవీ డే కార్యక్రమాలను ఈసారి కేరళలో నిర్వహిస్తున్నామని చెప్పారు. నౌకాదళం తన సామర్థ్యాలను పెంచుకోవడానికి మరో 51యుద్ధనౌకలను నిర్మిస్తున్నదన్నారు.

### రెండేళ్లలో తూర్పు నౌకాదళానికి 5 యుద్ధనౌకలు

భారత నౌకాదళం 2030 నాటికి యుద్ధనౌకల సంఖ్యను 200కు పెంచాలని యత్నిస్తోంది. ప్రస్తుతం 150 యుద్ధనౌకలు ఉండగా, మరో 50 నిర్మాణంలో ఉన్నాయి. వీటిలో తూర్పు నౌకాదళానికి కనీసం 15 కేటాయించే అవకాశం ఉందని నేవీ వర్గాల సమాచారం. రాబోయే రెండేళ్లలో 5 యుద్ధ నౌకలు, ఒక అణు జలాంతర్గామి అందుబాటులోకి రానున్నాయి. ఈ ఒక్క ఏడాదిలోనే తూర్పు నౌకాదళంలో 6యుద్ధనౌకలు కమిషనింగ్ జరిగాయి.

## కోకాపేటలో ఎకరం సగటు ధర రూ. 137 కోట్లు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కోకాపేట నియోపోలీస్‌లో మూడో విడత భూముల వేలం ప్రక్రియ బుధవారం విజయవంతంగా ముగిసింది. ఈ విడతలో ఎకరం సగటు ధర రూ.137..36 కోట్లు పలికింది. ప్లాట్ నంబరు 19, 20ల్లోని మొత్తం 8.04ఎకరాల భూమిని అమ్మడం ద్వారా హెచ్ఎండీఏకు సుమారు రూ.1000కోట్ల ఆదాయం సమకూరింది. నియోపోలీస్ లే అవుట్‌లో మొత్తం మూడు విడతల్లో జరిగిన వేలంలో.. 27 ఎకరాల విస్తీర్ణంలోని 6 ప్లాట్లను విక్రయించడం ద్వారా హెచ్ ఎండీఏ రూ.3708 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ప్లాట్ నెంబరు 19లో నాలుగెకరాలకు గాను, ఎకరా రూ. 131కోట్లకు యోలా కన్‌స్ట్రక్షన్స్ ఎల్ఎల్పీ, గ్లోబస్ ఇన్ఫ్రాకాన్ ఎల్ఎల్పీ సంస్థలు దక్కించుకున్నాయి. ప్లాట్ నెం.20లోని మరో నాలుగెకరాలను బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ఎకరాకు రూ.118 కోట్లకు కొనుగోలు చేసింది.

## ప్రైవేటీకరణతో విద్య, వైద్య వ్యవస్థలు ఛిద్రం: సీపీఐ

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానంతో విద్య, వైద్య వ్యవస్థలు చిన్నాభిన్నమైపోయాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య బుధవారం విమర్శించారు. శ్రీచైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ సంస్థలు, ప్రైవేట్ యూనివర్సిటీలు విద్యా వ్యవస్థను శాసించే స్థాయికి చేరుకున్నాయన్నారు. పీపీపీ పద్ధతిలో 10 మెడికల్ కాలేజీలతోపాటు తొలివిడతగా 4 బోధనాస్పత్రులను ప్రైవేట్‌కు అప్పగించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని తెలిపారు. ప్రభుత్వ భూమి, వనరులు, భవనాల నిర్మాణం, సిబ్బంది నియామకం, జీతాల చెల్లింపుల ద్వారా వందల కోట్ల ప్రజాధనాన్ని ప్రైవేటు శక్తులకు అప్పగిస్తుందని విమర్శించారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన 107, 108జీవోలను రద్దు చేయాలని, పీపీపీ విధానానికి స్వస్తి పలికి మెడికల్ కాలేజీలను ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని డిమాండ్ చేశారు.

# వైట్ మనీగా 78 కోట్లు

## మద్యం ముఠా పెద్దల కోసం మార్చిన చాముండ బులియన్

- 100 కోట్ల లిక్కర్ స్కాం సొమ్ము.. 4 కోట్ల కమీషన్ ఇస్తామని డీల్
- హవాలా, గోల్డ్ స్మగ్లింగ్‌లో చేతన్, రోణక్ సోదరులు సిద్ధహస్తులు
- చోఖ్రాతో షెల్ కంపెనీలు.. అసలు కథ నడిపింది అన్నదమ్ములే
- రోణక్ రిమాండ్ రిపోర్టులో సిట్..
- చేతన్ కోసం ముంబైకి టీమ్
- 5 వరకు రోణక్‌కు ఏసీబీ కోర్టు రిమాండ్

### రోణక్ కుమార్‌కు రిమాండ్

మద్యం కుంభకోణంలో ముంబై బులియన్ వ్యాపారి రోణక్ కుమార్‌కు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ఈనెల 5వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. రోణక్‌ను గుంటూరు జిల్లా జైలుకు తరలించాలని ఆదేశించారు.

అమరావతి/విజయవాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో తీగ లాగే కొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. హవాలా వ్యాపారులు, బంగారం స్మగ్లర్లతో మద్యం ముఠా నడిపిన వ్యవహారం బయటపడుతోంది. 'వంద కోట్ల రూపాయలు మీకు పంపుతాం.. నాలుగు శాతం కమీషన్ ఇస్తాం.. నల్ల డబ్బును వైట్ మనీగా మార్చి ఇవ్వండి' అంటూ ముంబైలో పేరు మోసిన హవాలా, బులియన్ వ్యాపారి పూనం భాయ్ కుమారులు చేతన్ కుమార్ (ఏ-50), రోణక్ కుమార్(ఏ-51)తో జరిపిన రహస్య లావాదేవీల గుట్టు రట్టయింది. మద్యం ముడుపుల సొమ్ము వైట్ మనీగా మార్చేందుకు అనిల్ చోఖ్రా (ఏ49) సృష్టించిన షెల్ కంపెనీల బ్యాంకు ఖాతాల్లోకి ఆదాన్, లీలా, ఎస్‌పీవై డిస్టిలరీస్ నుంచి ఆర్టీజీఎస్ ద్వారా బదిలీ అయిన రూ. 78 కోట్ల లావాదేవీల్లో రహస్యాన్ని ఛేదించారు. ఆ వివరాలను రోణక్ రిమాండ్ రిపోర్టులో సిట్ అధికారులు వెల్లడించారు. షెల్ కంపెనీల సృష్టికర్త అనిల్ చోఖ్రాను ముంబైలో అదుపులోకి తీసుకుని విజయవాడకు తీసుకొచ్చి కోర్టు అనుమతితో ఇటీవల ప్రశ్నించారు. "ముంబైలో చాముండ బులియన్ వ్యాపారి చేతన్ కుమార్ ఏపీ పెద్దలకు చెందిన వంద కోట్ల రూపాయలు వైట్ మనీగా మార్చేందుకు షెల్ కంపెనీలు సృష్టించి బ్యాంకు ఖాతాలు ఇవ్వమని కోరడంతో అవి సృష్టించి ఇచ్చాను. అందులో నాలుగు కంపెనీల బ్యాంకు ఖాతాలోకి ఆదాన్, లీలా, ఎస్‌పీవై నుంచి డబ్బులు ఆర్టీజీఎస్ ద్వారా వచ్చాయి. వాటి ద్వారా వస్త్రాలు, పాలిస్టర్ ఫిల్మ్ కొనుగోళ్లకు నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి వైట్‌గా మార్చేశా. వాటిని చేతన్, రోణక్‌కు ఎప్పటికప్పుడు ఇచ్చేవాడిని. ఆ బిల్లులు ఆదాన్, లీలా, ఎస్‌పీవైకి పలు మార్గాల్లో చేర్చేవారు. నేను బంగారం, నగదు చెల్లించాక వంద రూపాయలకు పావలా కమీషన్ (రూ. 19.5 లక్షలు) ఇచ్చారు. చాముండ బులియన్ సోదరులు 4 శాతం (రూ. 3.12 కోట్లు) డిస్టిలరీస్ నుంచి తీసుకున్నారు" అని చోఖ్రా వివరించాడు. అయితే చోఖ్రా చెప్పింది నిర్ధారించుకోవడానికి చేతన్ కుమార్‌కు సిట్ నోటీసు ఇచ్చింది. కానీ, విచారణకు రాకుండా చేతన్ కుమారుడు తన సోదరుడు రోణక్ కుమార్‌ను పంపించాడు. నవంబరు 29న సిట్ ముందు హాజరై తన అన్నకు ఆరోగ్యం బాగాలేకపోవడం వల్ల తాను విచారణకు వచ్చానని చెప్పాడు. అనిల్ చోఖ్రా కంపెనీలతో బ్యాంకు లావాదేవీల వివరాలు తెప్పించాలని సిట్ సూచించడంతో సరేనంటూ వెళ్లిపోయాడు. డిసెంబరు 2న తిరిగొచ్చి తన అన్నకు ఆరోగ్యం బాగాలేదు.. ఆడిటర్ అందుబాటులో లేడని చెప్పాడు. అయితే అనిల్ చోఖ్రాతో కలిపి విచారించేదుకు సిట్ అధికారులు సిద్ధమవగా అందుకు రోణక్ ససేమిరా అన్నాడు. చోఖ్రాతో వ్యవహారాలన్నీ చేతన్‌కే తెలుసునని, తనకు ఏవీ తెలీవని చెప్పాడు. సరే మీ అన్న చేతన్‌ను పిలపించు అని సిట్ అనడంతో అరెస్టు తప్పదన్న అనుమానం వచ్చి ముంబైకి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీనిలో అతన్ని అరెస్టు చేసినట్లు సిట్ అధికారులు రిమాండ్ రిపోర్టులో బుధవారం కోర్టుకు వివరించారు. ఇందులో కీలక వ్యక్తి అయిన చేతన్ సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేసుకోవడంతో సిట్ అధికారులు అతని కోసం ముంబైకి వెళ్లారు.

### ఆంధ్రా పెద్దలు.. అన్నకే తెలుసు..

మద్యం ముడుపుల్ని హవాలా ద్వారా వైట్ మనీగా మార్చేందుకు చాముండ బులియన్ సోదరులైన చేతన్ కుమార్, రోణక్ కుమార్‌తో మాట్లాడిన ఏపీకి చెందిన పెద్దలు ఎవరనేది తేలాలంటే చేతన్ పట్టుబడాల్సిందేనని సిట్ భావిస్తోంది. ఇద్దరు అన్నదమ్ములతో వ్యవహారం నడిపిన వ్యక్తులు ఏపీ పెద్దలని, వారెవరో తనకు తెలీదని అనిల్ చోఖ్రా చెప్పాడు. అయితే చేతన్, రోణక్‌తో సంప్రదింపులు జరిపిన ఆ పెద్దలు ఎవరని సిట్ అధికారులు రోణక్‌ను అడగ్గా 'ఆంధ్రాలో పెద్దవాళ్లని మాత్రమే అన్న చెప్పాడు. వాళ్లెవరో అన్నకే తెలుసు' అని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఆ డీల్ నడిపింది రాజ్ కసిరెడ్డి గ్యాంగేనని సిట్ అధికారులు అనుమానిస్తున్నారు. చోఖ్రా వ్యవహారం వెలుగులోకి వచ్చాక ఎవరెవరు చేతన్ సోదరులతో టచ్‌లో ఉన్నారనే విషయాలు సిట్ సేకరిస్తోంది.

### చాముండ ఖాతాల్లో వందల కోట్లు..

ఏపీ లిక్కర్ స్కామ్ సొమ్ము హవాలా చేసిన చాముండ బులియన్ పరిధిలోని వ్యాపార ఖాతాల్లోకి వందల కోట్ల రూపాయలు వచ్చి పడినట్లు సిట్ గుర్తించింది. కీరజ్ ఎంటర్‌ప్రైజెస్‌లో రూ. 375 కోట్లు, న్యూమౌంట్ గోల్డ్‌లో రూ. 143 కోట్లు, మలిస్కా గోల్డ్‌లో రూ. 135 కోట్లు, ట్రిప్పర్‌లో రూ. 124 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు కనుగొంది. అయితే ఈ సొమ్ము అంతా ఏపీ లిక్కర్ ముఠా నుంచి వచ్చిందేనా? లేక ఇతరత్రా లావాదేవీలా అనేది చేతన్ పట్టుబడితే తెలిసే అవకాశం ఉంది.

### ముగిసిన అనిల్ చోఖ్రా కస్టడీ

మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితులు పంపిన డబ్బు కోసం ముంబైలో షెల్ కంపెనీలు ఏర్పాటు చేసిన అనిల్ చోఖ్రా పోలీసు కస్టడీ బుధవారంతో ముగిసింది. దీంతో చోఖ్రాకు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కస్టడీలో పోలీసులు ఏమైనా ఇబ్బంది పెట్టారా అని న్యాయాధికారి పి.భాస్కరరావు ప్రశ్నించగా, ఏమీ ఇబ్బంది పెట్టలేదని చోఖ్రా సమాధానమిచ్చాడు. అయితే, విచారణలో తాను చెప్పిన పేరును నమోదు చేసుకోలేదని కోర్టుకు తెలిపాడు. తాను ముంబైలో మయూర్ దీపక్‌చౌడ వద్ద పనిచేశానని, ఆయన చెప్పిన పనులే చేశానని చెప్పాడు. ఇదే విషయాన్ని విచారణలో సిట్ అధికారులకు చెప్పినా.. వారు ఆ పేరును నమోదు చేయలేదన్నాడు. దీంతో చోఖ్రా చెప్పిన పేరును రికార్డు చేయాలని న్యాయాధికారి ఆదేశాలిచ్చారు. అనంతరం చోఖ్రాను విజయవాడలోని జిల్లా జైలుకు తరలించారు.



కొమ్ముబూర ఊదుతున్న కేంద్రమంత్రి జువల్ ఓరమ్

## చదువుతో పాటు సంస్కృతీ అలవర్చుకోవాలి

- 'ఏకలవ్య' విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి
- కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరమ్ సూచన
- ఉద్భవ్-2025 ఉత్సవాల ఏర్పాట్లు అద్భుతమని ప్రశంస

అమరావతి/తాడేపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా సంస్కృతి, సంప్రదాయాలు కూడా నేర్చుకోవాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరమ్ సూచించారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎంఆర్ఎస్) విద్యార్థుల ఆరో జాతీయ కల్చరల్, లిటరరీ ఫెస్ట్-కళా ఉత్సవ్.. 'ఉద్భవ్-2025'ను బుధవారం అమరావతిలోని కేఎల్ యూనివర్సిటీ వేదికగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏకలవ్య స్కూళ్ల బాలబాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. 'విద్యార్థులకు హిందీ, ఆంగ్లంతో పాటు ప్రాంతీయ భాష కూడా ముఖ్యమే. జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్ల తరహాలోనే ఈఎంఆర్ఎస్ పాఠశాలలను అభివృద్ధి చేస్తాం.. క్రీడల్లో కూడా గిరిజన విద్యార్థులు మెరుస్తున్నారు' అని తెలిపారు. ఎంతో కష్టపడి ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహిస్తోన్న ఏపీ ప్రభుత్వం, గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ముఖ్యకార్యదర్శి ఎం.మల్లికార్జున్ నాయక్‌లను ఆయన అభినందించారు. అనంతరం ఆయన్ను సంధ్యారాణి సన్మానించి వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు. అంతకుముందు ఓరమ్‌కు ఈఎంఆర్ఎస్ విద్యార్థులు గిరిజన సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. సభా ప్రాంగణం వద్ద గిరిజన సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాటుచేసిన ప్రదర్శనను, బొమ్మలను ఆయన ఆసక్తిగా తిలకించారు. బాణం ఎక్కుపెట్టి సందడి చేశారు.

### ఉద్భవ్.. మార్పునకు వేదిక: సంధ్యారాణి

ఉద్భవ్-2025 అంటే వేడుక కాదని.. గొప్ప మార్పునకు వేదికని సంధ్యారాణి అభివర్ణించారు. 405 ఈఎంఆర్ఎస్ స్కూళ్ల నుంచి 1,647 మంది తరలివచ్చారని మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా ఇంత పెద్దసంఖ్యలో చిన్నారులు పాల్గొనే వేదిక ఏపీ కావడం సంతోషకరమన్నారు. 110 మంది ఏపీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని గిరిజన బిడ్డల చదువు, పాఠశాల వసతులకు మరిన్ని నిధులివ్వాలని కేంద్రమంత్రిని అభ్యర్థించారు. గిరిజనులుండే మారుమూల ప్రాంతంలో రోడ్ల నిర్మాణం, అనుసంధానికి ప్రాధాన్యమివ్వాలని, మరిన్ని ఈఎంఆర్ఎస్ స్కూళ్లను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ హసన్ బాషా, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదా భార్గవి, గురుకులం కార్యదర్శి ఎం.గౌతమి, కేఎల్ వర్సిటీ డీన్ ప్రొఫెసర్ జీపీఎస్ వర్మ, గిరిజన నాయకుడు ధారూనాయక్ పాల్గొన్నారు.



గిరిజన సంప్రదాయ నృత్యాలు చేస్తున్న కళాకారులు

# పరీక్ష ఫీజుల్లోనూ బాదుడే

- టెన్త్ ఫీజులో ప్రైవేట్ పాఠశాలల దోపిడీ
- వాస్తవ ఫీజు కంటే అధికమొత్తంలో వసూళ్లు
- చర్యలకు పాఠశాల విద్యాశాఖ సిద్ధం
- ఇకనుంచి విద్యార్థులే చెల్లించేలా కొత్త విధానం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రైవేట్ పాఠశాలలు ఏదో ఒక పేరు చెప్పి విద్యార్థుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నాయి. పరీక్ష ఫీజులు కూడా వారి దోపిడీలో భాగమయ్యాయి. పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజుల్లోనూ భారీ బాదుడుకు దిగాయి. ప్రభుత్వ పరీక్షల విభాగం నిబంధనల ప్రకారం ఒక విద్యార్థి అన్ని సబ్జెక్టులకు కలిపి చెల్లించాల్సింది 125 రూపాయలైతే, అందుకు చాలా రెట్లు ఎక్కువగా విద్యార్థుల నుంచి ప్రైవేటు పాఠశాలలు గుంజేశాయి. విజయవాడలోని ఓ ప్రముఖ కార్పొరేట్ పాఠశాల అయితే ఏకంగా ఒక్కో విద్యార్థి నుంచి రూ.900 వసూలు చేస్తోంది. దీనిపై తల్లిదండ్రులు ప్రశ్నిస్తే.. పరీక్ష కేంద్రానికి రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని, దానికి అదనంగా చెల్లించాల్సిందేనని యాజమాన్యం చెబుతోంది. ఇక గుంటూరులో పలు పాఠశాలలు రూ. 500, చిత్తూరులో కొన్ని పాఠశాలలు రూ. 600 చొప్పున వసూళ్లు చేస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ దృష్టికి వచ్చింది. రవాణా, ఇతర సౌకర్యాలు పేరు చెప్పి చాలా ఏళ్లుగా ప్రైవేటు పాఠశాలలు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నా విద్యాశాఖ పట్టించుకోలేదు. ఈఏడాది కఠినంగా వ్యవహరించాలని అధికారులు నిర్ణయించారు. రూ. 125 కంటే అదనంగా ఎక్కడైనా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి ప్రకటన జారీచేశారు. నిర్దేశిత రుసుము కంటే అదనంగా వసూలు చేసే ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకుని, జరిమానాలు కూడా విధిస్తామన్నారు. మరోవైపు ఎక్కడైనా ప్రభుత్వ పాఠశాలల్లో అదనంగా వసూలుచేస్తే ప్రధానోపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదనపు వసూళ్లపై ఎంఈవోలు, డిప్యూటీ డీఈవో, డీఈవో, ఆర్జేడీలకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఫిర్యాదుల ఆధారంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. కాగా అధికారులే స్వచ్ఛందంగా తనిఖీలు నిర్వహించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లి ఆరా తీస్తే ఎంత కట్టించుకున్నారో తెలుస్తుందని, తల్లిదండ్రులు వచ్చి ఫిర్యాదు చేస్తేనే చర్యలు అంటే తక్కువ ఫిర్యాదులే వస్తాయని అంటున్నారు.

### ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు

ఇప్పటివరకూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ద్వారా మాత్రమే పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంది. ఈ ఏడాది నుంచి నేరుగా విద్యార్థులే చెల్లించే అవకాశం కల్పించారు. విద్యార్థులు లేదా తల్లిదండ్రులు 'బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్' వెబ్‌సైట్ ద్వారా పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. తర్వాత ఫీజు చెల్లించిన విషయాన్ని ప్రధానోపాధ్యాయుడికి తెలిపితే సరిపోతుంది. అయితే ఈలోగా అన్ని యాజమాన్యాల పాఠశాలల హెచ్ఎంలు టెన్త్ విద్యార్థుల వివరాలను యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో ధ్రువీకరించాలి. అదనపు ఫీజుల కోసం ఎవరైనా హెచ్ఎం యూడైస్ ప్లస్‌తో ధ్రువీకరించకపోయినా చర్యలు తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ తెలిపింది.


### టెట్ హాల్‌టికెట్లు విడుదల

- 97 శాతం మందికి కోరుకున్న పరీక్ష కేంద్రం

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) హాల్ టికెట్లు విడుదల అయ్యాయని, అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని టెట్ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. 2,71,692 మందికి హాల్‌టికెట్లు జారీచేశామన్నారు. 97.08 శాతం మందికి వారు కోరుకున్న తొలి ప్రాధాన్యత పరీక్ష కేంద్రాన్ని కేటాయించామన్నారు. 2.66శాతం మందికి రెండో ప్రాధాన్యత కేంద్రం, 0.2శాతం మందికి మూడో ప్రాధాన్యత కేంద్రం, 0.06శాతం మందికి నాలుగో ప్రాధాన్యత కేంద్రం కేటాయించామని వివరించారు. డిసెంబరు 10 నుంచి టెట్ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు.

# తరగతి గదిలో 'క్లిక్కర్'!

- బోధన అనంతరం పునశ్చరణలో అమలు
- రేపు 53 పాఠశాలల్లో ప్రారంభించనున్న సీఎం
- ఈ ఏడాదికి చివరికి 2,800 బడుల్లో అమలు



అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో మరో వినూత్న విధానానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో క్లిక్కర్ ఆధారిత పునశ్చరణ అమలుకు నిర్ణయించింది. తరగతి గదిలో పాఠం బోధించిన తర్వాత క్లిక్కర్ ఆధారంగా విద్యార్థులను ప్రశ్నలు అడుగుతారు. తొలుత ప్రతి విద్యార్థికి ఒక క్లిక్కర్ ఇస్తారు. అందులో ఏ, బీ, సీ, డీ, ఎస్, నో, హ్యాండ్ రైజ్ తదితర బటన్లు ఉంటాయి. తరగతి గదిలో ఉండే ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ)పై అంతకుముందు చెప్పిన పాఠానికి సంబంధించిన ప్రశ్న డిస్‌ప్లే అయినప్పుడు దానికి క్లిక్కర్ ద్వారా విద్యార్థులు సమాధానం ఇవ్వాలి. ఏ విద్యార్థి ఏ సమాధానం ఇచ్చాడో ప్యానెల్‌పై కనిపిస్తుంది. ఈ నెల 5న జరిగే మెగా పేరెంట్- టీచర్స్ మీటింగ్‌లో సీఎం చంద్రబాబు క్లిక్కర్ విధానాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. మొదట 53 పాఠశాలల్లో దీన్ని అమల్లోకి తీసుకొస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి 2,800 పాఠశాలల్లో అమల్లోకి తేవాలని పాఠశాల విద్యాశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అనంతరం దశల వారీగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు క్లిక్కర్‌లు పంపిణీ చేస్తారు. ప్రస్తుతం ప్రతి పాఠశాలకు 40 క్లిక్కర్లతో కూడిన సెట్ అందించనున్నారు. తొలుత 9వ తరగతి విద్యార్థుల పాఠాల పునశ్చరణకు వీటిని వినియోగించాలని నిర్ణయించారు.

### 'సంక్షేమ విద్యార్థి' కుటుంబాలకు స్వాంతన: డోలా

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అంబేడ్కర్ గురుకులాలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు సాంత్వన పథకం భరోసా ఇస్తోందని మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ముగ్గురు విద్యార్థుల కుటుంబాలకు సాంత్వన చెక్కులను బుధవారం అమరావతిలోని తాడేపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ కార్యాలయంలో ఆయన అందజేశారు. పల్నాడు జిల్లా ఆర్కేపురం అంబేడ్కర్ గురుకులం, ప్రకాశం జిల్లా రాచర్ల గురుకులానికి చెందిన 10వ తరగతి విద్యార్థినులు టి.నీహారిక, కొఠారి కర్ణ, బాపట్ల గురుకులం 7వ తరగతి విద్యార్థిని బి.శ్వేత ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఒక్కో విద్యార్థి కుటుంబానికి మంత్రి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. 'ఎవరైనా దురదృష్టవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి భరోసాగా సాంత్వన పథకం కింద కూటమి ప్రభుత్వం రూ.3లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. అనారోగ్యంతో మరణించిన విద్యార్థుల కుటుంబాలకూ బాసటగా నిలిచేందుకు సీఎం చంద్రబాబు సూచనలతో రూ.5 కోట్లు నిధులు కేటాయించి ఈ పథకం తీసుకొచ్చారు. సంక్షేమ విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక దృష్టిపెట్టాం. అనారోగ్యానికి గురైన విద్యార్థులను గుర్తించి వెంటనే వైద్యం అందిస్తున్నాం. ఇప్పటివరకు 30 మందికి పైగా విద్యార్థుల ప్రాణాలు కాపాడాం' అని మంత్రి తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.లావణ్యవేణి, ఎస్సీ గురుకుల సొసైటీ అధికారులు పాల్గొన్నారు.

# శ్వాస తీసుకోలేడు.. అన్నం తినలేడు

- ఏడాది గడిచినా దయనీయ స్థితిలోనే శ్రీతేజ్
- సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు ఏడాది
- కొడుకు కోసం ఉద్యోగం మానేసి తండ్రి సపర్యలు
- నెలకు రూ.1.50 లక్షల దాకా అవుతున్న ఖర్చు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా.. నిర్మాతలకు కాసుల పంట పండించి ఉండొచ్చు. అల్లు అర్జున్‌ను పాన్ ఇండియా స్టార్‌గా మరో మెట్టు ఎక్కించి ఉండొచ్చు. కానీ, ఒక కుటుంబానికి మాత్రం జీవితకాలపు పీడకలను మిగిల్చింది. రెండు తెలుగు రాష్ట్రాలను తీవ్రంగా కలవర పెట్టిన ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్ దుర్ఘటన జరిగి బుధవారంతో ఏడాది అవుతోంది. అమ్మ, నాన్న, చెల్లితో కలిసి తన అభిమాన నటుడి సినిమా చూడడానికి వెళ్లిన పదేళ్ల శ్రీతేజ్... తొక్కిసలాటలో తల్లిని కోల్పోయాడు. అదే ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీతేజ్.. తన తల్లి ఇక లేదన్న సంగతి కూడా గుర్తించలేని స్థితిలో మంచంమీద నిశ్చేష్టంగా పడి ఉంటున్నాడు. ఆస్పత్రి నుంచి శ్రీతేజ్ ఆరు నెలల కిందట డిశ్చార్జి అయ్యాడు కానీ, అతని ఇల్లే ఇప్పుడు దవాఖానాగా, మారింది. తండ్రే నర్సు అయి సపర్యలు చేస్తున్నారు. శ్రీతేజ్ తనంతట తానుగా అన్నం తినలేడు. అందుకే కడుపులోకి నేరుగా ద్రవాహారాన్ని పంపించేందుకు గ్యాస్ట్రోస్టోమీ పైపు అమర్చారు. శ్వాసకూడా తీసుకోలేడు. దాంతో గాలి నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లడానికి మెడ ముందు భాగంలో రంధ్రం చేసి ట్రాకియోస్టోమీ ట్యూబ్ పెట్టారు. శ్రీతేజ్ ఒంటినిండా ట్యూబులతో పొత్తిళ్లలో పసిబిడ్డలా ఉలుకూ పలుకూ లేకుండా పడి ఉంటున్నాడు. "రోజూ సికింద్రాబాద్‌లోని ఆసియా ట్రాన్స్‌కేర్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో కొన్ని నెలలుగా బాబుకు స్వాలో(మింగడం), స్పీచ్(మాట్లాడటం) థెరపీ ఇప్పిస్తున్నాం. అక్కడే అడ్మిట్ చేస్తే నెలకు రూ.90 వేలకు పైగా ఫీజు చెల్లించాలి. బాబును చూసుకోడానికి ఒక మనిషి అక్కడే ఉండాలి. ఇంట్లో 6ఏళ్ల నా కూతురు, 75 ఏళ్ల మా అమ్మ బాగోగులు కూడా నేనే చూసుకోవాలి. ఇంటి పనులు చక్కబెట్టుకొని.. పాపను స్కూలుకు పంపించిన తర్వాత దిల్‌సుఖ్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు రోజూ క్యాబ్‌లో బాబును తీసుకొచ్చి థెరపీలు ఇప్పిస్తున్నాను. రోజుకు రూ.2 వేల చొప్పున థెరపీలకే రూ.60 వేలకుపైన కడుతున్నాను. ఇక ఇంటి దగ్గర కూడా కాళ్లు, చేతుల కదలికలకు ఫిజియోథెరపీ చేయిస్తున్నాం. అదీ రూ.30 వేలవరకు అవుతుంది. ప్రతి నెలా కేవలం థెరపీలకే తక్కువలో తక్కువ రూ.90 వేలు కడుతున్నాను. కనీసంగా 2 నుంచి 3 ఏళ్లు నిరంతరం థెరపీలు ఇప్పిస్తే బాబు కోలుకోవచ్చని డాక్టర్లు చెప్పారు" అని శ్రీతేజ్ తండ్రి భాస్కర్ వివరించారు. "ఇదివరకు బంగారం దుకాణంలో పనిచేసేవాడిని. ప్రమాదం తర్వాత బాబును చూసుకోడానికి ఇంటిపట్టునే ఉంటున్నాను' అని చెప్పారు. శ్రీతేజ్‌కు థెరపీలు, మందులు, డైపర్లు, వంటివన్నీ కలిపి నెలకు రూ.1.25 లక్షలు పైన ఖర్చు అవుతుంది. ఇంటి అద్దెతోపాటు పాప చదువుకు, అమ్మ మందులకు అయ్యేదంతా అదనం" అని శ్రీతేజ్ బాబాయి మల్లికార్జున ఆవేదన వ్యక్తం చేశారు.



### తమదే బాధ్యత అని చెప్పారు కానీ..

తొక్కిసలాటలో తన భార్య చనిపోవడంతో అల్లు అర్జున్ కుటుంబం తన పిల్లల పేరుమీద రూ.2 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారని శ్రీతేజ్ తండ్రి భాస్కర్ చెప్పారు. ఆ మొత్తానికి ప్రతినెలా వడ్డీ తీసుకునే అవకాశం కల్పించారని, కానీ.. ఆ వడ్డీ డబ్బులు బాబు చికిత్స ఖర్చులకు ఏమాత్రం సరిపోవడంలేదన్నారు. శ్రీతేజ్ పూర్తిగా కోలుకునే దాకా తమదే బాధ్యత అని, చికిత్సకు అయ్యే ఖర్చులన్నీ భర్తిస్తామని అల్లు అర్జున్ కుటుంబం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇదే విషయమై అల్లు అర్జున్‌మేనేజర్ కాంతారావును సంప్రదించగా.. సానుకూల స్పందన రాలేదని తెలిపారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

## 12 మంది మావోయిస్టుల మృతి

- ముగ్గురు జవాన్ల మృత్యువాత.. ఇద్దరికి గాయాలు



మృతిచెందిన జవాన్లలో ఇద్దరి ఫొటోలు



వెల్ల (ఫైల్)

చింతూరు/చర్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భైరంగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుట్టల్లో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మరణించారు. ముగ్గురు డీఆర్‌జీ జవాన్లు కూడా మృతి చెందారు. మరో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. ఘటనా స్థలం నుంచి ఇన్సాస్, ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 303 తుపాకులు, ఎల్ఎంజీ మెషీన్ గన్స్, ఏకే 47లను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. భైరంగఢ్ అడవుల్లో మావోయిస్టులు సమావేశమైనట్లు పోలీసులకు సమాచారం అందింది. బీజాపూర్, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా, సీఆర్‌పీఎఫ్ బలగాలు సంయుక్తంగా కూబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలోనే మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు, ముగ్గురు జవాన్లు మృతి చెందినట్లు చెప్పారు. ఇద్దరు జవాన్లు గాయపడ్డారని, వారి పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. గురువారం కూడా ఆపరేషన్ కొనసాగుతుందని ఐజీ చెప్పారు. మృతుల్లో పీఎల్‌జీఏ రెండో బెటాలియన్ కమాండర్ మొడియం వెల్ల ఉన్నాడని, అతనిపై రూ.8 లక్షలు రివార్డు ఉందని వెల్లడించారు. కాగా ఘటనా స్థలంలో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పాపారావు ఉన్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మావోయిస్టు పార్టీ ఏటా డిసెంబరు 2 నుంచి వారం రోజుల పాటు పీఎల్‌జీఏ వారోత్సవాలను నిర్వహిస్తూ ఉంటుంది. ఈ క్రమంలో ఎన్‌కౌంటర్ జరగడం గమనార్హం. కాగా, డీఆర్‌జీ జవాన్ల త్యాగాలను వృథాగా పోనివ్వబోమని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి తెలిపారు. మావోయిస్టు పార్టీ ఆఖరి శ్వాస తీసుకుంటోందని, జవాన్లపై దాడి చేసిన వారిని వదిలిపెట్టబోమన్నారు. మృతి చెందిన జవాన్లకు నివాళులర్పించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.


MARUTI SUZUKI
NEXA
INTRODUCTING
GRAND VITARA LIMITED EDITION
EFFECTIVE PRICE OF
₹ 9.99 LAKH*
GRAND VITARA
LIMITED EDITION
GET ACCESSORY PACKAGE OF MORE THAN
₹ 75 000#
GRAND VITARA
AMBIENT LIGHT DOOR SILL GUARD (BLACK)
ALL WEATHER 3D MAT
DOOR VISOR PREMIUM (STAINLESS STEEL)
INTERIOR DOOR LIGHTING SOLUTION 4 DOOR
5 YEAR WARRANTY~
3 YEARS + 2 YEARS COMPLIMENTARY
NEXA SAFETY SHIELD
SCAN TO CONNECT TO A SHOWROOM NEAR YOU
E-BOOK TODAY @ WWW.NEXAEXPERIENCE.COM
Contact us at
1800-200-[6392]
1800-102-[6392]
For detailed T&C kindly visit your nearest dealership. Creative visualization. For details on functioning of safety features, including airbags, kindly refer to the owner's manual. *Cost of Accessories is applicable on Zeta & Alpha variants. All offers are brought to you by NEXA dealers only. *Ex. showroom price of ₹ 10.77 lakh, Exchange Offer (-) ₹ 80 000 = ₹ 9.96 lakh. The actual effective price mentioned may vary based on the customer's eligibility, profile, and applicable offers at the time of purchase. Offers may vary subject to the model and variant purchased. All offers are applicable till stocks last. Maruti Suzuki reserves the right to withdraw offers at any point in time without any advance notice. Features and accessories shown may not be a part of the standard fitment. Black glass shade on the vehicle is due to the lighting effect. Limited edition is applicable for Sigma and Delta variants of Grand Vitara. ~This extended warranty is applicable for Delta+, Zeta, Zeta+, Alpha & Alpha+ variants except CNG variants of Grand Vitara. Please visit NEXA showroom for details of the items contained in the limited edition kit.